శనివారం
26•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 211
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

నేడు గణతంత్ర దినోత్సవం





ప్రణబ్ ముఖర్జీ
నానాజీ దేశ్‌ముఖ్
భూపేన్ హజారికా

ప్రణబ్, నానాజీ, భూపేన్‌లకు భారతరత్న

ఆర్‌ఎస్‌ఎస్ మాజీ నేత నానాజీ దేశ్‌ముఖ్, ప్రఖ్యాత గాయకులు భూపేన్ హజారికాలకు మరణానంతరం అత్యున్నత పౌర పురస్కారం

తీజన్ బాయి సహ నలుగురికి పద్మవిభూషణ్, 14 మందికి పద్మభూషణ్


94 మందికి పద్మశ్రీ అవార్డులు

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

పద్మశ్రీ పురస్కార గ్రహీతల్లో మన రాష్ట్రం నుంచి ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి, పుట్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛెత్రి 5


తీజన్ బాయి (పద్మవిభూషణ్)


సీతారామ శాస్త్రి (పద్మశ్రీ)



పవిత్ర ఓటింగ్ క్రతువులో పాల్గొనండి

నేటి మన నిర్ణయాలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయి

బహుళత్వమే భారత్ బలం

గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ 5


సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మహారుద్ర సహిత సహస్ర చండీయాగం చివరిరోజైన శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి సరస్వతి, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

మహాపూర్ణాహుతి

విజయవంతంగా ముగిసిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం 2

పాలమూరుకు పచ్చజెండా

తుదిదశ అటవీ అనుమతులు జారీ

204.48 హెక్టార్ల అటవీభూములు రాష్ట్ర నీటిపారుదలశాఖకు బదిలీ

ప్రభుత్వానికి అందిన ఉత్తర్వులు

చండీయాగం పూర్ణాహుతి రోజే శుభవార్త

అనుమతులపై సీఎం కేసీఆర్ హర్షం

వేగం పుంజుకోనున్న ప్రాజెక్ట్ పనులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

దక్షిణ తెలంగాణకు అత్యంత కీలకమైన ప్రతిష్ఠాత్మక పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి తుది అటవీ అనుమతులు లభించాయి. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రతులను కేంద్ర అటవీశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రావణ్‌కుమార్‌వర్మ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం అచ్చంపేట అటవీప్రాంతంలోని 205.4811 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని రాష్ట్ర నీటిపారుదలశాఖకు బదిలీచేస్తారు. రెండవ, తుది అనుమతుల జారీ నేపథ్యంలో ప్రాజెక్టు పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. రాష్ట్ర సమగ్ర వికాసానికి నిర్వహిస్తున్న చండీయాగం పూర్ణాహుతి రోజే ఈ శుభవార్త అందడంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. కేంద్ర పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనుమతుల సాధనకు కృషిచేసిన నీటిపారుదల, అటవీశాఖ అధికారులను అభినందించారు.

బృహత్తర ఎత్తిపోతల పథకం

ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో 12.3 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయడంతోపాటు వేయికిపైగా గ్రామాలకు తాగునీరందించాలన్న ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ బృహత్తర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. ప్రాజెక్టులో భాగంగా కొన్ని పనులను చేపట్టడానికి నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలోని 205.4811 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని నీటిపారుదలశాఖకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అటవీశాఖను కోరింది. ఇందుకు అవసరమైన ప్రక్రియలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేయడంతో గతేడాది ఏప్రిల్ నెలలో కేంద్ర అటవీ సలహా కమిటీ మొదటిదశ అటవీ అనుమతులను ఇచ్చింది. తాజాగా నార్లపూర్ వద్ద అంజనగిరి జలాశయం నిర్మాణం, నార్లపూర్ అంజనగిరి-ఏదుల వీరాంజనేయ జలాశయం మధ్య టన్నెల్ తవ్వకానికి అటవీభూములు బదిలీచేసింది. ఈ మేరకు కొల్లాపూర్, పసుపుల రేంజ్ పరిధిలోని 204.48 హెక్టార్ల అటవీభూములను సాగునీటిశాఖకు బదలాయిస్తారు. ఇందులో ప్యాకేజీ-1 కింద కొల్లాపూర్ రేంజ్‌లో 170 హెక్టార్లు, ప్యాకేజీ-2 కింద కొల్లాపూర్ రేంజ్‌లో 35.6478 హెక్టార్లు, ప్యాకేజీ-4 కింద పసుపుల అడవులలోని లింగాల రేంజి పరిధిలో 0.4891 హెక్టార్లు ఉన్నాయి. అటవీ భూములకు బదులుగా ప్రత్యామ్నాయ అడవుల సృష్టికి రూ.63 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కాంపెన్సేటరీ అండ్ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా) నిధికి జమచేసింది. దీంతోపాటు నాగర్‌కర్నూలు జిల్లాలోని అచ్చంపేట పరిధిలో ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి 238 హెక్టార్ల రెవెన్యూ భూమిని కేటాయించింది. మరో 221 హెక్టార్లలో క్షీణించిన అడవులను పునరుద్ధరించనున్నారు. నదీ పరివాహక ప్రాంతాల అభివృద్ధికి, వన్యప్రాణుల సంరక్షణకు, అటవీప్రాంతం సరిహద్దుల చుట్టూ పిల్లర్ల నిర్మాణానికి వీలుగా

మిగతా 2వ పేజీలో

తెలంగాణ పోలీసులకు అత్యున్నత సేవా పతకాలు

ఒకరికి ప్రెసిడెంట్ మెడల్, 13 మందికి ఇండియన్ పోలీస్ మెడల్స్

జైళ్లశాఖకు చెందిన ముగ్గురికి కరెక్షనల్ సర్వీస్ మెడల్స్ 4

అడవిదొంగల్లో వణుకు

మామూళ్లకు అలవాటుపడిన అధికారుల్లోనూ భయం

సమస్య మూలాలపై దృష్టి కేంద్రీకరించిన సీఎం కేసీఆర్ 9

చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో నిర్లక్ష్యంపై ప్రత్యేక దృష్టి

సీఎం ఆదేశాలతో రంగంలోకి విజిలెన్స్ బృందాలు

తీగలాగినకొద్దీ బయటపడుతున్న డొంకలు

మైనర్ మినరల్స్ ఆదాయంలో భారీ వృద్ధి

లక్ష్యం రూ.690 కోట్లు.. వచ్చింది రూ.949 కోట్లు

డిసెంబర్‌నాటికి గనులశాఖ ద్వారా ఖజానాకు రూ.మూడువేల కోట్లు

ఫలితాలిస్తున్న కేటీఆర్ కృషి 3



నాగార్జునసాగర్‌కు సముద్ర విమానం

235 రూట్లలో ఉడాన్ విమానాలు

కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు ప్రకటన 11

టీఆర్‌ఎస్ ధమాకా

- పంచాయతీ ఎన్నికల్లో రెండో విడుతలోనూ గులాబీ పార్టీ హవా
- టీఆర్‌ఎస్ మద్దతుదారుల వెంటే ప్రజలు
- 88.26 శాతం పోలింగ్ నమోదు
- అత్యధికంగా ఓట్లేసిన మహిళలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండో విడుత పంచాయతీ ఎన్నికల్లోనూ పల్లెల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. ఏకగ్రీవాలతో కలుపుకొని 4,130 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా కడపటి వార్తలు అందేసమయానికి 4,122 చోట్ల ఫలితాలు వెల్లడయ్యాయి. 2,611 పంచాయతీల్లో టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ మద్దతుదారులు 837 గ్రామాలతో సరిపెట్టుకున్నారు. మిగతా 674 పంచాయతీలను ఇతర పార్టీల మద్దతుదారులు, స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పంచాయతీ రెండో విడుత ఎన్నికల్లో

మిగతా 9వ పేజీలో


ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో తొలిసారి ఓటువేసిన వినిత

రెండో విడుతలో పోలింగ్ జరిగిన గ్రామాలు: 4,130

ఫలితాలు వెల్లడైనవి: 4,122

టీఆర్‌ఎస్ :	2,611
కాంగ్రెస్ :	837
బీజేపీ :	37
టీడీపీ :	39
సీపీఐ :	13
సీపీఎం :	24
ఇతరులు :	561
ఏకగ్రీవాలు :	788
టీఆర్‌ఎస్ :	720
ఇతరులు :	68

జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత



ప్రముఖ హిందీ రచయిత్రి కృష్ణ సోబ్తీ కన్నుమూత 5

ఈబీసీ రిజర్వేషన్లపై స్టేకు నిరాకరణ

రాజ్యాంగ సవరణ చట్టం పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకారం

మూడువారాల్లో సమాధానమివ్వాలని కేంద్రానికి ఆదేశాలు





ఎర్రవల్లిలో నిర్వహించిన సహస్రచండీయాగం సందర్భంగా పూజల్లో పాల్గొన్న విశాఖ శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి, ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎంపీ కవిత భర్త అనిల్, కేటీఆర్ కుమార్తె అలేఖ్య తదితరులు



మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



శుక్రవారం ఎర్రవల్లిలో చండీమాతకు పూజలు నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, ఎంపీ కవిత దంపతులు, కేటీఆర్ కుమార్తె అలేఖ్య , సీఎంకుటుంబ సభ్యులు,బంధువులు.

మహాపూర్ణాహుతి

- వేదఘోషతో మార్మోగిన ఎర్రవల్లి
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- తొమ్మిది యాగశాలల్లో పూర్ణాహుతులు
- విజయవంతంగా ముగిసిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం
- ప్రత్యక్షంగా పాల్గొని అనుగ్రహించిన విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- రుత్విక్కులను సన్మానించిన సీఎం కేసీఆర్
- వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు





ఎర్రవల్లి సహస్ర చండీయాగంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న విశాఖ శారదా పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్రసరస్వతి, సీఎం కేసీఆర్ దంపతులు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు, ఎంపీ కవిత దంపతులు, ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ దంపతులు.. స్వామి స్వరూపానందేంద్రను సన్మానిస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు



ఎర్రవల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన సహస్ర చండీయాగం వద్ద టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎంపీ కవిత భర్త అనిల్ కుమార్



సహస్ర చండీయాగంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశక్షేమం, లోక సంరక్షణమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఐదురోజులపాటు నిర్వహించిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం విజయవంతంగా ముగిసింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో యాగం చివరిరోజైన శుక్రవారం పూర్ణాహుతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి పరిసరాలు వేదఘోషతో మారుమోగాయి. చివరిరోజున మొత్తం తొమ్మిది యాగశాలల్లో పూర్ణాహుతి జరిగింది. విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి సరస్వతి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దంపతులు, కుటుంబసభ్యులు ప్రతి మండపానికి వెళ్లి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రాజశ్యామల మండపం, బగళాముఖి మండపం, నవగ్రహ, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణవేద మండపాలలో తొలుత పూర్ణాహుతి జరిగింది. అనంతరం ప్రధాన యాగశాల అయిన చండీమాత మహా మండపంలో పూర్ణాహుతి ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం యథావిధిగా కేసీఆర్ దంపతులు మొదట రాజశ్యామలాదేవి మండపంలో పూజలు నిర్వహించారు. సమస్తత్వమే రాజశ్యామల మాతాకీ జై అంటూ వేద పండితులు సాగించిన మంత్రోచ్చారణల మధ్య పూజలు చేశారు. అక్కడ రుత్విక్కులు నిర్వహిస్తున్న పూర్ణాహుతిలో పాల్గొన్నారు. బగళాముఖీదేవి మండపంలో జరిగిన పూజల్లో వేదపండితులు 'జయ పీతాంబర ధారణి, దివ్యవేదోక్త మహా నీరాజనం సమర్పయామి' అంటూ పూజలుచేశారు. నవగ్రహ, మహారుద్ర, చతుర్వేద మండపాలలో పూర్ణాహుతి జరిగింది. సహస్రశార్షా, పురుష సంవేద పుష్పమాం, పుష్పమాలికాం సమర్పయామి, సౌభాగ్య ద్రవ్య సమర్పయామి అంటూ రుత్విక్కులు పూర్ణాహుతి నిర్వహించారు. చివరిరోజున ఇప్పటివరకు చేసిన పారాయణాలు, జపాలకు తద్దశాంశ హోమతర్పణాలను నిర్వహించారు. ప్రధాన కలశం అధిష్ఠాన దేవత మండపం వద్ద శారదా కల్పవృక్షం అనుసరించి అమ్మవారికి షోడశోపచార పూజ నిర్వహించారు. అనంతరం చతుషష్టి యోగినీ బలి, మంగళ నీరాజన సేవ నిర్వహించారు. తదుపరి అగ్ని మథనంద్వారా అగ్ని ప్రతిష్ఠ చేసి, పది కుండాల వద్ద ఇదే అగ్నితో హోమం ఆరంభించారు. ఒక్కో యజ్ఞకుండం వద్ద ఆచార్య బ్రహ్మతో కలిపి పదకొండుమంది వేదపండితులు పాయసం, తెల్లనువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని ఆహుతులిస్తూ హోమాన్ని నిర్వహించారు. అనంతరం అష్టదిక్పాలక బలి, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. చండీ సప్తశతి శ్లోకాల స్వాహాకారాలకు పాయసం, తెల్లనువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని యజ్ఞ భగవానుడికి హవిస్సుగా సమర్పించారు. మహాపూర్ణాహుతిలో భాగంగా చండీయాగ మండపంలోని అన్ని యజ్ఞకుండాల అగ్నిని ప్రధాన యజ్ఞకుండంలోకి తీసుకువచ్చి మహాపూర్ణాహుతిని ఆరంభించారు. యజ్ఞ ఆచార్యుడు మంగళద్రవ్యాలైన పసుపు, కుంకుమ, ఖర్జూర, వక్కలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, జీడిపప్పు, పటిక బెల్లం, బాదం, పచ్చకర్పూరం, గంధకచూరాలు, పూలు, పండ్లు, తమలపాలకులు, పట్టుచీరె, మారేడుకాయలు తదితరాలను పూర్ణాహుతిలో భాగంగా యజ్ఞభగవానుడికి సమర్పించారు. తరువాత వసోర్ధార.. అంటే నెయ్యిని ధారగా పూర్ణాహుతి అనంతరం యజ్ఞభగవానుడికి సమర్పించే ప్రక్రియ సాగింది. ఇదేవిధంగా మహారుద్ర, రాజ్యశ్యామల, బగళాముఖి, చతుర్వేద, నవగ్రహ యాగ మండపాల్లో కూడా షోడశోపచార పూజలు చేసి, హోమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. సువాసిని పూజ, మహదాశీర్వచనం, రుత్విక్ సన్మానం నిర్వహించారు. చండీ సప్తశతిలోని ప్రతి శ్లోకానికి నువ్వులు నెయ్యితోపాటు పాయసాన్ని కలిపి ఆహుతులు ఇచ్చారు. సుమారు వెయ్యికిలోల పాయస ద్రవ్యాన్ని దీనికోసం వినియోగించారు. ఈ పాయసాన్ని బియ్యం, నెయ్యి, పాలు, బెల్లం, తేనె, యాలకులు, జీడిపప్పు, కిస్మిస్ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారుచేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

చాలా అరుదుగా జరిగే ఇలాంటి యాగాలను చూడాలని అనేకమంది ఉత్సాహాన్ని కనబరిచారు. యాగానికి హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేశారు. ప్రతిరోజు యాగానికి తరలివచ్చిన వందలమందికి, చివరి రోజు వేలమందికి నిత్యాన్నదానాన్ని ఏర్పాటుచేశారు. యాగానికి వచ్చినవారు కూర్చోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుచేశారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనాలు అందాయా లేదా అనే విషయాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా తెలుసుకున్నారు. యాగం జరుగుతున్న ఐదు రోజులు ప్రముఖులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు కే కేశవరావు, లోక్‌సభ టీఆర్ఎస్‌లో పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌అలీ, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర అధికారులు కూడా హాజరయ్యారు. పూజల్లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు దంపతులు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత దంపతులు, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ దంపతులు, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు పాల్గొన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు కూడా పూజలకు హాజరయ్యారు.

కలే చండీ విశిష్యతే

'కలే చండీ విశిష్యతే'.. కలియుగంలో త్వరగా ఫలితాన్ని ఇచ్చేది చండీ దేవత. ఆమెను ఉపాసించి ఎంతోమంది సత్ఫలితాలను పొందారు. అమ్మవారు ఈ సప్తశతిలో ఒక మాటను అన్నది. ఎక్కడైతే ఈ సప్తశతి పఠించబడుతుందో అక్కడ నేనుంటాను. కేవలం ఉండటమే కాకుండా ఎప్పుడూ ఆ ప్రాంతాన్ని విడిచి ఉండను అన్నది. ఆమె ఎక్కడ ఉంటే అది మణిద్వీపం, సుభిక్షం, సస్యశ్యామలమై ఉంటుంది. అందువల్ల చండీ ఉపాసన ప్రశస్థమైయున్నది. సీఎం కేసీఆర్ దంపతులు చండీ సంబంధమైన అన్ని రకాల ఉపాసనలు చేశారు. దేశక్షేమం, లోక సంరక్షణమే ప్రధాన ధ్యేయంగా సంకల్పించి రాజశ్యామల, బగళాముఖి, నవగ్రహ, చతుర్వేద, మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగాన్ని చేయతల పెట్టి.. శృంగేరీ జగద్గురువులు శ్రీ భారతీతీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ మహాస్వాములవారి ఆశీస్సులను అందుకొని, గత నాలుగురోజుల నుంచి గణపతి సహస్ర మోదక హోమము, రాజ్యశ్యామలా మహా మంత్రానుష్టానము, లక్ష బగళాముఖి మహా మంత్రానుష్టానము, వెయ్యి చండీపారాయణాలు, మహారుద్ర మంత్రముల అనుష్టానములను చేసి, దశాంశ హోమ పక్షమును ఆశ్రయించి, శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మహాద్భుతంగా అన్ని యాగముల పూర్ణాహుతులు చేసి సహస్ర చండీ మహాయాగ పూర్ణాహుతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి ప్రత్యక్షంగా పాల్గొని అనుగ్రహించారు. శృంగేరీ, జీయర్, ఉడిపి పీఠాల నుంచి ప్రసాదాలు వచ్చాయి. కార్యక్రమానంతరం సీఎం కేసీఆర్ రుత్విక్కులను ఘనంగా సన్మానించారు. భక్తినిష్ఠలతో సాగిన యాగంతో ఎర్రవల్లి పుణ్యక్షేత్రాన్ని తలపించింది. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. వందలమంది రుత్విక్కులు పారాయణాలు చేశారు. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రత్యక్షంగా యాగ పర్యవేక్షణ చేశారు. ఒక్కో రోజు ఒక్కో రంగు వస్త్రాల్లో రుత్విక్కులు పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలు, నియమ నిష్ఠలతో పూజల్లో పాల్గొన్నారు.

పాలమూరుకు పచ్చజెండా

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.04 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, షష్ఠి సాయంత్రం 4.21 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: హస్త మధ్యాహ్నం 3.05 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: ఉదయం 9.25 నుంచి 11.01 వరకు, రాహుకాలం ఉదయం 9.41 నుంచి 11.05 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.53 నుంచి 8.23 వరకు, వర్జ్యం: రాత్రి 10.52 నుంచి 12.28 వరకు.

మొదటిపేజీ తరువాయి...

ప్రత్యేకంగా రూ.1.62 కోట్లు కేటాయించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అత్యంత ప్రాధాన్యం గల ప్రాజెక్ట్‌గా పరిగణించి పనులు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 7న సాగునీటిరంగంపై జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలతో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, అడిషనల్ పీసీసీఎఫ్ (ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్) శోభ తదితరులు విధివిధానాలను పూర్తి చేసి తుది అటవీ అనుమతులు సాధించడంలో ప్రత్యేకంగా కృషిచేశారు.




పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం రాష్ట్ర నీటిపారుదల శాఖకు కేంద్రం బదలాయించనున్న అచ్చంపేటలోని 204.48 హెక్టార్ల అటవీ భూమి (తెల్లరంగులో ఉన్న ప్రాంతం)

యాగ ఫలం వచ్చింది..

శుక్రవారం.. ఒకపక్క సహస్ర చండీయాగంలో పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతున్నది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి.. యాగంలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వచ్చి 'సర్.. ఒక మాట.. మన రాష్ట్రానికి గుడ్ న్యూస్ సర్.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వచ్చాయి' అని చెప్పారు. ఈ శుభవార్త వినగానే ఒక్కసారిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌లో ఆనందం! యాగఫలం అప్పుడే వచ్చిందని సంతోషం వ్యక్తంచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే అధికారులను అభినందించారు. తెలంగాణకు, ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు రైతాంగానికి శుభదినమని అన్నారు. ఇక పనుల్లో వేగం పెంచాలని అక్కడికక్కడే ముఖ్యమంత్రి ఆదేశించారు. తక్షణం కార్యక్షేత్రంలోకి దిగాలని నీటిపారుదల శాఖ అధికారులను కూడా ఆదేశించారు. పూర్ణాహుతి కార్యక్రమం అయ్యేలోపే ఉత్తర్వులు రావడం, వెనువెంటనే పనులపై కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు సూచనలు ఇవ్వడం యాగశాల వద్ద కనిపించింది.

సీఎం కేసీఆర్ చొరవతోనే అనుమతులు

- మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి



నమస్తే తెలంగాణ ప్రతినిధి, మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతోనే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సమస్యలు తొలిగిపోతున్నాయని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత, మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడారు. వెనుకబడిన పాలమూరు కరువును తొలిగించేందుకు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంతోపాటు 'పాలమూరు- రంగారెడ్డి' పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. కొంతమంది వ్యక్తిగత రాజకీయ స్వార్థాలతో ఈ పథకాన్ని నిలిపి వేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఈ అంశాన్ని పలుమార్లు పార్లమెంటులో ప్రస్తావించామని, కేంద్ర మంత్రులు, ప్రధాని దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రమంత్రులతో పలుమార్లు చర్చించారని గుర్తుచేశారు. ఈ కారణంగానే పాలమూరు ఎత్తిపోతల పథకానికి కేంద్రం అనుమతులను మంజూరు చేసిందని చెప్పారు.

సీఎం యాగం ఫలించింది

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ యాగం ఫలించిందని, పూర్ణకుంభంతో పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులు వస్తున్నాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చాలా ప్రయత్నాలుచేసినా.. సీఎం కేసీఆర్ పట్టుదలతో ప్రాజెక్టును నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సుభిక్షంకోసం చేస్తున్న యాగం చివరిరోజున పాలమూరు ప్రాజెక్టుకు అటవీ అనుమతులు రావడంపై సంతోషం వ్యక్తంచేశారు. పాలమూరు ప్రజలు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. దేశంలో ఉన్న నీరు మొత్తం ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించడం కేసీఆర్‌కే సాధ్యమని, కేసీఆర్‌ను ఢిల్లీ పీఠం ఎక్కించాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

ఇక పాలమూరు కరువు తీరడం ఖాయం

- జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి



మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి : త్వరలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా కరువు పూర్తిస్థాయిలో తీరడం ఖాయమని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. గత పాలకులు దత్తతపేరుతో ఈ జిల్లాను దగాచేశారని, సాగునీటి వాటా అందకుండాచేసి కరువు జిల్లాగా మార్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గోస నుంచి పాలమూరును విముక్తి చేయడానికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారన్నారు. ఉమ్మడి జిల్లా కరువును పాలమూరు ఎత్తిపోతల ద్వారా తీర్చేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటే కొంతమంది స్వార్థంకోసం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కోర్టులను ఆశ్రయించారని లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర ఎంపీల కృషివల్ల నేడు పాలమూరు ఎత్తిపోతలకు అటవీశాఖ అనుమతులు లభించాయన్నారు. పనులు పూర్తయ్యేవరకు విశ్రమించకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలందరం సమిష్టిగా కృషిచేస్తామని, మూడేండ్లలో జిల్లాను పూర్తిస్థాయిలో పచ్చబరుస్తామని స్పష్టం చేశారు.

పాలమూరు రైతులకు మంచిరోజులు

- వనపర్తి ఎమ్మెల్యే ఎస్ నిరంజన్‌రెడ్డి



నమస్తే తెలంగాణ, హైదరాబాద్: పాలమూరు రైతులకు మంచిరోజులు వచ్చాయని వనపర్తి ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు ఏర్పడ్డ అడ్డంకులు సీఎం కేసీఆర్ కృషి, పట్టుదలతోనే తొలిగిపోయాయన్నారు. పాలమూరును ఆరుదశాబ్దాలుగా అంధకారానికి గురిచేసిన కాంగ్రెస్.. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సైంధవపాత్ర పోషించిందని, కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టు పనులు అడ్డుకున్నదని ఆరోపించారు. కానీ, ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పబలం ముందు కాంగ్రెస్ కుట్రలు పటాపంచలయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పుట్టగతులుండవన్న దుగ్ధతోనే కాంగ్రెస్ ప్రతీ ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేసిందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారని, ఇప్పుడు కాంగ్రెస్ వాదనలను న్యాయస్థానాలు కూడా తిరస్కరిస్తున్నాయని అన్నారు. ఇదో గొప్ప సందర్భమని అభివర్ణించారు.

లోకం పోకడ



కంటి వెలుగు @ 1.37కోట్లు

- 8301 గ్రామాలు, 695 మున్సిపల్ వార్డుల్లో శిబిరాలు పూర్తి
- శుక్రవారం 77,537మందికి కంటిపరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో ఇప్పటివరకు 1,37,71,077 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 21,07,539 మందికి కండ్లద్దాలను అందజేశారు. మరో 16,34,553 మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు. శస్త్రచికిత్సలకు 8,54,764 మందిని రిఫర్‌చేశారు. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 8,301 గ్రామాలు, 695 మున్సిపల్ వార్డుల్లో కంటిపరీక్షలు పూర్తిచేశారు. కాగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 77,537 మందికి కంటిపరీక్షలు నిర్వహించి.. 5,784 మందికి కండ్లద్దాలు అందజేశారు. మరో 4,836 మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	శుక్రవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	77,537	1,37,71,077
రీడింగ్ అద్దాలు పొందినవారు	5,784	21,07,539
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	4,836	16,34,553
కంటి సమస్యలపై రెఫరల్	3,660	8,54,764
కంటి సమస్యలులేనివారు	63,267	91,74,221

బృహత్తర కార్యక్రమం



సీఎం కేసీఆర్ సార్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం బృహత్తరమైనది. నేను కొంత కాలంగా కంటిసమస్యతో బాధపడుతున్నాను. కంటివెలుగు శిబిరంలో వైద్యులు పరీక్షించి కండ్లద్దాలు ఇచ్చారు. కంటి సమస్యకు పరిష్కారం దొరికింది. కేసీఆర్ ప్రభుత్వం పేదవానికి అండగా నిలబడుతున్నదనడానికి ఈ కార్యక్రమమే ఉదాహరణ.

– కోటా నాగేశ్వరరావు, బ్రాహ్మణబజార్, భద్రాచలం

ఖనిజాల ఖజానా ఫుల్

మైనర్ మినరల్స్ ఆదాయంలో భారీ వృద్ధి

లక్ష్యం రూ.690 కోట్లు.. వచ్చింది రూ.949 కోట్లు

డిసెంబర్‌నాటికి గనులశాఖ ద్వారా ఖజానాకు రూ.మూడువేల కోట్లు

ఐదేండ్లలో రెట్టింపు అయిన గనులశాఖ ఆదాయం.. ఫలితాలిస్తున్న కేటీఆర్ కృషి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మైనర్ మినరల్స్ ద్వారా వచ్చే ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదయింది. రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాలతో గత ఐదేండ్లలో గనులశాఖ ఆదాయం రెట్టింపు అయింది. ఏటేటా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నది. గనులశాఖ ద్వారా 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.4,060.03 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. డిసెంబర్ చివరినాటికి రూ.2,957.11 కోట్ల ఆదాయం వచ్చింది. ఇది నిర్దేశిత లక్ష్యం కంటే రూ.51.33 కోట్లు అధికంగా ఉండటం విశేషం. మైనర్ మినరల్స్‌లో రూ.1,015.05 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. ఇప్పటికే రూ.949.59 కోట్లు వచ్చింది. వాస్తవానికి డిసెంబర్ చివరినాటికి నిర్దేశిత లక్ష్యం రూ.690.24 కోట్లు కాగా.. అంతకంటే రూ.259 కోట్లు అధికంగా రావడం విశేషం. ఇది నిర్దేశిత లక్ష్యం కంటే 138 శాతం ఎక్కువ. కాగా, గత సంవత్సరం కంటే రూ.362 కోట్లు అధికంగా ఆదాయం వచ్చిందని గనులశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆర్థిక సంవత్సరం చివరినాటికి గనులశాఖ ఆదాయం పెంపులో మైనర్ మినరల్స్‌ది కీలకపాత్ర అవుతుందని అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మేజర్ మినరల్స్ ద్వారా రూ.185 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.168 కోట్లు ఆదాయం వచ్చింది. సింగరేణి బొగ్గుగనుల ద్వారా రూ.1,553 కోట్ల ఆదాయం వచ్చింది. ఇసుక ద్వారా రూ.468 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.446 కోట్లు వచ్చింది. ఇలా అన్ని రకాల గనుల ద్వారా రూ.నాలుగువేల కోట్ల ఆదాయలక్ష్యాన్ని సులువుగా చేరుకోగలుగుతామని అధికారులు భావిస్తున్నారు.

ఫలితాలిస్తున్న కేటీఆర్ కృషి

రాష్ట్రం ఏర్పాటయ్యాక గనుల తవ్వకాలు, లీజులు, రాయల్టీ వసూళ్లు, నిఘావ్యవస్థను పటిష్ఠపర్చడం, పారదర్శక విధానాలు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంలో అప్పటి గనులశాఖ మంత్రి కే తారకరామారావు కృషిచేశారు. ఒకేచోట పాతుకపోయిన అధికారులను భారీఎత్తున బదిలీలుచేశారు. మంచి పనితీరు కనబరిచిన అధికారులకు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలను అందించారు. అనేక సంస్కరణలు అమలుచేశారు. అనుమతులు, లీజుల మంజూరులో ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో మైనర్ మినరల్స్‌లో 2,793 లీజులు ఇచ్చారు. మైనర్ మినరల్స్ పరిధిలోకి బ్లాక్‌గ్రానైట్, కలర్‌గ్రానైట్, మార్బుల్, స్టోన్, రోడ్‌మెటల్, మొరం, లైమ్‌స్టోన్ స్లాబ్ లాంటివి ఉన్నాయి. లీజులు తీసుకొని నిరుపయోగంగా ఉంచేవారిపట్ల కఠినంగా వ్యవహరించారు. బినామీ లీజులకు చెక్‌పెట్టారు. వారికి కేటాయించిన లీజు ప్రాంతాల్లో మాత్రమే తవ్వకాలు జరిపేవిధంగా జియోఫెన్సింగ్ విధానాన్ని అమలుచేశారు. ఇలాంటి నిర్ణయాలతో ఐదేండ్లలో ఆదాయం రెట్టింపు అయింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో గనులశాఖ ద్వారా రూ.1,968 కోట్ల ఆదాయం రాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.నాలుగు వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనావేస్తున్నారు. మేజర్ మినరల్స్ కేంద్ర ప్రభుత్వ పరిధిలో, మైనర్ మినరల్స్ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. మైనర్ మినరల్స్ నిర్వహణపై పూర్తిస్థాయి దృష్టిపెట్టడంతో గణనీయంగా ఆదాయం పెరిగింది.

గనులశాఖ ద్వారా వచ్చిన ఆదాయం..

ఆర్థిక సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2014-15	1,968
2015-16	2,774
2016-17	3,142
2017-18	3,704
2018-19	2,957 (డిసెంబర్‌నాటికి)

2018-19 ఆర్థిక సంవత్సరంలో..

లక్ష్యం	రూ.4,060.03 కోట్లు
డిసెంబర్‌నాటికి లక్ష్యం	రూ.2,905.78 కోట్లు
చేరుకున్న లక్ష్యం	రూ.2,957.11 కోట్లు

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో డిగ్రీ లెక్చరర్ అభ్యర్థుల మార్కులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి గత నవంబర్, డిసెంబర్లలో నిర్వహించిన ఇంటర్వ్యూల మార్కుల జాబితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఏ వాణీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో 62, కామర్స్‌లో 93, మైక్రో బయాలజీలో 36, బొటనీలో 32, జువాలజీలో 32, సోషియాలజీలో 1 చొప్పున పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు.


- రాష్ట్రంలోని నాన్-క్లినికల్ శాఖలోని ట్యూటర్స్ పోస్టుల భర్తీకి గత అక్టోబర్ 23, 24 తేదీల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్లో పెట్టారు. ఎంపికైనవారు ఈ నెల 30న నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, పూర్తి వివరాలు www.tspsc.gov.in వెబ్‌సైట్లో ఉన్నాయని తెలిపారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టుల్లో ఓపెన్ కోటా అభ్యర్థులకు 10 శాతం

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ నేపథ్యంలో 10 శాతం పోస్టులను గిరిజన ప్రాంతంలోని ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులకు కేటాయించామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు. మిగిలిన 90 శాతం పోస్టులు పూర్తిగా గిరిజన అభ్యర్థులతో భర్తీ చేస్తామని, ఆర్టికల్ 342 ప్రకారం ఈ మేరకు భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి గతంలో టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ఇచ్చిన వెబ్ అప్షన్లను రద్దు చేశామని, పూర్తి వివరాలతో అర్హులైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు మళ్లీ నమోదు చేసుకోవడానికి ఈ నెల 28 నుంచి 31 వరకు గడువు విధించామని తెలిపారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు





గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుద్దీపాల వెలుగులో అసెంబ్లీ భవనం.

దివ్యాంగుల సేవకు జాతీయ గుర్తింపు

- రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ
- అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగుల ఓటింగ్ పెంచడంలో కృషి



రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ శైలజ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచడంలో విశేష కృషిచేసిన రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ శైలజ జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. 2018లో పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఉత్తమంగా విధులు నిర్వర్తించిన 10 మంది అధికారులకు కేంద్రఎన్నికల సంఘం జాతీయస్థాయి అవార్డులు ప్రకటించింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఢిల్లీలో ప్రదానం చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఏర్పాట్లను గుర్తిస్తూ భారత ఎన్నికల సంఘం ప్రత్యేక క్యాటగిరీలో అవార్డును అందించింది. తెలంగాణలో దివ్యాంగులు ఓటువేసేలా అవగాహన కల్పించేందుకు శైలజ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా రికార్డుస్థాయిలో ఈసారి 4.57 లక్షల దివ్యాంగుల ఓట్లు నమోదయ్యాయి. అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ఎపిక్ కార్డులు ప్రింట్ చేయించి జారీచేశారు. మాక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి ఓటేసే విధానంపై అవగాహన కల్పించారు. అవార్డు అందుకున్న అనంతరం బీ శైలజ మాట్లాడుతూ.. తెలంగాణకు అవార్డు దక్కడం సంతోషంగా ఉన్నదన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఓటు ప్రాధాన్యాన్ని దివ్యాంగులకు వివరించి, అసెంబ్లీ ఎన్నికల్లో భాగస్వాములను చేశామన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషిచేద్దాం

- రాష్ట్ర ప్రజలకు గవర్నర్ నరసింహన్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరులను, త్యాగమూర్తులను ప్రజలందరూ స్మరించుకోవాలని, వారి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. నిరంతర కృషి, అనేక సంక్షేమ పథకాల అమలుతో తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్నివర్గాల వారికి సమంగా అందాలని ఆకాంక్షించారు.

సమాఖ్యస్ఫూర్తి పరిఢవిల్లాలి

- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. నిజమైన సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా భారత ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

తెలంగాణ పోలీసులకు అత్యున్నత సేవా పతకాలు

ఒకరికి ప్రెసిడెంట్ మెడల్, 13 మందికి ఇండియన్ పోలీస్ మెడల్స్

జైళ్లశాఖకు చెందిన ముగ్గురికి కరెక్షనల్ సర్వీస్ మెడల్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ / మాదన్నపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు పోలీసులకు దేశ అత్యున్నత పోలీస్ మెడల్స్ వరించాయి. రాష్ట్రపతి పోలీస్ మెడల్‌కు ఒకరు ఎంపికవగా, మరో 13 మంది ఇండియన్ పోలీస్ మెడల్స్‌కు లభించాయి. జైళ్లశాఖకు చెందిన ముగ్గురిని కరెక్షనల్ సర్వీస్ మెడల్స్‌కు ఎంపికచేశారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ జాబితాను విడుదల చేసింది. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ తెలంగాణ పోలీస్ ప్రతిష్ఠను మరింత పెంచాలని అవార్డులకు ఎంపికైన అధికారులకు డీజీపీ మహేందర్‌రెడ్డి, జైళ్లశాఖ డీజీ వినయ్‌కుమార్‌సింగ్ అభినందనలు తెలిపారు.

ప్రెసిడెంట్ మెడల్



ఎం మధుసూదన్‌రెడ్డి, అదనపు ఎస్పీ, ఏసీబీ

ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైనవారు



ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్పీ, సంగారెడ్డి



ఈ రాంచంద్రా రెడ్డి, డీసీపీ, రాచకొండ



డీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీ, కొత్తగూడెం



ఎస్ ప్రభాకర్‌రావు, డీఎస్పీ, ఫింగర్ ప్రింట్స్ బ్యూరో



వీ సూర్యచంద్ర రావు, డీఎస్పీ, స్టేట్ క్రైమ్ రికార్డ్స్



ఖాజ మొహినుద్దీన్, ఎస్‌ఐ, సీఐ సెల్, ఇంటెలిజెన్స్



మక్బూల్‌పాష, ఎస్‌ఐ, సిటీ స్పెషల్ బ్రాంచ్, వరంగల్



మహ్మద్ అలీఖాన్ ముక్తార్, ఏఆర్‌ఎస్‌ఐ, సీఐ సెల్, ఇంటెలిజెన్స్

- ఎం నారాయణ, ఎస్పీ, సీఐడీ
- ఎస్ ఫ్రాన్సిస్, అసాల్ట్ కమాండెంట్, 15వ బెటాలియన్, టీఎస్‌ఎస్పీ
- రాంప్రకాశ్, కమాండెంట్, 15వ బెటాలియన్, టీఎస్‌ఎస్పీ
- జీఎల్ నర్సింహారావు, హెడ్ కానిస్టేబుల్ (1688), స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో
- మహ్మద్ అజీజుద్దీన్, కానిస్టేబుల్ (716), ఏసీబీ, వరంగల్ రేంజ్, వరంగల్

కరెక్షనల్ సర్వీస్ అవార్డులకు ఎంపికైనవారు



వెంకటేశ్వర్లు, చీఫ్ వార్డర్, మహబూబాబాద్ జైలు



సయ్యద్ ఖాజాపాషా, హెడ్ వార్డర్, చర్లపల్లి జైలు



ముక్తేశ్వర్, రిటైర్డ్ వార్డర్, నల్లగొండ జైలు

ఓటేస్తేనే ప్రశ్నించే అధికారం

- సార్వత్రిక ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదు కావాలి
- 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఓటరు దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ పిలుపు



అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించిన అధికారులకు అవార్డులు అందజేస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ ఉన్నారు. అవార్డులు స్వీకరిస్తున్న సోమేశ్‌కుమార్, అంజనీకుమార్, దానకిశోర్, జ్యోతి బుద్ధప్రకాశ్, అమ్రపాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఓటు వేసినప్పుడే ప్రభుత్వాలను ప్రశ్నించేందుకు అధికారం వస్తుందని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 90శాతం పోలింగ్ నమోదు కావాలని, ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటురాజ్యాంగం కల్పించిన హక్కుఅని, ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్భయంగా ఓటువేసి నచ్చిన అభ్యర్థిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని కోరారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదై ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠం చేయడానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామీణప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరుగుతున్నా.. పట్టణాల్లో పెరుగడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఓటును అమ్ముకోవడం నేరంగా భావించాలని చెప్పారు.

ఎన్నికల సంఘానికి అభినందనలు

ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని గవర్నర్ నరసింహన్ ప్రశంసించారు. స్వేచ్ఛాయుత, శాంతియుతమైన వాతావరణంలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డిని అభినందిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర సీఈవో రజత్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించామని, ప్రతీ ఒక్కరూ ఓటు వేసేలా సౌకర్యాలు కల్పించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడుతలో ఎన్నికలు నిర్వహించి, రీపోలింగ్‌కు అవకాశం లేకుండా సహకరించిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి, జాయింట్‌సీఈవో అమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

16 మంది అధికారులకు అవార్డులు

2018 అసెంబ్లీ ఎన్నికల్లో సమర్థంగా పనిచేసిన 16 మంది వివిధ ప్రభుత్వశాఖల అధికారులకు సీఈవో కార్యాలయం ప్రకటించిన అవార్డులను గవర్నర్ నరసింహన్ అందజేశారు.

సోమేశ్‌కుమార్‌ను అభినందించిన దేవీప్రసాద్

ఎన్నికల సంఘం అవార్డును స్వీకరించిన ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్‌ను రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ అభినందించారు. రాష్ట్రంలో అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేస్తున్నారన్నారు.ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్న టీఎస్‌బీసీఎల్ సీనియర్ జీఎం సురేష్ ఓత్కర్, మేనేజర్ బ్రహ్మశ్రీని అభినందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సీనియర్ అధికారులు అజయ్‌రావు, క్కురుషీ, వివేకానందరెడ్డి, హరికిషన్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి: కేటీఆర్, కవిత

2019 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారకరామారావు కోరారు. శుక్రవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ట్విట్టర్‌లో స్పందిస్తూ.. ఓటరుగా నమోదు చేసుకున్నవారంతా వచ్చే ఎన్నికల్లో ఆ హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు ఓటుహక్కును వినియోగించుకోవడంపై కసరత్తు చేయాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల విధానాలు తెలుసుకోవాలని ట్విట్టర్‌లో సూచించారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలు

1. సోమేశ్‌కుమార్	ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ
2. అంజనీకుమార్	హైదరాబాద్ పోలీస్ కమిషనర్
3. దివ్య	కలెక్టర్, ఆదిలాబాద్ జిల్లా
4.సర్ఫరాజ్ అహ్మద్	కలెక్టర్ , కరీంనగర్ జిల్లా

ప్రత్యేక అవార్డు గ్రహీతలు

1.జ్యోతి బుద్ధప్రకాశ్	అడిషనల్ సీఈవో
2. అమ్రపాలి	జాయింట్ సీఈవో
3. దానకిశోర్	జీహెచ్ఎంసీ కమిషనర్
4. ఆర్వీ కర్ణన్	కలెక్టర్, ఖమ్మం జిల్లా
5.లోకేశ్‌కుమార్	కలెక్టర్, రంగారెడ్డి జిల్లా
6.అనితారామచంద్రన్	కలెక్టర్, యాదాద్రి భువనగిరి
7.వీ వెంకటేశ్వర్లు	భూపాలపల్లి రిటర్నింగ్ అధికారి
8.బీ యాదగిరి	డిప్యూటీ సీఈవో
9. ఎంఏ ఫాహిం సాబెరీ	కన్సల్టెంట్
10. సయ్యద్ ఆరిఫ్	సెక్షన్ ఆఫీసర్
11. ఐవీ భాస్కర్‌కుమార్	సెక్షన్ ఆఫీసర్
12. ఎస్ నరహరి	సెక్షన్ ఆఫీసర్
13.కే వెంకటేశ్వర్‌రావు	సెక్షన్ ఆఫీసర్
14. సీహెచ్ సాయికుమార్	తహసీల్దార్
15. శీర్ల శ్రీనివాస్	అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్
16. జే నాగేశ్వర్‌రావు	బూత్‌లెవల్ ఆఫీసర్ (వైరా)

ట్యాంపరింగ్‌పై సవాళ్లకు సిద్ధమే

- ఎవరైనా నిరూపించవచ్చు
- మాజీ సీఈసీ రావత్ ఓటుపై విచారణ
- సోషల్ మీడియాకూ మోడల్‌కోడ్ : సీఈవో రజత్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న సీఈవో రజత్‌కుమార్. చిత్రంలో అడిషనల్ సీఈవో జ్యోతి బుద్ధప్రకాశ్, జాయింట్ సీఈవో అమ్రపాలి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : ఈవీఎంల ట్యాంపరింగ్ నిరూపణకు ఎవరొచ్చినా ఎన్నికల కమిషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని సీఈవో రజత్‌కుమార్ అన్నారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ జరుగకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. ఎవరైనా ఈవీఎంల ట్యాంపరింగ్‌కు యత్నిస్తే అవి ఆటోమేటిక్‌గా షట్‌డౌన్ అవుతాయని, మళ్లీ ఓపెన్ కావని చెప్పారు. ఈ అంశంపై ఈసీ, సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాలలో వివరణ ఇచ్చి కొట్టిపారేశాయని అన్నారు. శుక్రవారం ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై ప్రతిపక్ష పార్టీలు సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు 'నో కామెంట్' అంటూ దాటవేశారు. పార్లమెంట్‌లో అన్ని రాజకీయ పక్షాలు ఆమోదించిన మేరకే ఈవీఎంలను ప్రవేశపెట్టినట్లు రజత్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతున్నదని, ఇంకా ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఓటర్ల సమస్యలను పరిష్కరించేందుకు కొత్త టెక్నాలజీతో 1950 టోల్ ఫ్రీ నెంబర్‌ను వచ్చే నెల 1 నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ నెంబర్‌కు వచ్చే ప్రతీ ఫోన్‌కాల్‌కు 30 సెకన్లలో స్పందించి సంబంధిత అధికారి సరైన సమాధానాన్ని అందజేస్తారని తెలిపారు. ప్రజలకు చేరువగా ఎన్నికల కమిషన్ వచ్చేందుకు టెక్నాలజీని ప్రవేశపెడుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల నమోదులో ఇప్పటి వరకు 16 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

మాజీ సీఈసీ రావత్ ఓటుపై విచారణ

మాజీ సీఈసీ రావత్ ఓటును హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో నమోదైన విషయంపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు సీఈవో రజత్‌కుమార్ తెలిపారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించినట్టు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ అంటే ఆశామాషీ కాదని, మూడు నెలల పాటు నిరంతరంగా పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సోషల్ మీడియాపై నియంత్రణ

సోషల్ మీడియాపై కూడా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై తీసుకునే మోడల్‌కోడ్ నియమ నిబంధనలను వర్తింపజేస్తామని సీఈవో రజత్‌కుమార్ తెలిపారు. గత ఎన్నికల్లో సోషల్ మీడియాను ఎలా నియంత్రించాలనే దానిపై అధ్యయనం చేశామని, వచ్చే ఎన్నికల్లో దానిపై ప్రధాన దృష్టి పెడుతామని చెప్పారు. ప్రధానంగా ట్విట్టర్, ఫేస్‌బుక్, గూగుల్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడినట్టు తెలిపారు. 2018 ఎన్నికల్లో పోటీ చేసిన 1,821 మంది అభ్యర్థుల్లో 72 మంది ఎన్నికల ఖర్చుల వివరాలు అందించలేదని చెప్పారు. వారందరికీ నోటీసులు జారీ చేశామని, ఎన్నికలు పూర్తయిన 30 రోజుల్లో అభ్యర్థులు చేసిన ఖర్చులకు లెక్కలు అప్పగించాల్సి ఉందన్నారు. గడువులోగా ఖర్చుల వివరాలను అందించాలని లేనిపక్షంలో వారు అనర్హతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో జ్యోతి బుద్ధప్రకాశ్, జాయింట్ సీఈవోలు ఆమ్రపాలి కాటా, రవికిరణ్, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కాంగ్రెస్

- ఎంపీ బూర నర్సయ్య విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతిసేలా వ్యవహరిస్తున్నదని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. ఈవీఎంలను ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని, ఇప్పుడు ఆ పార్టీయే విమర్శలు చేస్తున్నదని అన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్..ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశమని, అన్ని దేశాలూ ఇండియాను ప్రశంసిస్తుంటే కాంగ్రెస్ వైఖరి మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నదని చెప్పారు. తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో గెలిచిందని.. గెలిచిన చోట ఈవీఎంలపై మాట్లాడకుండా ఓడిపోయిన దగ్గర మాట్లాడటాన్ని ఆయన ప్రశ్నించారు. ఆ పార్టీ సీనియర్ నేత కపిల్ సిబల్ ఇతర దేశాల్లో మన ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచేలా మాట్లాడారని, ఇది కాంగ్రెస్ పార్టీ నాయకుల భావదారిద్ర్యానికి నిదర్శనమన్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో సీఎం కేసీఆర్‌ది కీలక పాత్ర కాబోతున్నదని చెప్పారు.

దివాళాకోరుతనంతోనే ఆరోపణలు

- తెలంగాణ న్యాయవాదుల జేఏసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్, కూటమి నేతలు దివాళాకోరుతనంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ మండిపడింది. ప్రజాతీర్పును గౌరవించకపోవడం వారి బలహీనతకు నిదర్శనమని శుక్రవారం తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ కొణతం గోవర్దన్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, చక్రధర్‌రెడ్డి తదితరులు జారీచేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నదుల పునరుజ్జీవంపై ముసాయిదా సిద్ధంచేయాలి

- అధికారులను ఆదేశించిన సీఎస్ జోషి



శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఉత్తర్వులకు ముందే పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలను నదుల పునరుజ్జీవనంపై రూపొందించిన ముసాయిదాలో పొందుపరచాలని సీఎస్ ఎస్కే జోషి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన జీవనాన్ని అందించేందుకు తీసుకున్న చర్యలను స్పష్టంగా వివరించాలన్నారు. ముసాయిదా నివేదికపై శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నదుల పునరుజ్జీవనంపై జనవరి 31 వరకు నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నివేదికలో హరితహారం, మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పార్కుల ఏర్పాటు తదితర అంశాలన్ని పొందుపరచాలన్నారు.

పాలమూరుపై కుట్రలు పటాపంచలు

- కోర్టుల్లో కేసులు.. హరిత ట్రిబ్యునల్‌కు ఫిర్యాదులు
- ఇటు కాంగ్రెస్ నేతలు.. అటు ఏపీ అడ్డంకులు
- అన్నింటినీ ఛేదించుకుంటూ తుది అనుమతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అడుగడుగునా ఎదురవుతున్న అడ్డంకులను ఛేదించుకుంటూ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు ముందుకు దూసుకెళ్తున్నాయి. ఇటు కాంగ్రెస్ నేతలు, అటు ఏపీ ప్రభుత్వం కోర్టుల్లో ఎన్ని కేసులు వేసినా.. హరిత ట్రిబ్యునల్‌తోపాటు, కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పర్యావరణ తుది అనుమతులు సాధించింది. అతి తక్కువ సమయంలో అవసరమైన అన్ని అనుమతులు సాధించి కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పటికే రికార్డు సృష్టించగా.. తాజాగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్‌ఎల్‌ఐ)అవరోధాల్ని అధిగమిస్తూ అనుమతుల పరంపరను ప్రారంభించింది. పాత మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా జిల్లాల పరిధిలో వేలాది గ్రామాలతోపాటు, హైదరాబాద్‌కు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా తాగునీరు అందనున్నది.

తక్కువ ముంపు.. ఆయకట్టు పెంపు..

జూరాల జలాశయం నుంచి నీటిని సేకరించి, పది లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేలా ఉమ్మడిరాష్ట్రంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి డిజైన్ చేశారు. ఈ డిజైన్‌లో మూడు రిజర్వాయర్ల నిర్మాణంతోనే 47గ్రామాలు, 16,340 ఆవాసాలు ముంపునకు గురవుతుండగా.. 85వేల మంది నిరాశ్రయులు అవుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తక్కువ స్టోరేజీ ఉన్న జూరాల నుంచి కాకుండా.. నీటి లభ్యత పుష్కలంగా ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి నీటిని తరలించాలని రీడిజైనింగ్‌కు రూపకల్పన చేశారు. దీనికితోడు తక్కువముంపుతో ఆరు రిజర్వాయర్లను రూపొందించారు. ఈ ఆరింటికింద 24,084ఎకరాలతో పాటు, మూడు గ్రామాలు, 20 తండాలు మాత్రమే ముంపునకు గురవుతున్నాయి. తక్కువ ముంపుతోపాటు ఆయకట్టును కూడా పది లక్షల నుంచి 12.30 లక్షల ఎకరాలకు పెంచడమనేది రీడిజైనింగ్ ప్రత్యేకత. 2016 జూన్‌లో రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం ప్రాజెక్టుకు పాలనా అనుమతులు మంజూరుచేయగా.. తక్కువ సమయంలోనే నీటిపారుదలశాఖ అధికారులు సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పనులను 18 ప్యాకేజీలుగా విభజించి.. టెండర్ల ప్రక్రియను పూర్తిచేశారు. అప్పటి నుంచి నేటిదాకా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ టర్మ్‌లోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి రైతాంగానికి ఫలాలు అందించాల్సిందేనని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

వీడిన కేసుల చిక్కులు..

ఉమ్మడి పాలమూరులో నెలకొన్న దారిద్ర్యాన్ని పారదోలేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని చేపట్టగా.. అదే జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు వివిధ సాకులు చూపుతూ దీనిని నిలిపివేయాలంటూ న్యాయస్థానాలు, జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసులు వేశారు. మరోవైపు ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం కూడా ఇది కొత్త ప్రాజెక్టు అంటూ.. కేంద్ర ప్రభుత్వంతోపాటు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అనేకసార్లు ఫిర్యాదులు చేసింది. చంద్రబాబు ఫిర్యాదులపై సీఎం కేసీఆర్ స్వయంగా కేంద్రప్రభుత్వం ముందు ఆధారాలు చూపి ఇది పాత ప్రాజెక్టు అని రుజువుచేయగా, నాగం ఆరోపణలు నిరాధారమంటూ హైకోర్టు మొట్టికాయలు వేసింది. కాగా అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకోకుండా పనులు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకుడు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం కూడా అనుమతులు తీసుకున్న తర్వాతనే సాగునీటి పనులు చేపడతామంటూ స్పష్టంచేసింది. అనుమతులు వచ్చేవరకు తాగునీటి పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేస్తామని పేర్కొని.. అదేరీతిన పనులు కొనసాగిస్తున్నది.

పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టు కింద ఆయకట్టు..

జిల్లా	మండలాలసంఖ్య	గ్రామాలు	ఆయకట్టు ఎకరాల్లో...
మహబూబ్‌నగర్	39	718	7,00,000
రంగారెడ్డి	20	400	5,00,000
నల్లగొండ	03	13	30,000
మొత్తం	62	1131	12,30,000

ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల వివరాలు

జలాశయం పేరు	నిల్వసామర్థ్యం(టీఎంసీల్లో)	ఆయకట్టు(ఎకరాల్లో)
అంజనగిరి-నార్లాపూర్	8.61	-
వీరాంజనేయ-ఏదుల	6.55	-
వెంకటాద్రి-వట్టెం	16.58	1,29,000
కురుమూర్తి-కరివెన	19.15	1,46,000
ఉద్దండాపూర్	15.91	5,42,000
కేపీ లక్ష్మీదేవిపల్లి	2.80	4,13,000
మొత్తం	69.60	12,30,000

నేటి మన నిర్ణయాలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయి

- పవిత్ర ఓటింగ్ క్రతువులో పాల్గొనండి
- దేశం అన్ని వర్గాలది.. బహుళత్వమే భారత్ బలం
- గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి కోవింద్



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పవిత్రమైన ఓటింగ్ ప్రక్రియలో ప్రజలందరూ పాల్గొనాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. ఎన్నికలంటే కేవలం రాజకీయ కసరత్తు మాత్రమే కాదని, వివేకానికి, కర్తవ్యానికి సమిష్ఠి పిలుపు అని పేర్కొన్నారు. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి కోవింద్ జాతినుద్దేశించి ప్రసంగించారు. 'దేశం అందరిదీ. ప్రతి ఒక్క వర్గం, కులం, మతానికి చెందినది. ప్రతి ఒక్క పౌరునిది. భారత బహుళత్వం గొప్ప బలం. ప్రపంచానికే గొప్ప ఉదాహరణ' అని కోవింద్ పేర్కొన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో 21వ శతాబ్దంలో జన్మించినవారు తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. దేశం కీలక దశలో ఉందని, మనం ఇప్పుడు తీసుకునే నిర్ణయాలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో, అభివృద్ధి భారతాన్ని నిర్మించడంలో ఈ ఎన్నికలు కీలకం అని చెప్పారు. దేశం అనేక రంగాల్లో పురోగతి సాధించినా చాలా కన్నీళ్లు ఇంకా తుడవాల్సి ఉందని చెప్పారు. పేద కుటుంబాలకు చెందిన ప్రతిభ కలిగిన విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పిస్తూ తాజాగా చేసిన రాజ్యాంగ సవరణ మహాత్మా గాంధీ ఆశయాల సాధనలో మరో ముందడుగు అని అన్నారు. ప్రజాస్వామిక లక్ష్యాలను ప్రజాస్వామిక విధానాల్లో, బహుళత్వ లక్ష్యాలను బహుళత్వ విధానాల్లో, సమీకృత లక్ష్యాలను సమీకృత విధానాల్లో, రాజ్యాంగ లక్ష్యాలను రాజ్యాంగ విధానాల్లో సాధించడమే గణతంత్ర భారత విజన్ అని చెప్పారు. లింగ సమానత్వం దిశగా ప్రతి ఒక్క బాలికకు, మహిళకు సమాన అవకాశాలు కల్పించడంలో వచ్చిన మార్పే దేశంలో సామాజిక మార్పునకు సరైన సూచిక అని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని రాష్ట్రపతి చెప్పారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏండ్లు పూర్తికావడంతోపాటు, గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు కూడా ఈ ఏడాదే కావడం విశేషమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు గౌరవంగా, మన రాజ్యాంగానికి గౌరవంగా ఈఏడాది రాజ్యాంగ దినోత్సవాన్ని తగిన విధంగా జరుపుకుంటున్నామన్నారు. పేదరిక నిర్మూలనలో దేశం అడుగు దూరంలో ఉందన్నారు. దేశంలో రోడ్డు, రైలు, జల, వాయు రవాణా మార్గాలు మెరుగుపడ్డాయని తెలిపారు.

ఈబీసీ రిజర్వేషన్లపై 'స్టే'కు నిరాకరణ

- రాజ్యాంగ సవరణ చట్టం పరిశీలనకు సుప్రీంకోర్టు అంగీకారం
- మూడు వారాల్లో సమాధానమివ్వాలని కేంద్రానికి ఆదేశాలు



న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ రాజ్యాంగ సవరణ చట్టంపై పరిశీలన జరుపుతామని స్పష్టం చేసింది. అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లకు వీలు కల్పించే రాజ్యాంగ (103వ సవరణ) చట్టం-2019ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ పిటిషన్లపై 3 వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. కేంద్రం నిర్ణయంపై స్టే అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఒకేసారి వాదనలకు దిగగా, కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సమస్యల సృష్టికి కోర్టుకు రావొద్దని హెచ్చరించింది.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



రాజకీయ కురువృద్ధుడు ప్రణబ్ ముఖర్జీ



ప్రణబ్ ముఖర్జీ 1935 డిసెంబర్ 11న పశ్చిమ బెంగాల్‌లో జన్మించారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ చదివారు. కలకత్తాలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో కొంతకాలం పాటు అప్పర్ డివిజన్ క్లర్క్‌గా పనిచేశారు. 1963లో లెక్చరర్‌గా పనిచేశారు. రాజకీయాల్లోకి రాకముందు జర్నలిస్టుగానూ విధులు నిర్వర్తించారు. 1969లో రాజకీయ అరంగేట్రం చేశారు. మిడ్నపూర్ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థి వీకే కృష్ణమీనన్ తరపున ప్రచారం చేస్తూ నాటి ప్రధాని ఇందిరా గాంధీ దృష్టిలో పడ్డారు. ప్రణబ్‌ను పార్టీలోకి ఆహ్వానించిన ఇందిర... 1969 జూలైలో ఆయనను రాజ్యసభకు పంపించారు. 1973లో ఇందిర మంత్రివర్గంలో చేరారు. 1984లో ఇందిర హత్యానంతరం.. అనుభవం లేని రాజీవ్‌గాంధీ కంటే తానే ఇందిరకు అసలైన వారసుడినని ప్రణబ్ భావించారు. అయితే ప్రధాని పదవి రాజీవ్‌కు దక్కడంతో.. రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్ పేరిట ప్రణబ్ వేరే పార్టీ స్థాపించారు. 1989లో దిగివచ్చి తిరిగి కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 1991లో రాజీవ్‌గాంధీ హత్యానంతరం ప్రధాని పదవి చేపట్టిన పీవీ నరసింహారావు.. ప్రణబ్‌ముఖర్జీని ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా, 1995లో విదేశాంగ మంత్రిగా నియమించారు. 1998లో సోనియా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడంలో ప్రణబ్ కీలకంగా వ్యవహరించారు. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రణబ్ తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2012లో రాజీనామా చేసేవరకు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో నంబర్ 2గా ఉన్నారు. 2012-17 వరకు భారత రాష్ట్రపతిగా సేవలందించారు.



అసోం ముద్దుబిడ్డ.. బహుముఖ ప్రజ్ఞాశాలి
భూపేన్ హజారికా


సుధాకాంతగా చిరపరిచితులైన ప్రముఖ కవి, గేయ రచయిత, గాయకుడు, సంగీత దర్శకుడు, సినీ నిర్మాత భూపేన్ హజారికా అసోంలోని సదియాలో 1926 సెప్టెంబర్ 8న జన్మించారు. గౌహతిలోని సోనారామ్ హైస్కూల్, ధుబ్రిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ విద్యను, తేజ్‌పూర్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్‌ను, 1942లో ఇంటర్మీడియట్‌ను, 1944లో బీఏని పూర్తిచేసి 1946లో బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఆలిండియా రేడియో (గౌహతి)లో కొద్ది కాలం పనిచేశారు. ఆ సమయంలోనే ఆయన కొలంబియా యూనివర్సిటీ నుంచి స్కాలర్‌షిప్‌ను గెలుచుకుని 1949లో న్యూయార్క్‌కు వెళ్లారు. అక్కడ పీహెచ్‌డీ పూర్తిచేశారు. హజారికాపై ఆయన తల్లి ఎంతో ప్రభావం చూపారు. ఆమె పాడిన జోల పాటలు, అసోం సంప్రదాయ సంగీతం ఆయనను సంగీతం వైపు నడిపించాయి. ప్రఖ్యాత గేయ, నాటక రచయిత, అసోం తొలి సినీ దర్శకుడు జ్యోతిప్రసాద్ అగర్వాల్, అస్సామీ కళాకారుడు, విప్లవ కవి బిష్ణుప్రసాద్ రభా లాంటి మహామహులు పదేండ్ల చిరుప్రాయంలోనే హజారికాలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. హజారికా నిర్మించిన చిత్రాల్లో రుడాలీ, దర్మియాన్, గజగామిని తదితర చిత్రాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. 1977లో పద్మశ్రీ పురస్కారం, 1987లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 1992లో భారత చలనచిత్ర అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, 2001లో పద్మభూషణ్ పురస్కారం, 2008లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించాయి.మరణానంతరం 2012లో పద్మవిభూషణ్ ఆయనను వరించింది. 2011 నవంబర్ 5న ఆయన ముంబైలో కన్నుమూశారు.

ముగ్గురికి భారతరత్న

ప్రణబ్ ముఖర్జీ, నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికాకు దేశ అత్యున్నత పౌర పురస్కారం

నలుగురికి పద్మవిభూషణ్, 14 మందికి పద్మభూషణ్

94 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం




బల్వంత్ మోరేశ్వర్ పురంద్రే (పద్మవిభూషణ్)



ఇస్మాయిల్ ఒమర్ గులెహ్ (పద్మవిభూషణ్)



అనిల్ కుమార్ మునిభాయ్ (పద్మవిభూషణ్)



కుల్దీప్ నయ్యర్ (పద్మభూషణ్)



మోహన్ లాల్ (పద్మభూషణ్)



శివమణి (పద్మశ్రీ)



ప్రభుదేవా (పద్మశ్రీ)



ఖాదర్ ఖాన్ (పద్మశ్రీ)



యడ్లపల్లి వెంకటేశ్వరరావు (పద్మశ్రీ)

న్యూఢిల్లీ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలను శుక్రవారం ప్రకటించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ఆర్‌ఎస్‌ఎస్ మాజీ నేత నానాజీ దేశ్‌ముఖ్, ప్రఖ్యాత గాయకులు భూపేన్ హజారికాలను భారతరత్న పురస్కారానికి ఎంపిక చేసింది. నానాజీ, భూపేన్‌లకు మరణానంతరం ఈ అవార్డులు దక్కాయి. భారతరత్న అవార్డు పొందిన రాష్ట్రపతులు రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వీవీ గిరి సరసన ప్రణబ్ ముఖర్జీ కూడా చేరారు. నాలుగేండ్ల తర్వాత కేంద్రం భారతరత్న పురస్కారాలను ప్రకటించింది. 2015లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, బనారస్ హిందూ యూనివర్సిటీ వ్యవస్థాపకులు మదన్‌మోహన్ మాలవీయకు కేంద్రం భారతరత్న పురస్కారాలను ప్రదానం చేసిన విషయం తెలిసిందే. ప్రణబ్ ముఖర్జీ గొప్ప రాజనీతిజ్ఞుడని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. దశాబ్దాలపాటు దేశానికి నిస్వార్థ, అలుపెరుగని సేవలు అందించారని ప్రశంసించారు. దేశ వృద్ధి పథంలో ప్రణబ్ తనదైన ముద్ర వేశారని కీర్తించారు. ఆయనకు భారతరత్న అందజేయడం సంతోషంగా ఉందని ట్వీట్ చేశారు. నానాజీ దేశ్‌ముఖ్ గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేశారని, గ్రామీణ ప్రజల సాధికారతకు ఆయన కొత్త దారి చూపారని కొనియాడారు. వినయం, కరుణ మూర్తీభవించిన ఆయన అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అసమాన సేవలు అందించారన్నారు. భూపేన్ హజారికా పాటలు అన్ని తరాల వారినీ అలరించాయని మోదీ అన్నారు. వాటి ద్వారా న్యాయం, సోదరభావాన్ని చాటారని చెప్పారు. భారత సంగీత సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేశారని కొనియాడారు.

112 మందికి పద్మ పురస్కారాలు

భారతరత్న అవార్డులతో పాటు పద్మ పురస్కారాలను కూడా కేంద్రం శుక్రవారం ప్రకటించింది. మొత్తం 112 మందిని ఈ పురస్కారాలు వరించాయి. పద్మవిభూషణ్‌కు నలుగురు, పద్మభూషణ్‌కు 14 మంది, పద్మశ్రీకి 94 మంది ఎంపికయ్యారు. ఎల్ అండ్ టీ అధినేత అనిల్‌కుమార్ మణిభాయ్ నాయక్, తీజన్ బాయి, ఇస్మాయిల్ ఒమర్, బల్వంత్ మోరేశ్వర్ పురందరేలను పద్మవిభూషణ్ వరించింది. జాన్ చాంబర్స్, సుఖ్‌దేవ్ సింగ్ ధింద్సా, ప్రవీణ్ గోర్దన్, మహాశయ్ ధరమ్‌పాల్ గులాటి, దర్శన్‌లాల్ జైన్, అశోక్ లక్ష్మణరావు కుకడే, కరియా ముండా, బుదదీయ ముఖర్జీ, మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్, నంబి నారాయణ్, కుల్‌దీప్ నయ్యర్, బచేంద్రిపాల్, వీకే సుంగ్లూ, హుకుందేవ్ నారాయణ్ యాదవ్‌లు పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇక పద్మశ్రీ పురస్కార గ్రహీతల్లో మన రాష్ట్రం నుంచి ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి, పుట్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛెత్రి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, వెంకటేశ్వరరావు యడ్లపల్లి ఉన్నారు. సిరివెన్నలకు పద్మశ్రీ పురస్కారం లభించడంపై టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పద్మశ్రీకి తనను ఎంపిక చేయడం రైతులందరికీ దక్కిన గౌరవంగా, సేంద్రియ వ్యవసాయానికి పట్టం కట్టినట్లుగా భావిస్తున్నానని వెంకటేశ్వరరావు చెప్పారు.

భారతరత్నకు ప్రణబ్ సంపూర్ణ అర్హుడు

ముఖ్యమంత్రి కేసీఆర్

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న పురస్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారానికి ప్రణబ్ ముఖర్జీ సంపూర్ణ అర్హుడని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠపరచడానికి, రాజ్యాంగాన్ని సమర్థంగా అమలుచేయడానికి ప్రణబ్ ముఖర్జీ ఎంతో చొరవ చూపారని సీఎం కేసీఆర్ కొనియాడారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించి దేశానికి ఎంతో సేవ చేశారని సీఎం అన్నారు.



జాతీయవాదం స్ఫూర్తి.. ఆరెస్సెస్ వేదిక..
నానాజీ దేశ్‌ముఖ్

లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ప్రవచించిన జాతీయ వాదంతో స్ఫూర్తి పొందిన నానాజీ దేశ్‌ముఖ్ అసలు పేరు చండికా దాస్ అమృత్‌రావు దేశ్‌ముఖ్. 1916 అక్టోబర్ 11న మహారాష్ట్రలోని పర్భనీ జిల్లా కాదోలీ పట్టణంలో జన్మించారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక ఆరెస్సెస్‌లో చేరారు. 1947 జనవరి 30న జాతిపిత మహాత్మాగాంధీ దారుణ హత్య తర్వాత ఆరెస్సెస్‌పై నిషేధం విధించడంతో అజ్ఞాతంలో ఉంటూ కార్యకలాపాలు సాగించారు. ఆరెస్సెస్‌పై నిషేధం ఎత్తివేసిన తర్వాత ఏర్పాటైన భారతీయ జనసంఘ్ (బీజేఎస్) వ్యవస్థాపక నేతల్లో నానాజీ ఒకరు. ఆ పార్టీ యూపీ శాఖ ప్రధాన కార్యదర్శిగా నానాజీ నియమితులయ్యారు. రామ్‌మనోహర్ లోహియా వంటి సోషలిస్టులతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. వినోబాభావే భూదానోద్యమంలో, ఎమర్జెన్సీ వ్యతిరేకంగా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1980లో 60వ పడిలో పడిన తర్వాత ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్నా.. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం నానాజీ దేశ్‌ముఖ్‌ను రాజ్యసభకు నామినేట్ చేసింది. అదే ఏడాది ఆయన పద్మవిభూషణ్ అవార్డును అందుకున్నారు. 2010 ఫిబ్రవరి 27న చిత్రకూట్‌లోని గ్రామోదయ్ విశ్వవిద్యాలయలో నానాజీ కన్నుమూశారు.

ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్‌కు
'పరమ్ విశిష్ట సేవా మెడల్'

- మరో 18 మందికి కూడా
- ఇద్దరికి కీర్తి చక్ర.. 9 మందికి శౌర్య చక్ర పురస్కారాలు ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో సైనికులకు కేంద్రం పురస్కారాలను ప్రకటించింది. అత్యున్నత సైనిక పురస్కారం 'పరమ్ విశిష్ట సేవా మెడల్'కు ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్‌తోసహా 19 మందిని కేంద్రం ఎంపిక చేసింది. వీరిలో 15 మంది లెఫ్టినెంట్ జనరల్, ముగ్గురు మేజర్ జనరల్ అధికారులు ఉన్నారు. రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తి చక్ర' అవార్డుకు జాట్ రెంజిమెంట్‌లోని మేజర్ తుషార్ గౌబా, 22 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సోవర్ విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. మూడో అత్యున్నత పురస్కారం 'శౌర్య చక్ర'కు 9 మంది ఎంపికయ్యారు. వీరిలో లెఫ్టినెంట్ కల్నల్ విక్రాంత్ ప్రశీర్, మేజర్ అమిత్ కుమార్ దిమ్రి, మేజర్ ఇమ్లియాకుమ్ కియాట్జర్, మేజర్ రోహిత్ లింగ్వాల్, కెప్టెన్ అభయ్ శర్మ, కెప్టెన్ అభినవ్‌కుమార్ చౌదరి, లాన్స్‌నాయక్ ఆయూబ్ అలీ, సిపాయి అజయ్‌కుమార్, సాపర్ మహేశ్ ఉన్నారు. ఉత్తం యుద్ధ్ సేవా మెడల్‌కు ముగ్గురు, విశిష్ట సేవా మెడల్‌కు 32 మంది సైనికులు, యుద్ధ్ సేవా మెడల్‌కు 9 మంది ఎంపికయ్యారు.

ముగ్గురు అమర సీఆర్పీఎఫ్ జవాన్లకు రాష్ట్రపతి పోలీసు శౌర్య పతకం

విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రాణత్యాగం చేసిన ముగ్గురు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు మహ్మద్ యాసిన్, బొరాసె దినేశ్ దీపక్, జశ్వంత్‌సింగ్ రాష్ట్రపతి పోలీసు శౌర్య పతకానికి ఎంపికయ్యారు. విధుల నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 855 మంది పోలీసు అధికారులకు కేంద్రం వివిధ పతకాలను ప్రకటించింది. 84 మంది అగ్నిమాపక దళ జవాన్లు 'ఫైర్ సర్వీస్ మెడల్స్'కు ఎంపికయ్యారు. ఇక గతేడాది మార్చి 16న ఘజియాబాద్‌లో నాలుగంతస్తుల భవనంపై వేలాడుతున్న 14 ఏండ్ల బాలుడ్ని కాపాడిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ సుశీల్ భోయి.. 'జీవన్ రక్ష పడక్' అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, ఈ ఏడాది సీఆర్పీఎఫ్‌కు ఎక్కువ పురస్కారాలు లభించాయి. మొత్తం 47 పురస్కారాలు రాగా అందులో రెండు కీర్తిచక్ర, ఒకటి శౌర్య చక్ర కూడా ఉన్నాయి.

కశ్మీరీ యువతను సన్మార్గంలో పెట్టేందుకు యత్నిస్తా

అశోక చక్ర అవార్డుకు ఎంపికైన నజీర్‌వనీ భార్య మహాజబీన్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: కశ్మీరీ యువత సన్మార్గంలో ప్రయాణించేలా కృషి చేస్తానని అశోక చక్ర అవార్డుకు ఎంపికైన నజీర్ వనీ భార్య మహాజబీన్ అన్నారు. ఇటీవల కశ్మీర్‌లోని సోఫియా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన సైనికుడు నజీర్ అహ్మద్ వనీని మరణాంతరం అశోక చక్ర పురస్కారానికి కేంద్రం ఎంపిక చేసింది. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన తన భర్తే తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోవడానికి ముందు రోజు తన భర్త ఫోన్ చేసి ధైర్యం చెప్పారన్నారు. తన భర్త అమరుడయ్యాడని తెలిసిన తర్వాత ఏడువలేదని, బాధను దిగమింగానని పేర్కొన్నారు.

బహుళ అంచెల భద్రత మధ్య ఢిల్లీ

- గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబు
- 25 వేల మంది పోలీసులతో పటిష్ట భద్రత
- వివిధ మార్గాల్లో వాహనాల నిషేధం
- ట్రాఫిక్ నియంత్రణకు 3000 మంది సిబ్బంది
- గగనతలంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు



న్యూఢిల్లీ, జనవరి 25: దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుళ అంచెల పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. ఉగ్ర దాడులకు కుట్ర పన్నిన ఇద్దరు ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీ పరిధిలో వ్యూహాత్మక ప్రదేశాల్లో భద్రతను పటిష్ఠం చేశారు. ట్రాఫిక్ పోలీసులతోపాటు సుమారు 25 వేల మంది పోలీసులను నియమించారు. రాజ్‌పథ్ పరిధిలో సీసీటీవీ కెమెరాలతోపాటు ముఖాలను గుర్తించే కెమెరాలను ఏర్పాటు చేశారు. రాజ్‌పథ్ నుంచి ఎర్రకోట వరకు పరేడ్ సాగే 8 కి.మీ. పొడవునా మొబైల్ టీమ్స్, షార్ప్‌షూటర్లు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ తుపాకులతో సిబ్బందిని నియమించారు. ఢిల్లీ పోలీసు శాఖ పరిధిలోని స్వాట్ విభాగానికి చెందిన 36 మంది మహిళా కమెండోలు, ఎన్‌ఎస్జీ కమెండోలు, స్నిఫ్పర్ డాగ్స్ కూడా భద్రతలో పాలుపంచుకోనున్నాయి. భారీ భవనాలపైన స్నిఫ్పర్ డాగ్స్‌తోపాటు పోలీసు బలగాలను నియమించారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరేడ్ మార్గంలో ప్రజల కదలికలపై నిఘా పెట్టారు. గగనతలంలోనూ యుద్ధ విమానాలు గస్తీ తిరుగనున్నాయి. రద్దీ ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. రిపబ్లిక్ డే పరేడ్ కోసం పలు మార్గాల్లో వాహనాల రాకపోకలను నియంత్రణకు 3000 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. పరేడ్ సాగే మార్గం విజయ్ చౌక్ నుంచి ఎర్రకోట వరకు విస్తృత ట్రాఫిక్ ఏర్పాట్లు చేసిన పోలీసులు ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు. శుక్రవారం నుంచి శనివారం పరేడ్ ముగిసే వరకు రాజ్‌పథ్ మీదుగా విజయ్ చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు వాహనాల రాకపోకలను అనుమతించరు. ఉదయం 10 గంటల నుంచి తిలక్ మార్గ్, బీఎస్‌జడ్ మార్గ్, సుభాష్ మార్గ్ రోడ్లకు ఇరువైపులా వాహనాల రాకపోకలను నిషేధించారు. సీ- హెక్సాగాన్- ఇండియా గేట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి తర్వాత శనివారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి తిలక్ మార్గ్ మీదుగా పరేడ్ వెళ్లే వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా మూసివేస్తారు. జనవరి తొమ్మిదో తేదీ నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు గగనతలంలో ఢిల్లీ దేశ రాజధాని ప్రాంత (ఎన్సీఆర్) పరిధిలో విమానాలు ఎగరడాన్ని నిషేధించారు. బహిరంగ ప్రదేశాల్లో పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు.

ప్రముఖ హిందీ రచయిత్రి
కృష్ణ సోబ్తీ కన్నుమూత

- చికిత్సపొందుతూ ఢిల్లీ దవాఖానలో తుదిశ్వాస
- మిత్రో మర్‌జానీ, సూరజ్‌ముఖి అంధేరే కే వంటి రచనలతో ప్రసిద్ధి



కృష్ణ సోబ్తీ

న్యూఢిల్లీ, జనవరి 25: ప్రముఖ హిందీ రచయిత్రి, జ్ఞాన్‌పీఠ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కృష్ణ సోబ్తీ (93) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఢిల్లీలోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. 1925లో గుజరాత్‌లో ఆమె జన్మించారు. ఢిల్లీ, సిమ్లాలో పెరిగారు. మిత్రో మర్‌జానీ, డార్ సే బిచౌరి, సూరజ్‌ముఖీ అంధేరే కే, యారోన్ కే యార్ వంటి నవలలు ఆమెకు పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి. ఆమె రచించిన పలు పుస్తకాలు ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లోకి కూడా అనువాదమయ్యాయి. ఆమె చివరి పుస్తకం 'చన్నా' ఈ నెల 11న న్యూఢిల్లీ అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో విడుదల అయింది. 60 ఏండ్ల కిందటే రచించిన ఈ నవల సోబతీ మొదటి రచన కాగా, ప్రచురణకర్తతో తలెత్తిన విభేదాలతో ఇప్పటివరకూ విడుదల కాలేదు. తన రచనల్లో మహిళల పాత్రలను ఆమె శక్తివంతంగా తీర్చిదిద్దారు. సోబ్తీ మృతి పట్ల పలువురు రచయితలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతి ప్రపంచ సాహిత్యానికి తీరని లోటు అని కవి అశోక్ చక్రధర్ విచారం వ్యక్తం చేశారు. భారత సాహిత్యానికి ఆమె అసమాన సేవలు అందించారని రచయిత అశోక్ వాజ్‌పేయి కొనియాడారు. 2017లో కృష్ణ సోబ్తీకి జ్ఞాన్ పీఠ్ అవార్డు లభించింది. భారత ప్రభుత్వం ఆమెకు పద్మభూషణ్ అవార్డును ప్రకటించినా ఆమె తిరస్కరించారు.

15 నెలల్లో 1.8 కోట్ల ఉద్యోగాలు

- కేంద్ర గణాంకాల సంస్థ నివేదికలో వెల్లడి
- సామాజిక భద్రత పథకాల ఆధారంగా నివేదిక



న్యూఢిల్లీ: 2017 సెప్టెంబర్ నుంచి 2018 నవంబర్ వరకు 15 నెలల్లో సంఘటిత రంగంలో కొత్తగా 1.8 కోట్ల ఉద్యోగాల కల్పన జరిగిందని తాజా నివేదిక తెలిపింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌డీఆర్‌ఏ), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఆర్గనైజేషన్(ఈఎస్‌ఐసీ)కు సంబంధించిన పేరోల్ సమాచారం ఆధారంగా రూపొందించిన నివేదికను కేంద్ర గణాంకాల సంస్థ (సీఎస్‌ఓ) విడుదల చేసింది. 2017 సెప్టెంబర్ -2018 నవంబర్ మధ్య ఈఎస్‌ఐసీ నిర్వహిస్తున్న ఈఎస్‌ఐ పథకంలో కొత్తగా 1,84,38,748 మంది ఉద్యోగులు చేరారని పేర్కొంది. ఈపీఎఫ్‌ఓ అమలు చేస్తున్న వివిధ సామాజిక భద్రత పథకాల్లో ఈ 15 నెలల్లో 1,79,34,300 మంది చేరారని తెలిపింది. ఇదే సమయంలో 1,39,31,607 మంది ఉద్యోగులు ఈపీఎఫ్‌ఓ పథకాల నుంచి వైదొలిగారని, 33,48,093 మంది మళ్లీ చేరారన్నది. 2017 నవంబర్‌తో పోలిస్తే 2018 నవంబర్‌లో సంఘటిత రంగంలో ఉద్యోగాల కల్పన 48 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. ఈ 15 నెలల్లో 9,19,791 మంది కొత్తగా న్యూ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్)లో చేరారన్నది.

ఉద్యోగాల కల్పనలో భారత్ వైఫల్యం

ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్

ఉద్యోగాల కల్పనలో భారత్ అంతగా విజయవంతం కాలేదని ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ అన్నారు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం వార్షిక వృద్ధిరేటు సాధించే సత్తా భారత్‌కు ఉందని, అయితే ఉద్యోగాల కల్పన, కార్మిక విధానాల్లో మార్పులపై ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ దృక్కోణంలో చూస్తే ప్రస్తుత భారత వృద్ధి రేటు (7.5 శాతం) బాగానే ఉందని, అయితే 8-9 శాతం వృద్ధి రేటు సాధించగల సత్తా భారత్‌కు ఉందని ఆమె చెప్పారు. ఆర్థిక వృద్ధిరేటు పుంజుకునేందుకు కార్మిక విధానాల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

అయోధ్యపై రాజ్యాంగ ధర్మాసనం
పునః నియామకం

29 నుంచి విచారణ ప్రారంభం

న్యూఢిల్లీ, జనవరి 25: అయోధ్య వివాదంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టులోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని పునఃనియమించారు. రామ జన్మభూమి- బాబ్రీమసీదు భూ వివాదంపై ఈ ధర్మాసనం ఈ నెల 29న విచారణను చేపడుతుందని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ శుక్రవారం తెలిపింది. 1997లో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం కల్యాణ్ సింగ్ తరపున ఈ కేసులో న్యాయవాదిగా విచారణకు హాజరైనందున రాజ్యాంగ ధర్మాసనం నుంచి వైదొలుగుతున్నట్లు ఈ నెల 10న జరిగిన విచారణ సందర్భంగా జస్టిస్ యూయూ లలిత్ ప్రకటించారు. మరో జస్టిస్ ఎన్వీ రమణ కూడా ధర్మాసనంలో కొనసాగేందుకు నిరాకరించారు. దీంతో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాన్ని పునఃనియమించాల్సి వచ్చింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలో జస్టిస్‌లు ఎస్ఏ బాబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్ఏ నజీర్‌లతో నూతన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ ఎన్వీ రమణ స్థానంలో జస్టిస్‌లు అశోక్ భూషణ్, ఎస్ఏ నజీర్‌లకు కొత్త రాజ్యాంగ ధర్మాసనంలో చోటు లభించింది.



యోగీ ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాది కాలంలోనే మూడు వేల ఎన్‌కౌంటర్లకు పాల్పడిన నేరస్తులను మట్టుబెట్టిన ఘనతను చాటాలి. శాంతిభద్రతల కోసం ప్రభుత్వం చేసిన కృషి ఎనలేనిది.


అనూప్ చంద్రపాండే, యూపీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ

యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆరోగ్యం, విద్య, వైద్యం మెరుగుదల కోసం చేసిందేమీ లేదు. మౌలిక వసతుల కల్పన కోసం పనిచేయలేదు. కానీ విచ్చలవిడిగా ఎన్‌కౌంటర్లకు పాల్పడి ప్రజల ప్రాణాలు తీసింది. ప్రజలను వేటాడి చంపటాన్నే తన ఘనతగా చెప్పుకుంటున్నది. సుప్రీంకోర్టు తీవ్రంగా గర్హించినా ప్రభుత్వంలో మార్పులేదు.



సునీల్‌సింగ్ సాజన్, ఎస్పీ అధికార ప్రతినిధి

చరిత్రలో నేడు



1784

అమెరికా జాతీయ చిహ్నంగా 'గద్ద' ఉండటాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బెంజమిన్ ఫ్రాంక్లిన్.

1926



టీవీ ని తయారు చేసి తన ప్రయోగ శాలలో ప్రజలకు ప్రదర్శించిన జాన్‌లోగి బేయిర్డ్.



1929

భారత జాతీయ కాంగ్రెస్ మొదటిసారి దేశ స్వాతంత్య్రం కోసం తీర్మానం.

ప్రియాంకా గాంధీ వాద్రాను కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా నియమిస్తూ రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయంతో పార్టీకి కొత్త జవసత్వాలు వస్తాయనే ఆశలు మెండుగా ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో ప్రియాంకనే జనాకర్షక నేతగా ప్రచారంలో అగ్రభాగాన నిలిచేఅవకాశమున్నది. మరోవైపు కాంగ్రెస్‌పై కుటుంబ రాజకీయాలనే విమర్శకు బీజేపీ పదును పెడుతున్నది. ప్రియాంక రాక బీఎస్పీ-ఎస్పీ కూటమికి కూడా గుబులు పుట్టిస్తున్నది. ఏదేమైనా కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు పోవాల్సిన సమయం ఆసన్నమైనది.

ది హిందూ

2019 ఎన్నికలకు బీజేపీ ద్విముఖ వ్యూహంతో సమాయత్తమవుతున్నది. మోదీ ప్రధాని అభ్యర్థిగా అభివృద్ధి, బలమైన నేత, సుస్థిరమైన ప్రభుత్వ నినాదంతో కదులుతుండగా, అమిత్‌షా హిందుత్వ ఎజెండాను మరింత దూకుడుగా ముందుకు తీసుకుపోవటానికి సన్నద్ధమవుతున్నాడు. అయితే భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం అన్న దానిపైనే ఆధారపడి ఉన్నదన్నది మరువరాదు. హిందుత్వ, రామమందిర నినాదాలతో విభజన రాజకీయాలు దేశానికి చేటు చేస్తాయని బీజేపీ గుర్తించాల్సిన ఆవశ్యకత ఉన్నది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

దక్షిణాఫ్రికాతో దోస్తీ

భారత గణతంత్ర దినోత్సవానికి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాను ప్రధాన అతిథిగా ఆహ్వానించడం, శుక్రవారం నాడు చర్చల అనంతరం ఆయన ప్రధాని మోదీతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఒప్పందంపై సంతకం చేయడం హర్షించదగిన పరిణామం. స్నేహసంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకపోవాలని రెండు దేశాల నాయకులు భావిస్తున్న తరుణంలో రామఫోసా భారత్‌కు ప్రధాన అతిథిగా వచ్చారు. రెండు దేశాల మధ్య మానవ నాగరికత తొలిదశల నుంచి సంబంధాలున్నాయి. వలసవాద విముక్తి పోరాటం ఈ రెండు సమాజాలను మరింత సన్నిహితం చేసింది. గాంధీ అహింసాయుత పోరాటంపై, సత్యాగ్రహం గురించీ ప్రయోగాలు సాగించింది దక్షిణాఫ్రికాలోనే. ఆ తరువాత కాలంలో దక్షిణాఫ్రికా పోరాటాలు గాంధీ ఒరవడిని అనుసరించాయి. విముక్తి పోరాట నాయకుడిగా నెల్సన్ మండేలా భారతీయు హృదయాల్లో స్థానం సంపాదించుకున్నాడు. దక్షిణాఫ్రికా అభివృద్ధిలో భారతీయుల భాగస్వామ్యం గణనీయమైనది. దక్షిణాఫ్రికా తెల్లజాతి ఆధిపత్యం నుంచి విముక్తి పొందినప్పటి నుంచి భారత్‌తో స్నేహసంబంధాలను కొనసాగిస్తున్నది. దక్షిణాఫ్రికా వాణిజ్య భాగస్వాములలో భారత్ రెండవ స్థానంలో ఉన్నది. ఆగ్రో ప్రాసెసింగ్, రక్షణ, మైనింగ్, ఆర్థిక రంగాలలో రెండు దేశాలలో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని దక్షిణాఫ్రికా ఆసక్తిగా ఉన్నది. దక్షిణాఫ్రికాలోని దాదాపు 150 కంపెనీలు ఇరువై వేల మందికి పైగా స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. దక్షిణాఫ్రికాలోని ఉద్యోగ, వ్యాపార రంగాలలో భారతీయుల పాత్ర వేగంగా పెరుగుతున్నది.

బ్రిక్స్ కూటమిలోని రష్యా, చైనా దేశాలకు భిన్నంగా దక్షిణాఫ్రికా, బ్రెజిల్, భారత్ సహకరించుకుంటున్నాయి. భద్రతా మండలిని విస్తరించాలని కోరుతున్నాయి. అంతర్జాతీయ రంగంలో మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా- ఆఫ్రికా సౌహార్దతకు భారత్, దక్షిణాఫ్రికా స్నేహం ఇరుసుగా మారుతుంది.

అంతర్జాతీయ రంగంలో భారత్, దక్షిణాఫ్రికా మైత్రి రెండు దేశాలకూ తప్పనిసరి. రెండు దేశాల లక్ష్యాలు, మార్గాలు ఒక్కటిగా కలిసిపోయాయి. ఇరుదేశాల మధ్య అనేక సారూప్యతలున్నయి. భారత్ దక్షిణాసియాలో ప్రాంతీయ శక్తిగా అవతరించింది. మరోవైపు ఆఫ్రికా ఖండంలోకెల్లా వర్ధమాన శక్తిగా దక్షిణాఫ్రికా నిలిచింది. ప్రపంచీకరణ విషయంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల వైఖరి భారత్, దక్షిణాఫ్రికా వంటి వర్ధమాన ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నది. ప్రపంచీకరణ అమలు చేసే వరకు ఎన్నో ఒప్పందాలకు బద్ధులుగా ఉంటామన్న పెద్ద దేశాలు ఇప్పుడు రక్షిత వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జి20 వేదికపై రెండు దేశాలు సహకరించుకుంటున్నాయి. ఆఫ్రికాలో పెట్టుబడులు పెట్టే ఏ దేశమైనా దక్షిణాఫ్రికాను సింహద్వారంగా భావిస్తాయి. ఇప్పటికే చైనా ఆఫ్రికా దేశాలలోకి చొచ్చుకుపోయింది. బెల్ట్ అండ్ రోడ్ పథకం కిందికి అనేక దేశాలను ఆహ్వానిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆఫ్రికాలో పెట్టుబడులకు దక్షిణాఫ్రికాతో సాన్నిహిత్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భారత్ భావిస్తున్నది. భౌగోళిక రాజకీయ రంగంలో దక్షిణాఫ్రికా కొండంత అండగా ఉండాలని భారత్ కోరుకుంటున్నది. దక్షిణాఫ్రికా తూర్పు తీరం మొదలుకొని పశ్చిమ పసిఫిక్ ప్రాంతం వరకు సముద్ర జలాలపై ఆధిపత్యం కోసం అమెరికా, చైనా పోటాపోటీగా ఉన్నాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పట్టు కోసం చైనాతో భారత్ పోటీ పడుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీలంక, మాల్దీవ్స్, సీషెల్స్, మార్షియస్ తదితర దీవులపై పట్టు కోసం భారత్ చైనా మధ్య పరోక్ష ఘర్షణ సాగుతున్నది. ఈ దశలో హిందు మహాసముద్ర తీరప్రాంతమైన దక్షిణాఫ్రికా తోడ్పాటు భారత్‌కు ఎంతో అవసరం. ఆఫ్రికా తూర్పు తీర దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలని భారత్ భావిస్తున్నది. ఇందుకు దక్షిణాఫ్రికా దౌత్యపరంగా సహకరించవలసి ఉన్నది.

ప్రచ్ఛన్నయుద్ధానంతరం అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా అవతరించినప్పటికీ, తన ఆధిపత్యాన్ని ఎంతోకాలం కాపాడుకోలేక పోతున్నది. భవిష్యత్తులో భిన్నధ్రువ ప్రపంచం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా భారత్, దక్షిణాఫ్రికా సమాయత్తం అవుతున్నాయి. లాటిన్ అమెరికాలో బ్రెజిల్, ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికా, దక్షిణాసియాలో భారత్‌తో పాటు రష్యా చైనాలు బ్రిక్స్ కూటమిగా ఏర్పడ్డాయి. అంతర్జాతీయ రంగంలో ఈ ఐదు దేశాల మధ్య వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా సామ్యం ఉన్నది. కానీ భౌగోళిక రాజకీయాల విషయంలో ఏకాభిప్రాయం లేదు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తేవాలనే విషయంలో రష్యా, చైనాలకు ఆసక్తి లేదు. ఇప్పటికే వీటికి భద్రతా మండలి సభ్యత్వం ఉన్నది. ఇప్పుడున్న వ్యవస్థ వీటికి అనుకూలంగా ఉన్నది. కానీ బ్రిక్స్ కూటమిలోని రష్యా, చైనా దేశాలకు భిన్నంగా దక్షిణాఫ్రికా, బ్రెజిల్, భారత్ సహకరించుకుంటున్నాయి. భద్రతామండలిని విస్తరించాలని కోరుతున్నాయి. అంతర్జాతీయ రంగంలో మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా– ఆఫ్రికా సౌహార్దతకు భారత్, దక్షిణాఫ్రికా స్నేహం ఇరుసుగా మారుతుంది. ప్రధాని మోదీ ఆఫ్రికా దేశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. లాటిన్ అమెరికాతోపాటు ఆఫ్రికా, ఆసియా ఖండాలతో కూడిన దక్షిణార్ధ గోళంలోని దేశాల మధ్య స్నేహ సంబంధాలు బలపడటానికి దక్షిణాఫ్రికా అధినేత రామఫోసా భారత పర్యటన ఇందుకు మొదటి అడుగుగా భావించవచ్చు.

స్మరణ

కాకి లక్ష్మారెడ్డి ఆదర్శ జీవితం

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ సూర్యాపేట ప్రాంతంలో ప్రజా ఉద్యమాలను నిర్మించిన అగ్రశ్రేణి నేతల్లో కాకి లక్ష్మారెడ్డిది కీలక పాత్ర. తెలంగాణ సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలో స్తబ్దత ఏర్పడింది. ఈ స్థితిలో నక్సల్‌బరీ రాజకీయాలు దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలకు ఓ వెలుగు రేఖలా విస్తరించాయి. ఆ నేపథ్యంలోనే కేఎల్ సీపీఐ (ఎంఎల్) రాజకీయాలను భుజాన వేసుకుని ఉద్యమ విస్తరణకు అవిరళకృషి చేశారు. ఉభయ కమ్యూనిస్టుల రివిజనిస్టు రాజకీయాల దివాలాకోరుతనాన్ని విమర్శిస్తూ సైద్ధాంతిక పోరాటంచేయటంలో కేఎల్ ముందున్నారు.ఆ క్రమంలో ఆయన అనేక విమర్శలు, దాడులకు గురయ్యారు.

దేశవ్యాప్తంగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి పౌర ప్రజాస్వామిక హక్కులను హరించి, దేశంలో చీకటి రోజులు తెచ్చారు. విపక్ష నేతలందర్నీ, ముఖ్యంగా కమ్యూనిస్టు విప్లవకారులందరినీ జైళ్లల్లో నిర్బంధిస్తున్నప్పుడు కేఎల్ రహస్య జీవితాన్ని ఎంచుకుని సూర్యాపేట ప్రాంతంలో ఉద్యమాన్ని విస్తరింపజేశారు. ఆ క్రమంలోనే 1975లో సూర్యాపేటలో మహాకవి శ్రీశ్రీ ఆధ్వర్యంలో పౌరహక్కుల సంఘం మహాసభలను వేలాదిమందితో విజయవంతంగా నిర్వహించి హక్కుల ఉద్యమానికి పునాదులు వేశారు. ఆ తర్వాత కాలంలో ఉద్యమ విస్తరణలో భాగంగా కరీంనగర్ జిల్లాకు వెళ్లి అక్కడ రైతాంగ ఉద్యమాలకు పునాదులు వేశారు. ఉద్యమాన్ని విస్తరింపజేశారు. ప్రజలపై ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండను బలమైన పౌరహక్కుల ఉద్యమం ద్వారా ఎదుర్కొన్నారు. అక్రమ అరెస్టులను, నిర్బంధాలను ప్రజా మద్దతుతో ఎదిరించారు. కరీంనగర్ నుంచే ఆయన ఎమ్మెల్యే, ఎంపీగా కూడా పోటీ చేసి ఉద్యమ రాజకీయాల ప్రచారానికి పాటుపడ్డారు. జీవితమంతా ప్రజా ఉద్యమాలకోసం పనిచేసి ఉన్నతమైన మానవీయ సమాజం కోసం పరితపించిన కాకి లక్ష్మారెడ్డి తుదిశ్వాస విడువటం పీడిత ప్రజలకు తీరని లోటు. ఆయన త్యాగ పూరిత జీవితాచరణ నేటి తరానికి ఆదర్శం.

- దేగల జనార్దన్, 'సూర్యాపేట టైమ్స్' సంపాదకులు

(సూర్యాపేటలో జనవరి 27న కాకి లక్ష్మారెడ్డి సంస్మరణ సభ జరుగుతున్న సందర్భంగా..)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

మనోహరం శేషగిరీయం

గీతలలో దాగి ఉన్న సృజనాత్మకతను, రేఖలలో ఒదిగి ఉన్న రమ్యతను శేషగిరిరావు ఆ రోజుల్లోనే ఆకళింపు చేసుకుని ఆ రసాత్మక ప్రక్రియలో అఖండ ప్రతిభను ప్రదర్శించారు. పాకాల అడవిలో పల్లవించిన శేషగిరి చిత్రకళా ప్రతిభ అనంతర కాలంలో బహుముఖంగా పరిణతి పొంది సహస్ర కిరణాలతో వెలుగులు విరజిమ్మింది.

తెలంగాణ తల్లి అదృష్టమని చెప్పాలె..71 ఏండ్ల కిందట ఓరోజు కలకత్తా నుంచి వరంగల్లు సమీపంలోని ఊరికి వస్తున్న ఓ యువకుడికి మతోన్మాద దుండగుల వల్ల ఎటువటి ప్రమాదం సంభవించలేదు. ప్రాణాపాయం కోరల నుంచి తప్పించుకుని, మృత్యుగహ్వారం నుంచి బయటపడిన ఆ యువకుడు తాను వెళ్లాలనుకున్న ఊరికి సురక్షితంగా చేరాడు. అదో సాహసగాథ. ఆ యువకుడిది జీవితమంతా సాహసగాథే. ఆయనే కొండపల్లి శేషగిరి రావు. అక్కడ అడుగడుగునా భయంకర ప్రమాదాలు మందుపాతరల వలె పొంచి ఉన్నాయని లలితహృదయుడైన ఆ యువకుడికి బాగా తెలుసు. అయినా, సాహసించి భుజాన ఓ సంచి వేసుకుని బయలుదేరాడు.

హైదరాబాద్ సంస్థానంలోని ప్రధాన భాగమైన తెలంగాణ, అగ్నిగుండంగా మారి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా రణస్థలిగా మారిన తెలంగాణ ఆ రోజుల్లో ప్రపంచమంతటా వార్తల్లో ప్రథమ స్థానం పొందుతున్నదని ఆ యువకుడికి తెలుసు. దేశమంతట స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు జరుగుతుండగా, తన తెలంగాణ ఇంకా పీడనలో రాచరిక పాలన నియంతృత్వ బంధనాలలో, మతోన్మాదుల పైశాచికత్వంలో ఇరుక్కుని ఆక్రోశిస్తున్నదని ఆ యువకుడికి తెలుసు. ఆపత్కాలంలో అమ్మకు అండగా నిల్చుని ఆదుకోవలసిన తాను దూరంగా ఉన్నానని ఆందోళనకు గురవుతున్న చైతన్యశీలి ఆ యువకుడు. ఆ యువకుడు స్వేచ్ఛాప్రియుడు, స్వాతంత్ర్య పిపాసి. సామాజిక స్పృహ, దేశభక్తి ఆ యువకుడి వ్యక్తిత్వానికి అలంకారాలుగా శోభించాయి. అన్నిటి కన్న మిన్నగా ఆ యువకుడి ఆభరణమయింది ఆత్మాభిమానం.ఇబ్బందులు, అడ్డంకులు ఎన్ని ఉన్నా, అవి నిర్దాక్షిణ్యంగా తనపై హమ్లా చేసినా వజ్ర సంకల్పంతో, చెక్కు చెదరని పట్టుదలతో గమ్యాన్ని చేరడం ఆ యువకుడి విశిష్ట వ్యక్తిత్వ ప్రత్యేకత. ఈ ప్రత్యేకత కారణంగానే ఆ యువకుడు అనంతర జీవన యానంలో జాతీయ, అంతర్జాతీయ ప్రసిద్ధిని, ప్రశంసలను పొందగలిగాడు. విశ్వకవి రవీంద్ర కవీంద్రుని శాంతినికేతన్‌లో 1947–48లో ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు నందలాల్ బోస్ వద్ద చిత్రకళలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి 1948 ఏప్రిల్ 4వ తేదీన సర్టిఫికేట్ పొందిన ఆ యువకుడికి అక్కడే మేటి చిత్రకారుడు అబనీంద్రనాథ్ టాగోర్‌తో, చిత్రకళలో నిష్ణాతులైన ఇతర చిత్రకళా శిరోమణులతో పరిచయం అయింది. గురువు నందలాల్ బోస్ సూచనను శిరసావహించి ఆ యువకుడు అప్పటికే సెలవులలో భువనేశ్వర్ వెళ్లి అక్కడి ప్రాచీన శిల్పకళా ఖండాల అందమైన రేఖా చిత్రాలను రూపొందించాడు. నిర్విరామ పరిశ్రమ, నిమగ్నతతో ఆ యువకుడు అప్పటికే ఒక కళా తపస్విగా గుర్తింపు, గౌరవం సంతరించు కోవడం విశేషం.

చిత్రకళా విద్యకు, నైపుణ్యానికి ఆలయమైన రవీంద్రుని శాంతినికేతన్ నుంచి రక్కసులు అశాంతి కేంద్రంగా మార్చిన తన తెలంగాణకు వెళుతున్నానని ఆ యువకుడు ఎంత మాత్రం భయపడలేదు. తెలంగాణ తల్లి శృంఖలాలను ఛేదించవలసిన పవిత్ర సమరంలో తాను క్రియాశీల భాగస్వామిని కావాలన్న తపన ఆ యువకుడి మస్తిష్కంలో అగ్ని బిందువు వలె ఎగిసిన క్షణం అది. కొద్దిరోజుల ముందు తన గురువు నందలాల్ బోస్ అప్పుడప్పుడే ఆమోదముద్ర, అక్షరాకృతి పొందిన స్వతంత్ర భారత రాజ్యాంగం ప్రథమ ప్రతిని తన చిత్రకళా విలాసంతో అలంకరింపజేసిన ఘటన యువకుడి కళ్ల ముందు కదిలింది. రవీంద్ర కవిచంద్రుడు వైస్రాయి కర్జన్ కుతంత్రానికి (బెంగాల్ విభజనతో) వ్యతిరేకంగా గళమెత్తి ధ్వజమెత్తిన ఉత్తేజకర దృశ్యం యువకుడి కళ్లముందు కనిపించింది. తన మిత్రుడు, సహచరుడు దాశరథి ఆకృతిలో చిన్న వాడైనా పరిణతిలో ఆకాశమంత ఎత్తు ఎదిగి గొంతెత్తి '.. ఓ జనతా, నతాంజలి పుటోజ్వల దివ్యకవోష్ణ రక్త ధారా జలసిక్త పాద కమలద్వయ శోభ మనోజ్ఞ దేహ రేఖా జయ భారతీ!... తల్లీ! మహాభారతీ..' అంటూ నినదిస్తున్న ఘటన జ్ఞాపకం వచ్చింది. 'నేను సైతం సమిధనొక్కటి ఆహుతిచ్చాను..' అన్న మాటలు ఆ యువకుడి హృదయంలో ప్రతిధ్వనించాయి. తర్వాత కాలంలో చిత్రకళారంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆ యువకుడికి తెలుగు సారస్వత రంగంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది.

అనేక ఆలోచనల భారంతో 1948 ఏప్రిల్‌లో బోలక్‌పూర్– కలకత్తా రైలెక్కిన యువకుడు మద్రాసులో, బెజవాడలో కొన్నిరోజులు గడిపి, వరంగల్లు దగ్గరి ఊరికి రావడానికి ఖాజీపేట రైలు ఎక్కాడు. ఎర్రపాలెం స్టేషన్‌లో మతోన్మాదులైన రజాకార్ల మూక ఒకటి యువకుడు కూర్చున్న పెట్టెలోకి వచ్చి దౌర్జన్యానికి కత్తిదూసింది. అదే పెట్టెలో బెర్త్ మీద యువకుడి మిత్రుడు సిపాసాలార్ మిర్జా పడుకుని యువకుడిని పలకరించాడు. యువకుడు కొండపల్లి శేషగిరిరావు, మిర్జా ఇద్దరు హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో సహధ్యాయులు. అప్పటికి రజాకార్లలో ప్రముఖపాత్ర నిర్వహిస్తున్న మిర్జా సాయంతో శేషగిరిరావు ప్రమాదం నుంచి బయటపడి సురక్షితంగా నర్సంపేట చేరాడు. హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే 1947లో శేషగిరి రావు వివాహం నర్సంపేట ప్రముఖుడు మండవ వెంకటేశ్వరరావు పుత్రిక కమలతో జరిగింది. ఆ రోజుల్లో అది సంస్కరణ వివాహం.అసాధారణ రీతిలో జరిగింది.

కాకతీయ కళా ప్రాభవానికి, చిత్రకళా విలాసానికి నిలయమైన వరంగల్లు జిల్లా మానుకోట సమీపాన పెనుగొండ గ్రామంలో 95 ఏండ్ల కిందట 1924 జనవరి 27 నాడు శేషగిరి జన్మించారు. ఆయన తల్లిదండ్రులు రామచూడమ్మ, గోపాలరావు. తెలంగాణ చిత్ర కళా రంగానికి తల మానికంగా రాణించిన, భాసించిన చిత్రకళా శిఖరం శేషగిరి. పెనుగొండలో పుట్టి, మానుకోటలో ఏడవ తరగతి వరకు చదివి, తరువాత శేషగిరి రావు హనుమకొండ (కాకతీయుల మొదటి రాజధాని) చేరారు. తెలంగాణ ప్రముఖులెందరో చదివిన హనుమకొండ కాలేజియేట్ హైస్కూలులో శేషగిరి రావు విద్యార్థిగా అడుగుపెట్టారు. మెట్రిక్యులేషన్ పూర్తి కాకపోయినా ఒక మహోన్నత చిత్ర కళాకారుడు శేషగిరిరావు మహోజ్వల అధ్యాయం ఒక చిరుదివ్వెను వెలిగించింది ఈ స్కూలులోనే. ఈ బడిలోని డ్రాయింగ్ టీచర్ దీన్‌దయాళ్ ప్రోత్సాహంతో శేషగిరిరావు హనుమకొండ సమీపంలోని పాకాల చెరువు అటవీ ప్రాంతంలో, ప్రకృతి రామణీయకతలో అటవీ సొబగులను ఆస్వాదిస్తూ చిత్రకళ ప్రథమ పాఠాలు నేర్చుకున్నారు. గీతలలో దాగి ఉన్న సృజనాత్మకతను, రేఖలలో ఒదిగి ఉన్న రమ్యతను శేషగిరిరావు ఆ రోజుల్లోనే ఆకళింపు చేసుకుని ఆ రసాత్మక ప్రక్రియలో అఖండ ప్రతిభను ప్రదర్శించారు. పాకాల అడవిలో పల్లవించిన శేషగిరి చిత్రకళా ప్రతిభ అనంతర కాలంలో బహుముఖంగా పరిణతి పొంది సహస్ర కిరణాలతో వెలుగులు విరజిమ్మింది. ప్రాచీనతకు–ఆధునికతకు మధ్య వారధిగా, ఆధ్యాత్మికతకు–ఆధునిక రీతులకు ప్రతినిధిగా అద్వితీయ కళా సంపదను సృష్టించి సమకాలిక చిత్రకళారంగంలో శేషగిరి రావు సమున్నత స్థానం అధిష్ఠించారు. శేషగిరి రావు చిత్రకళా ప్రతిభను, సృజనాత్మక శక్తిని గుర్తించి ఆయన హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో, శాంతినికేతన్‌లో విద్యార్థిగా చేరడానికి అమితంగా సహాయపడిన మహనీయుడు మెహదీ నవాజ్‌జంగ్. శేషగిరి రావుకు సాయాన్ని అర్థిస్తూ మెహదీ నవాజ్‌జంగ్‌కు ఒక లేఖ రాసిన ప్రముఖుడు మందుముల నరసింగరావు. ఆ లేఖతో జంగ్ వద్దకు శేషగిరి రావును తీసుకు వెళ్లిన మిత్రులు వట్టికోట ఆళ్వారుస్వామి, పెండ్యాల రాఘవరావు (మొదటి సాధారణ ఎన్నికలలో, 1952లో, వరంగల్లు జిల్లాలో ఒక లోక్‌సభా స్థానానికి, రెండు శాసన సభ స్థానాలకు ఒకేసారి గెలిచిన అప్పటి సీపీఐ నాయకుడు, కవి, చిత్రకారుడు), గుండవరపు హనుమంతరావు. కొద్ది రోజులు మెహదీ ఇంటిలో ఉన్న శేషగిరి రావు తరువాత హైదరాబాద్ రెడ్డి హాస్టల్‌లో ఉంటూ ఫైన్ ఆర్ట్ కాలేజి చదువు పూర్తి చేశారు. అదే కాలేజ్‌కి ఆయన వైస్ ప్రిన్సిపాల్‌గా, మరో కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.




చిత్రకారుడుగా శేషగిరిరావు ప్రతి గీతతో, ప్రతి రేఖతో మనోహర కళాఖండాలను సృష్టించారు. కుంచె ఆయన చేతిలో మనోజ్ఞ, సుందర దృశ్యాలను సృష్టించే మంత్రదండమైంది. రంగులు ఆయన స్పర్శతో రమణీయ రంగవల్లికలైనాయి. జానపద, సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలు ఎన్నో ఆయన చిత్ర సృజనలో అమూల్య ఇతివృత్తాలైనాయి.

చిత్రకారుడుగా శేషగిరిరావు ప్రతి గీతతో, ప్రతి రేఖతో మనోహర కళాఖండాలను సృష్టించారు. కుంచె ఆయన చేతిలో మనోజ్ఞ, సుందర దృశ్యాలను సృష్టించే మంత్రదండమైంది. రంగులు ఆయన స్పర్శతో రమణీయ రంగవల్లికలైనాయి. జానపద, సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలు ఎన్నో ఆయన చిత్ర సృజనలో అమూల్య ఇతివృత్తాలైనాయి. చిత్ర కళా రీతులపై విలువైన పరిశీలనలు, పరిశోధనలు జరిపిన శేషగిరిరావు చిత్ర కళా విజ్ఞాన సర్వస్వాల వంటి గ్రంథాలు రచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆయనకు లభించిన అవార్డులు, జరిగిన సన్మానాలు అనేకం. కొండపల్లి శేషగిరి రావుకు అత్యంత సన్నిహితులు మహాకవి దాశరథి, సి.నారాయణరెడ్డి, బిరుదురాజు రామరాజు. 88 ఏండ్ల పండు వయస్సులో సైతం కుంచెదింపక కల్హార మాల సమాన కళాఖండాలను సృష్టించిన శేషగిరి రావు 2012 జూలై 26న దివంగతులై చిత్ర కళారంగాన్ని శోక సముద్రంలో ముంచారు. రానున్న తరాల చిత్రకారులకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా శేషగిరిరావు కళాఖండాల ప్రదర్శనశాల (గ్యాలరీ) ఏర్పాటు కావాలన్నది ఆయన అభిమాన కోటి తపన.

(జనవరి 27న కొండపల్లి శేషగిరిరావు జయంతి)

ఇంటర్ స్థాయిలో భాషాభివృద్ధి

విద్య



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

సృజన శక్తిని పెంచేదే విద్య-3

రాష్ట్రంలో పదవ తరగతి తర్వాత ఎక్కువమంది విద్యార్థులు చదివేది ఇంటర్మీడియెట్ కోర్సు. కొన్ని పాఠశాలల్లో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విధానాల్లో 11,12 తరగతులకు విద్యను అందిస్తున్నారు. ఇది కేంద్ర విద్యా విధానాన్ని అనుసరించి ఉంటుంది. లక్షలాదిమంది చేరే ఇంటర్మీడియెట్ కోర్సుల్లోని పాఠ్యాంశాలు మాత్రం వారు పైన చదువబోయే ఉన్నత విద్యా కోర్సులకు పునాదిగా రూపొందిస్తారు. ఇక అందరు విద్యార్థులు తప్పనిసరిగా చదివే కామన్ కోర్సులు ఇంగ్లీషు, రెండవ భాష (సెకండ్ లాంగ్వేజి). సాధారణంగా రెండవ భాషగా చాలామంది విద్యార్థులు మాతృభాషనే తీసుకుంటారు. ఇగ మిగిలింది, చాలాముఖ్యమైంది ఇంగ్లీషు సబ్జెక్టు.

దేశం మొత్తానికి ఇతర దేశాల వలె ఒకే భాష ప్రజలకు మాతృభాష కాదు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క భాష మాట్లాడే ప్రజలున్నారు. ఈ వైవిధ్యాన్ని గుర్తించకుండా స్వాతంత్ర్యానంతరం మన విద్యా విధానాలు రూపొందించారు. దీంతో విద్యార్థులకు–ముఖ్యంగా నిరక్ష్యరాస్య కుటుంబాల నుంచి మొదటిసారిగా పాఠశాలలో చేరే పిల్లలకు దేశంలో విద్య పెద్ద సంకటంగా మారింది. ఇది మార్చాలంటే కొన్ని సమూల మార్పులు అవసరం.

ఇంటర్మీడియెట్ స్థాయిలో ఇంగ్లీషు సబ్జెక్టును చాలా అర్థవంతంగా, ఉపయోగకరంగా రూపొందించి బోధించాలి. ఎందుకంటే ఈస్థాయి తర్వాత ఉన్నతవిద్యలో ప్రవేశించే విద్యార్థులకు తాము ఎంచుకున్న రంగాల్లో అవసరమైన భాష, దానిలోని నైపుణ్యాలు అవసరమౌతాయి. అది నేర్చుకోవాలంటే ఇంటర్ స్థాయిలో ఇంగ్లీషు భాషలో చాలా ఉన్నతస్థాయి (అడ్వాన్స్‌డ్) నైపుణ్యాలు కావాలి. మిగతా అన్ని దేశాల్లో ఉన్నత విద్యస్థాయిలో బోధించే ఇంగ్లీషు, వారి వృత్తులకు ఉపయోగకరమైన పదకోశం, సంభాషణలు, వాక్యాలు, రాతలు ఉంటాయి. ఉదాహరణకు నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందేవారికి వైద్య రంగ సంబంధమైన పదకోశం, రోగులతో, వారి బంధువులతో, దవాఖానలో ఇతర ఉద్యోగుల, వైద్యులతో మాట్లాడే సంభాషణ నైపుణ్యాలు తెలియజెప్పే పాఠ్యాంశాలు ఇంగ్లీషులో ఉంటాయి. అలాగే ఇంజినీరింగ్, మెడిసిన్, అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో కోర్సుల్లో ఆయా వృత్తులకు సంబంధించిన ఇంగ్లీషు బోధించబడుతుంది. ఆ భాషలో సంభాషణలు కూడా వారు తమ వృత్తిలో వాడాల్సిన పదకోశం, నైపుణ్యాలకు సంబంధించి ఉంటాయి. వీటిని 'ఇంగ్లీషు ఫర్ స్పెసిఫిక్ పర్పసెస్ కోర్సులు' అంటారు. ప్రపంచ దేశాలన్నీ ఈ విధానాన్నే పాటిస్తున్నాయి. కానీ మన దేశంలో ఇది పాటించలేకపోవడానికి కారణం విద్యావేత్తలకు, ప్రభుత్వాలకు దార్శనికత లోపించడమే! పదవ తరగతి పూర్తయ్యే సరికి ఇంగ్లీషు భాషలో ధారళంగా మాట్లాడటం, స్వయంగా చదువటం, తప్పులు లేకుండా రాయడం వంటి నైపుణ్యాలు విద్యార్థులకు అందించాలి. ఇంటర్మీడియెట్ స్థాయిలో పైస్థాయి నైపుణ్యాలు బోధించవచ్చు. ఇది చేస్తేనే డిగ్రీ స్థాయిలో ఏ రంగం వారికి సంబంధించిన ఇంగ్లీషు కోర్సు ఆ రంగం వారికి రూపొందించి అందించవచ్చు. అది వారు వారి వృత్తులలో మరింత రాణించడానికి దోహదపడుతుంది.

1970 నుంచి ఇంటర్మీడియెట్ కోర్సు ఉన్నా, నేటి దాకా ఎప్పుడూ వారికి సరిపడే సమగ్రమైన, సహేతుకమైన ఇంగ్లీషు పాఠ్యపుస్తకం రూపొందించబడలేదు. పాసవడం తప్పనిసరి. కాబట్టి బట్టీ పట్టి పాసవుతున్నారు. కానీ వారికి ఆ స్థాయిలో కానీ, పై స్థాయిలో కానీ ఉపయోగపడే ఇంగ్లీషు భాషా నైపుణ్యాలు మాత్రం ఈ సబ్జెక్టు వారికి ఇవ్వడం లేదు. ఈస్థాయి తర్వాత వారిలో కొందరు చిన్న చిన్న ఉద్యోగాలు వెతుక్కుంటారు. ఈరోజుల్లో సూపర్ మార్కెట్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేయాలన్నా ఇంగ్లీషులో భాషా నైపుణ్యాలు నేర్పించడం వల్ల ఈ కొద్దిమందికి ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. ఇక పైచదువులు సాగించే వారికి ఆర్ట్స్, కామర్స్, అడ్మినిస్ట్రేషన్, హోటల్ మేనేజ్‌మెంట్, పారా మెడికల్ రంగంలో డిప్లొమా కోర్సులు, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లో శిక్షణా కోర్సులు, ఇక ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు అందించబడుతాయి. ఈస్థాయిలో విద్యార్థుల భాషా నైపుణ్యాల కంటే వారి వృత్తికి సంబంధించిన అంశాల మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారు. దీంతో ఇంగ్లీషు భాష రాని విద్యార్థులు తమ ఆశలు సఫలం చేసుకోలేకపోతున్నారు. ఎంతో ఆశతో ఉన్న విద్యా రంగంలోకి ప్రవేశించిన వారిలో 30 శాతం మంది ఈ కారణంతో వెనుకబడుతారు. ఇంకో 60 శాతం మంది వారి వారి కోర్సులు పూర్తి చేసినా తగినంత ఇంగ్లీషు భాషా ప్రావీణ్యాలు లేక ఉద్యోగాలు సంపాదించడంలో విఫలమవుతున్నారు. ఈ పరిస్థితి మార్చాలంటే ముందు వ్యాసాల్లో చెప్పినట్టు ప్రాథమిక దశ నుంచి భాషా బోధన పటిష్టపరుచాలి.

ఇంటర్మీడియెట్ స్థాయిలో ఇంగ్లీషు సబ్జెక్టును చాలా అర్థవంతంగా, ఉపయోగకరంగా రూపొందించి బోధించాలి. ఎందుకంటే ఈస్థాయి తర్వాత ఉన్నతవిద్యలో ప్రవేశించే విద్యార్థులకు తాము ఎంచుకున్న రంగాల్లో అవసరమైన భాష, దానిలోని నైపుణ్యాలు అవసరమౌతాయి. అది నేర్చుకోవాలంటే ఇంటర్ స్థాయిలో ఇంగ్లీషు భాషలో చాలా ఉన్నతస్థాయి నైపుణ్యాలు కావాలి.

ఇంటర్మీడియెట్ స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు (వొకేషనల్) కూడా ఉన్నాయి. వీరు ఈ రెండేండ్లు కాగానే తమ వృత్తులు స్వయంగా సాగించడమో, ఉద్యోగాల్లో చేరటమో చేస్తారు. పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారు ఇటువంటి స్థాయిలో ఉంటారు. వీరికి ఇంగ్లీషులో ప్రావీణ్యం మరింత అవసరం. ఎందుకంటే ఈస్థాయి తర్వాత వారింక చదువు కొనసాగించరు. అందుకే ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సులు చేసే వారికి, పాలిటెక్నిక్ కోర్సులు చేసే వారికి ప్రత్యేకంగా ఇంగ్లీషు పుస్తకాలు రూపొందించాలి. ఈ విషయంలో 2000–2001 సంవత్సరాల్లో వొకేషనల్ విద్యార్థుల కోసం రూపొందించబడిన ఇంగ్లీషు పుస్తకాలు (కమ్యూనికేషన్ స్కిల్స్ I, II) ఆ సంవత్సరాల్లో చాలా ఉపయోగంగా ఉన్నాయి. మళ్లీ 2008లో ఎందుకు వాటిని మార్చారో అంతుపట్టని విషయం. అటువంటి పుస్తకాల వల్లనే విద్యార్థులకు ఇంగ్లీషు భాషా నైపుణ్యాలు ఇవ్వగలుగుతాము. ఏదీ ఏమైనా ఇంటర్ స్థాయి విద్యార్థుల జీవితంలో చాలా కీలకమైనది. కాబట్టి వారి భవిష్యత్తును నిర్ణయించే నైపుణ్యాలు వారికి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచించి, ఆచరణలో పెట్టాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

వేములవాడ కల్చరల్: లయబ్రహ్మ, నాద బ్రహ్మ, సద్గురు త్యాగరాజస్వామి 66వ ఆరాధనోత్సవాలు వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాన్ని ఆలయ అద్దాలమండపంలో లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు చౌటి సాంబయ్య తన స్వగృహంలో 66 ఏండ్ల క్రితం త్యాగరాజ ఉత్సవాలను ప్రారంభించారు. తర్వాత ఆలయ అధికారుల అనుమతితో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాంబయ్య రెండో కుమారుడైన లక్ష్మణ మూర్తి త్యాగరాజు చిత్రపటం ముందు తంబూర చేతిలో పట్టుకోగా, రాజరాజేశ్వర సంస్కృత పాఠశాల, కళాశాల, శిశుమందిర్ విద్యార్థుల కోలాటాలు, వేదమంత్రాలమధ్య త్యాగరాజ స్వామి చిత్రపటంతో పురవీధులగుండా నగరసంకీర్తన చేశారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామివారి జీవిత విశేషాలను చౌటి లక్ష్మణమూర్తి వివరించారు. ఓపెన్‌స్లాబ్‌పై ఏర్పాటుచేసిన ఉత్సవ వేదికపై ఆలయ ఈవో దూస రాజేశ్వర్, నగరపంచాయతీ చైర్‌పర్సన్ నామాల ఉమ, వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. వేడుకల్లో భాగంగా శ్రీమతి నీతాచంద్రశేఖర్, కొరిడె నరహరిశర్మ, అనుపమ బృందం పంచరత్నగానం నిర్వహించింది. సాయంత్రం దేశపతి శ్రీనివాస్ భక్తిసంగీతం శ్రోతలను ఆనందపరవశులను చేసింది. అనంతరం డీ ఉమామహేశ్వరి భాగవతారిణి హరికథ ఆహూతులను కట్టిపడేసింది. కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్ నామాల లక్ష్మీరాజం, నిమ్మశెట్టి విజయ్, సాహితీవేత్తలు నగుబోతు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు
పంచరత్నగానాలతో అలరించిన నీతాచంద్రశేఖర్ బృందం

నాదయోగి త్యాగరాజు

వాగ్గేయకారుల్లో త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిని సంగీత త్రిమూర్తులుగా కీర్తిస్తారు. వీరిలో ఆద్యులైన త్యాగరాజస్వామి తెలుగువారు కావడం మనకు గర్వకారణం. త్యాగరాజస్వామి కర్ణాటక సంగీతంలో 64 వేల కృతులు రచించారు. వేములవాడకు చెందిన చౌటి సాంబయ్య 80 ఏండ్ల కిందట తమిళనాడులోని తిరువయూర్ దర్శనం చేసుకొని తిరిగొచ్చిన తర్వాత తన ఇంటినే వేదికగా చేసుకొని త్యాగరాజ ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన ఉంచ (జోలె పట్టుకుని) వృత్తి చేసుకుంటూ గ్రామంలో భిక్షాటన చేసి ఐదురోజుల పాటు సంగీత కార్యక్రమాలు నిర్వహించేవారు. శక్తిమేర ఉత్సవాలు నిర్వహించి.. ఆర్థిక స్థోమత లేక 1953లో దేవాలయానికి బాధ్యతలు అప్పగించారు. 1986 వరకు తాను దగ్గరుండి ఉత్సవాలను పర్యవేక్షించారు. 1989లో సాంబయ్య మరణించారు. ఆయన సంతానం వారసత్వాన్ని కొనసాగిస్తూ వేడుకల్లో భాగస్వాములు అవుతున్నారు. రాజన్న దేవస్థానం ఆధ్వర్యంలో 66 ఏండ్లుగా నిరాటంకంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డి.. చౌటి సాంబయ్య తండ్రి చౌటి నర్సయ్య శిష్యుడు కావడం గమనార్హం.



త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న ఆలయ ఈవో, చైర్‌పర్సన్ నామాల ఉమ

ప్రముఖుల ప్రదర్శనలు: వేములవాడలో నిర్వహించే త్యాగరాజ ఉత్సవాల్లో భాగంగా గతంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఘంటసాల, బాలమురళీకృష్ణ, సుశీల, సినారె, రామకృష్ణ, జిక్కి, ఆనంద్, శోభారాజు, హరికథా పితామహుడు కోటా సచ్చిదానందశాస్త్రి, ఎల్లా వెంకటేశ్వర్‌రావు, శ్రీరంగం గోపాలరత్నం, నూకల చిన సత్యనారాయణ, ములుకుట్ల సదాశివశాస్త్రి, వేదాంతం వెంకట సుబ్బారావు, నేదునూరి కృష్ణమూర్తి, మాండలిన్ శ్రీనివాస్, వేదాంతం రాఘవయ్య, శోభానాయుడు, ప్రముఖ నేపథ్య గాయని సునీత, గీతామాధురి తదితరులు పాల్గొని తమ ప్రదర్శనలు ఇచ్చారు.



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో ఎన్నికల ఫలితాలు తెలుసుకునేందుకు భవనంపైకి ఎక్కి ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జనం



ఆసిఫాబాద్ జిల్లా వల్లకొండలో పక్షవాతంతో మంచం పట్టిన హోక్టయ్యను ఓటు కోసం తీసుకొస్తున్న స్థానికులు



నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో ఓటేసిన యువతులు

నిజామాబాద్‌లో..

నిజామాబాద్ జిల్లాలో రెండోవిడుత ఎన్నికల్లో 84.93 శాతం పోలింగ్ నమోదైంది. 141 పంచాయతీలకుగాను 33 ఏకగ్రీవమయ్యాయి. 107 స్థానాలకు ఎన్నికలు జరుగగా, 99 చోట్ల టీఆర్ఎస్, 22 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు. కామారెడ్డి జిల్లాలో రెండోవిడుత ఎన్నికల్లో 90.04 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 192 స్థానాలకు 52 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 140 స్థానాలకు ఎన్నికలు జరుగగా.. ఏకగ్రీవాలతో కలిపి 119 మంది టీఆర్ఎస్, 48 మంది కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు.

కొనసాగిన గులాబీ హవా

రెండోవిడుత పంచాయతీ ఎన్నికల్లోనూ సత్తాచాటిన టీఆర్ఎస్ మద్దతుదారులు

పల్లెల్లో ఉత్కంఠ రేపిన ఎన్నికల ఫలితాలు.. పలుచోట్ల విజేతలను తేల్చిన టాస్



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడలో ఓటేసి వస్తున్న 113 ఏండ్ల వృద్ధురాలు పంజాల లక్ష్మి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామ పంచాయతీ ఎన్నికల రెండోవిడుతలోనూ 'కారు' దూసుకుపోయింది. మొదటివిడుతలో సత్తాచాటిన టీఆర్ఎస్.. శుక్రవారం జరిగిన రెండోవిడుత ఎన్నికల్లోనూ జోరును కొనసాగించింది. అధిక స్థానాల్లో అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులనే విజయం వరించింది. ఏకగ్రీవాలే కాదు.. ఎన్నికల బరిలోనూ గులాబీ పార్టీ మద్దతుదారులు గెలుపొందారు. మెదక్ జిల్లాలో రెండోవిడుత ఎన్నికల్లో 92.52 శాతం పోలింగ్ నమోదైంది. 130 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా 92 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. ఏకగ్రీవమైన 40 పంచాయతీలను కలుపుకొని 132 స్థానాలను టీఆర్ఎస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ 26 పంచాయతీల్లో, ఇతరులు 12 చోట్ల గెలుపొందారు. సంగారెడ్డి జిల్లాలో రెండోవిడుతలో మొత్తం 190స్థానాలకు 52 ఏకగ్రీవమయ్యాయి. ఇందులో 51చోట్ల టీఆర్ఎస్ మద్దతు అభ్యర్థులు విజయం సాధించారు. 138స్థానాలకు పోలింగ్ జరగ్గా 91 స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు, 35 స్థానాల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. సిద్దిపేట జిల్లాలో శుక్రవారం జరిగిన రెండో విడుత ఎన్నికల్లో 92.34 శాతం పోలింగ్ నమోదైంది. 172 గ్రామాల్లో 1,80,146 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో అధిక సంఖ్యలో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.

రంగారెడ్డి జిల్లాలో రెండోవిడుతలో 181 పంచాయతీలకుగాను 21 పంచాయతీలు, 1656 వార్డులకుగాను 256 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 160 పంచాయతీలు, 1400 వార్డులకు ఎన్నికలు జరుగగా, 104 పంచాయతీల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు, 44 చోట్ల కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు. వికారాబాద్ జిల్లాలో రెండోవిడుత ఎన్నికల్లో 83.19 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 168 గ్రామ పంచాయతీలుండగా 18 ఏకగ్రీవమయ్యాయి. 150 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవ పంచాయతీలు కలుపుకొని 95 చోట్ల టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందగా, కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు 44 విజయం సాధించారు. ధారూర్ మండలంలోని కుక్కింద గ్రామ పంచాయతీ, నవాబుపేట్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామ పంచాయతీల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చాయి. అధికారులు టాస్‌వేసి విజేతలను నిర్ణయించారు. రెండుపంచాయతీల్లోనూ సర్పంచ్‌లుగా టీఆర్ఎస్ మద్దతు తెలిపిన అభ్యర్థులు వీరేశం, డెక్క పద్మమ్మ గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు. మేడ్చల్ జిల్లాలో రెండో విడుతలో 80.74 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 28 పంచాయతీల్లో ఐదు గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. 23 సర్పంచ్ స్థానాలకు, 322 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగ్గా, 19 పంచాయతీల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. మైసిరెడ్డిపల్లిలో టీఆర్ఎస్ బలపర్చిన కరుణాకర్ స్వతంత్ర అభ్యర్థి భూషణంపై ఒక్క ఓటు ఆధిక్యంతో గెలిచారు.



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఖమ్మంలో 91.47శాతం పోలింగ్

ఖమ్మం జిల్లాలో రెండోవిడుతలో ఒక పంచాయతీ ఎన్నిక వాయిదా పడగా 203 జీపీలకు గాను 35 ఏకగ్రీవమయ్యాయి. మిగతా 168 స్థానాలకు ఎన్నికలు జరుగగా 91.47శాతం పోలింగ్ నమోదైంది. టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 152 చోట్ల గెలుపొందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 142 పంచాయతీలకుగాను 20 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 122 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 83.57 శాతం పోలింగ్ నమోదైంది. 79 మంది టీఆర్ఎస్ బలపర్చిన, 26 మంది కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు గెలుపొందారు.

వరంగల్‌లో ప్రశాంతంగా పోలింగ్

వరంగల్ అర్బన్ జిల్లాలో 86.98 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలో 22 పంచాయతీలకు గానూ రెండు ఏకగ్రీవం కాగా 20 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించారు. 17 పంచాయతీలను టీఆర్ఎస్ కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 5స్థానాలతో సరిపెట్టుకున్నది. భూపాలపల్లి జిల్లాలో 123 జీపీలకు ఎన్నికలు నిర్వహించగా 87.70 శాతం పోలింగ్ నమోదైంది. 70 పంచాయతీలో టీఆర్ఎస్.. 45కాంగ్రెస్, ఇతరులు ఎనిమిది స్థానాల్లో విజయం సాధించారు. మహాముత్తారం మండలం ప్రేమ్‌నగర్ ఓట్ల లెక్కింపులో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. రూరల్ జిల్లాలో 87.52 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 136 జీపీలకు నోటిఫికేషన్ జారీ చేశారు. టీఆర్ఎస్ 106 , కాంగ్రెస్ 19, స్వతంత్రులు 11 స్థానాల్లో గెలుపొందారు. 33 జీపీలు ఏకగ్రీవమయ్యాయి. జనగామ జిల్లాలో నాలుగు మండలాలకు ఎన్నికలు నిర్వహించగా 90.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 109 జీపీలకు నోటిఫికేషన్ ఇవ్వగా 27 ఏకగ్రీవమయ్యాయి. టీఆర్ఎస్‌కు 80, కాంగ్రెస్ 15, ఇతరులు 14స్థానాల్లో గెలుపొందారు. మహబూబాబాద్ జిల్లాలో 147జీపీలకు 42జీపీలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల్లో 91.05 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాలను పరిశీలిస్తే టీఆర్ఎస్ 121, కాంగ్రెస్ 19, టీడీపీ 2, సీపీఎం మద్దతుదారులు 2 స్థానాలను కైవసం చేసుకున్నారు.

పీసీసీ నేత ఉత్తమ్‌కు గట్టిషాక్..

నల్లగొండ జిల్లాలో రెండో విడుత పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. 10 మండలాల పరిధిలో 276 పంచాయతీల్లో ఎన్నికలు జరగ్గా 91.87 శాతం పోలింగ్ నమోదైంది. గతంలోనే 52 పంచాయతీలు ఏకగ్రీవం మయ్యాయి. మెజార్టీ స్థానాల్లో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందారు. నల్లగొండలో 276 స్థానాలకు గానూ టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు 210స్థానాల్లో, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు 64 స్థానాల్లో గెలుపొందారు. సూర్యాపేట జిల్లాలో 92.82 శాతం పోలింగ్ నమోదైంది. 160 పంచాయతీల్లో 29 ఏకగ్రీవం కాగా 131 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. రెండో విడుతలోనూ గులాబీ జెండా రెపరెపలాడింది. ఏకగ్రీవం, ఎన్నికలు జరిగిన గ్రామాలు కలుపుకొని టీఆర్ఎస్ మద్దతుదారులు 109 సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ 36, ఇతరులు 15 స్థానాల్లో విజయం సాధించారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 129 జీపీలకుగాను 16 ఏకగ్రీవం కాగా 113 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. 113 సర్పంచులకుగాను ఏకగ్రీవాలను కలుపుకొని 64 టీఆర్ఎస్, 36 కాంగ్రెస్, 9 మంది ఇండిపెండెంట్లు గెల్చుకున్నాయి.

కరీంనగర్‌లో టీఆర్ఎస్ హవా

కరీంనగర్ జిల్లాలోని రెండో విడుతలో ఐదు సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా 102 జీపీలకు ఎన్నికలు నిర్వహించారు. 89.52శాతం పోలింగ్ నమోదైంది. 70 చోట్ల టీఆర్ఎస్, కాంగ్రెస్ 17 స్థానాలకే పరిమితం కాగా, కేవలం 2చోట్ల బీజేపీ మద్దతుదారులు గెలుపొందారు. 5చోట్ల సీపీఐ బలపరిచిన అభ్యర్థులు, 13మంది స్వతంత్రులు విజయం సాధించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో 21 స్థానాలు ఏకగ్రీవం కాగా.. మల్లాపూర్‌లో గ్రామస్థులు ఫిర్యాదుతో అధికారులు ఎన్నికను నిలిపివేశారు. దీంతో 100 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. 75 మంది టీఆర్ఎస్ మద్దతుదారులు, 20 మంది కాంగ్రెస్, 11 మంది బీజేపీ అభ్యర్థులు, 13 మంది స్వతంత్రులు గెలుపొందారు. పెద్దపల్లి జిల్లాలో 9 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా, 67 జీపీలకు పోలింగ్ నిర్వహించారు. 50 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. ఓదెల మండలం మడకలో మ్యాడగోని భాగ్యమ్మ మూడు ఓట్లతో, పెద్దపల్లి మండలం అందుగులపల్లిలో శారద ఏడు ఓట్లతో గెలుపొందారు. రాజన్న సిరిసిన్న జిల్లాలో 16 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 68 మంది టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించగా, కాంగ్రెస్ బలపర్చిన వారు ఆరుగురు గెలుపొందారు. ముగ్గురు బీజేపీ ఏడుగురు స్వతంత్రులు గెలుపొందారు.

- ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ముత్నూర్‌తండా పంచాయతీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోవడంతో పవార్ కళాబాయి అనే మహిళ మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గతంలో కూడా ఆమె ముత్నూర్ పంచాయతీకి పోటీచేసి ఓడిపోయారు. రెండోసారి ఓడిపోవడంతో పురుగుమందు తాగారు. ఆమెను కుటుంబసభ్యులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్సనందిస్తున్నారు.
- జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో ఇద్దరు వృద్ధులు శుక్రవారం ఓట్లువేసి వచ్చి అరగంట తర్వాత అనారోగ్యకారణాలతో మృతిచెందారు. బొమ్మెన గ్రామానికి చెందిన కేతవేని రాజనర్సయ్య(92), పెగ్గెర్లలో దానవేణి చిన్నమ్మ(85) శుక్రవారం పోలింగ్ కేంద్రం వద్ద ఓటేసి ఇంటికొచ్చిన కొద్దిసేపటికే ప్రాణాలు వదిలారు.
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రుక్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ జగినీబాయి గుండెపోటుతో మృతిచెందారు. రుక్మాపూర్ పంచాయతీ పరిధిలోని చాప్లానాయక్‌కు తండాకు చెందిన జగినీబాయి రెండోవార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రుక్మాపూర్ గ్రామ పాలకవర్గంతోపాటు జగినీబాయిని కూడా ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో టీఆర్ఎస్ బలర్చిన జోగినిపల్లి లత తన సమీప ప్రత్యర్థి అజ్మీర కరుణపై ఒక్క ఓటు మెజార్టీతో విజయం సాధించారు. బంజేరులో పంచాయతీలో టీఆర్ఎస్ మద్దతుతో బరిలో నిలిచిన మహమ్మద్ షాఫీయా తన సమీప ప్రత్యర్థి గుగులోత్ కళపై ఒక్క ఓటుతో తేడాతో విజయం సాధించారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని అయ్యపల్లి తండాలో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి దేవసోత్ జీల్యా తన సమీప ప్రత్యర్థి కేతావత్ రూప్‌సింగ్‌పై ఒక్క ఓటు మెజార్టీతో విజయం సాధించారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంలో కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగింది. టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆడేపు విజయ ఒక్క ఓటు తేడాతో గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు. దీంతో ఆమె సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ బలపర్చిన మంచాల సంధ్యారాణి అభ్యంతరం తెలిపారు. ఎన్నికల అధికారులు రీ కౌంటింగ్ చేయగా ఆడేపు విజయకు రెండు ఓట్ల ఆధిక్యం వచ్చింది. దీంతో విజయ గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు.
- నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లాపల్లి పంచాయతీ సర్పంచ్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థికి కేటాయించిన గుర్తు బ్యాలెట్ పత్రంపై కనిపించకపోవడంతో అధికారులు పోలింగ్‌ను నిలిపివేశారు. త్వరలోనే పోలింగ్ తేదీని ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.
- ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీచేసిన అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో అధికారులు టాస్ వేయగా కల్తి భద్రమ్మను విజయం వరించింది.
- వరంగల్‌రూరల్‌జిల్లా పర్వతగిరి మండలంలోని ముంజాలకుంట తండాలో రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జాటోతు రవీందర్ సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ నెల 21న మొదటి విడత పోలింగ్ జరుగగా, రెండోవార్డులో టెండర్ ఓటు నమోదు కావడంతో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు రీపోలింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం తిరిగి మళ్లీ ఎన్నికను నిర్వహించారు.
- ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని సూర్యాతండాల్లో రెండో విడుతలో జరిగిన ఎన్నికల్లో తల్లి సర్పంచ్‌గా తనయుడు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సూర్యాతండా పంచాయతీ సర్పంచ్‌గా జర్పుల శాంతి 146 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందగా.. ఆమె కుమారుడు విక్రమ్ పదో వార్డు మెంబర్‌గా బరిలో నిలిచి ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.
- కుమ్రంభీం జిల్లా ఆసిఫాబాద్‌లోని సిర్పూరు నియోజకవర్గంలో వల్లకొండలో పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన జాడి హోక్టయ్య అనే ఓటరును యువకులు మంచంపై పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించారు.
- మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని దాట్ల గ్రామంలో బుధవారం కన్న వెంకన్న గుండెపోటుతో మృతి చెందాడు. కాగా శుక్రవారం పంచాయతీ ఎన్నికలు ఉండడంతో పుట్టెడు దుఃఖంలోనూ ఆ కుటుంబసభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొయ్యేట దుర్గవ్వ (115) ఓటు హక్కు వినియోగించుకొని అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఘనంగా జాన్‌పహాడ్ ఉర్సు

గంధోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ దర్గా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం గంధోత్సవం (ఉర్సే షరీఫ్) వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు నుంచి తీసుకొచ్చిన గంధాన్ని గ్రామంలోని దర్గా వద్ద వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఉంచి, అక్కడి నుంచి పవిత్రంగా అమర్చిన కళశాలలో ఫకీర్ల ఖవ్వాలీలు, మేళతాళాలతో చందల్‌ఖానా వరకు తీసుకొచ్చారు. టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రార్థనల్లో పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్‌లో గంధం ఊరేగింపు నిర్వహిస్తున్నదృశ్యం

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్‌లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో ఉన్న జొన్నరొట్టెల విక్రయించే డబ్బా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున కొందరు చలిమంట కాచుకొనేందుకు డబ్బా సమీపంలో చెత్తవేసి నిప్పంటించారు. మంటలు డబ్బావరకు వ్యాపించి ఉదయం ఏడు గంటల సమయంలో మంటలు ఎక్కువయ్యాయి. స్థానికులు ఈ విషయాన్ని డబ్బా నిర్వాహకుడు నర్సింహకు తెలియజేయగా అతను వచ్చి డబ్బాను షెట్టర్ తెరిచేందుకు యత్నిస్తుండగా సిలిండర్ పేలింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

టీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హుజురాబాద్ నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లి, పోతిరెడ్డిపేట, పెద్దపాపయ్యపల్లిలో ఆయన గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుంటే అందరికీ మంచిదని సూచించారు. ఆయకట్టేతర గ్రామాలైన తుమ్మనపల్లి, ఇప్పలనర్సింగాపూర్, బోర్నపల్లి, దమ్మక్కపేట గ్రామాలకు కాకతీయ కాలువనీళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

టీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

ఫర్నిచర్ ధ్వంసం.. 12 మందిపై కేసు

టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో శుక్రవారం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగ్రామం కోయగూడెంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ శుక్రవారం ప్రచారానికి వెళ్లారు. ఆమె ముందుగా హనుమతండాలో కోరం కనకయ్యపై చేసిన ఆరోపణలు వివాదానికి దారితీశాయి. హరిప్రియ ఆరోపణలను నిరసిస్తూ టీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. మరోవైపు కోయగూడెంలో సర్పంచ్ అభ్యర్థి కాంగ్రెస్ నేత లక్ష్మీనారాయణకు ఎందుకు మద్దతివ్వడంలేదని ఆయన వర్గీయులు ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. అసహనానికి గురైన ఎమ్మెల్యే వర్గీయులు యాభైమంది టేకులపల్లిలోని టీఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసి ఫర్నీచర్ ధ్వంసంచేశారు. టేకులపల్లి సీఐ నాగరాజు, ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి వచ్చి ఆందోళనకారులను చెదరగొట్టారు. టీఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసిన 12 మంది కాంగ్రెస్ కార్యకర్తలపై, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలుచేసిన 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోయగూడెం, టేకులపల్లిలో 144 సెక్షన్ విధించారు.



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రేగొండి గ్రామ పంచాయతీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన హైదర్ శుక్రవారం మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కాచనపల్లి వాసులు

ఎన్నికల్లో సహకరించలేదని గ్రామ బహిష్కరణ

రహస్య తీర్మానం చేసిన న్యూడెమోక్రసీ నాయకులు

మహబూబాబాద్ జిల్లా కాచనపల్లిలో అనాగరికం

బయ్యారం(మహబూబాబాద్): తమకు ఎన్నికల్లో సహకరించలేదని న్యూడెమోక్రసీ నాయకులు 20 కుటుంబాలను బహిష్కరించిన ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కాచనపల్లిలో చోటుచేసుకున్నది. దీంతో బాధిత కుటుంబాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాచనపల్లిలో న్యూడెమోక్రసీ బలపర్చిన అభ్యర్థిగా కొట్టెం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా భూక్య రమేశ్, టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిగా ముడిగ వజ్జయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థిగా గొగ్గెల శ్యామల పోటీపడ్డారు. ఏకగ్రీవం చేసుకొనేందుకు చర్చలు జరిపినా ఫలించలేదు. దీంతో నలుగురూ పోటీలో నిలిచారు. చివరికి ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి వజ్జయ్య న్యూడెమోక్రసీ అభ్యర్థి వెంకటేశ్వర్లుపై గెలుపొందారు. దీంతో తాము ఓడిపోవడానికి గ్రామంలోని ఓ 20 కుటుంబాలే కారణమని వారికి తమపార్టీ వారు ఎవరూ సహకరించవద్దని న్యూడెమోక్రసీ నాయకులు రహస్య తీర్మానం చేశారు. దీంతో ఆ 20 కుటుంబాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వ్యవసాయ, ఇంటి పనుల్లో ఎవరైనా సహకరిస్తే రూ. 15 వేల జరిమానతోపాటు వారికి కూడా సహాయనిరాకరణ చేస్తామని న్యూడెమోక్రసీ నేతలు హుకుం జారీచేశారని బాధితులు వాపోయారు. తమను కుళాయిల దగ్గరికి రానివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



అదే పులి.. కరంటు వైరుకు బలి

- తొమ్మిదిమందిపై కేసు ఐదుగురి అరెస్ట్

ప్రత్యేక ప్రతినిధి/మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మంచిర్యాల జిల్లా మందమర్రి వద్ద లభ్యమైన పెద్దపులి చర్మం కేసులో అధికారులు పురోగతి సాధించారు. ఈ చర్మం.. ఇటీవల నిర్మల్ జిల్లా పెంబి అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కిన పెద్దపులికి చెందినదిగా గుర్తించిన అధికారులు.. ఈ కేసులో తొమ్మిదిమందిని నిందితులుగా తేల్చారు. చెన్నూరు మండలం శివ్వారం వద్ద అమర్చిన కరంట్ తీగలకు పులి బలైనట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో చంద్రపూర్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ ఎన్జీవోసంస్థ, మంచిర్యాల ఫారెస్ట్ అధి కారుల చేసిన స్టింగ్ ఆపరేషన్‌లో మందమర్రిలోని ఐలవేణి లింగయ్య ఇంట్లో పులి చర్మం ఉన్నట్లు గుర్తించారు. నిందితు లను అదుపులోనికి తీసుకుని ప్రశ్నించగా.. పది రోజుల కిందటే పులిని చంపినట్లు అంగీకరిం చారు. శివ్వారం ప్రాంతంలోని అభయారణ్యం వద్ద సాయిలుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి చనిపోయిందని తెలిపారు. దీంతో పులి చర్మాన్ని వొలిచిన నిందితులు శరీర భాగాలను ముక్కలుగా కోసి దాచిపెట్టినట్టు తెలుపడంతో రామగుండం కమిషనర్ సత్యనారాయణ, మంచి ర్యాల డీఎఫ్‌వో రామలింగం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్ట్‌చేశా రు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. దండవేణి శైలు, తొక్కల మల్లయ్య, తొక్కల బుచ్చిరాజం, బీచపల్లి కొమురయ్య, అయిలవేణి అంజయ్య, మేకల నర్సయ్య, అయిలవేణి సాగర్, పూర్ణచందర్, ఎన్ రవీందర్ తదితరులు పులి చర్మం ఒలిచిన కేసులో ఉన్నట్లు తేలింది. పులి గోర్లను కూడా నిందితులు తీశారని దర్యాప్తులో వెల్లడైంది.

ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలపై నివేదికివ్వండి

- విద్యాశాఖకు హైకోర్టు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఏదైనా ఒక గ్రామీణ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల నాణ్యత, ప్రవేశాలు తదితర అంశాలపై అధ్యయనం చేసి.. మూడువారాల్లో నివేదిక అందజేయాలని విద్యాశాఖకు హైకోర్టు సూచించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలకు సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం శుక్రవారంనాడు విచారణ జరిపింది. అంతకుముందు విద్యాశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది సీ వాణిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్నదని, ఉపాధ్యాయులకు కూడా ఉత్తమశిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

తెలంగాణలో టెంటమస్ పెట్టుబడులు

- టీఎస్ఐఐసీతో కుదిరిన ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత్‌లో తొలిసారిగా తెలంగాణలో ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు జర్మనీకి చెందిన టెంటమస్ వ్యాపారసంస్థ సిద్ధమైంది. ఫుడ్ అండ్ ఫీడ్, ఫార్మాస్యూటికల్స్ అండ్ మెడికల్, ఆగ్రో కెమికల్స్, కాస్మోటిక్స్, అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లో కట్టింగ్ ఎడ్జ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా ఉత్పాదకతను పెంచేందుకు ముందుకొచ్చింది. శుక్రవారం పరిశ్రమల భవన్‌లో టెంటమస్ సీఈవో బర్సేటెన్.. టీఎస్ఐఐసీ ఎండీ నరసింహారెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో టెంటమస్ సీఈవో కీర్తివర్ధన్‌రెడ్డి వేముల, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్‌కుమార్, డైరెక్టర్ సీడ్స్ కేశవులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు జెండావిష్కరణ చేయాలి

- సీఎస్ ఎస్కే జోషి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లా కేం ద్రాల్లో కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే.జోషి శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొనాలని తెలిపా రు. గ్రామాల్లో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు జెండా ఆవిష్కరణ బాధ్యతను తీసుకోవాలని, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జెండా ఆవిష్కరణ చేసి, గణతంత్ర దినోత్సవ విశిష్టతను వివరించాలని సూ చించారు. జెండా ఆవిష్కరణకు ప్లాస్టిక్ జెం డాలను వాడరాదని సీఎస్ ఆదేశించారు.

ఇద్దర్ని కాదు.. నలుగురిని కనండి

- పసుపు కుంకుమ కార్యక్రమంలో ఏపీ సీఎం బాబు పిలుపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో జనాల సంఖ్య తక్కువగా ఉన్నందున మహిళలు ఇద్దర్ని కాదు.. నలుగురిని కనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు జిల్లా నేలపాడులో జరిగిన 'పసుపు కుంకుమ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగున్నరేండ్లలో మహిళలకు పసుపు కుంకుమ కింద రూ.21,116 కోట్లు ఇచ్చానన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా డ్వాక్రా సంఘాలను తానే తీర్చిదిద్దానని మరోమారు వల్లెవేశారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు రూ.10 వేల చొప్పున అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ డబ్బును మూడువిడుతల్లో చెక్కులరూపంలో ఖాతాల్లో జమ చేస్తానన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో డ్వాక్రా గ్రూపు మహిళలకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదని చంద్రబాబు అన్నారు. 'తెలంగాణ నాయకుడు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాడంట. వీళ్ల ఆటలు సాగనివ్వకూడదు' అని ఆయన హెచ్చరించారు.

మోదీకి పోయేకాలం దగ్గరపడింది

ఎన్నికలకు ముందు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు దొంగ సర్వేలు చేయడం అలవాటేనని చంద్రబాబు విమర్శించారు. శుక్రవారం టీడీపీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్ని దొంగ సర్వేలు చేసినా ప్రజాదరణను తారుమారు చేయలేవని పేర్కొన్నారు. ప్రధాని మోదీకి పోయేకాలం దగ్గరపడిందని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఇంటికి పంపుతారని జోస్యంచెప్పారు.

చంద్రబాబుది నోట్ ఫర్ ఓట్: జగన్

ఎన్నికల వేళ సీఎం చంద్రబాబు మహిళలను బుట్టలో వేసుకొనేందుకు 'నోట్ ఫర్ ఓట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని వైసీపీ అధ్యక్షుడు జగన్ విమర్శించారు. ఇన్నాళ్లు ఈ పథకాన్ని ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నించారు. ఇవన్నీ ఎన్నికల గిమ్మిక్కులేనని, గెలిచాక అన్నీ బంద్ అవుతాయని విమర్శించారు.

సీఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అఖిల భారత స్థాయిలో మొదటి 50 ర్యాంకుల్లో 8 ర్యాంకులు సాధించారు. సీఏ ఫౌండేషన్ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు మొదటి 50 ర్యాంకుల్లో 19 సాధించారని మాస్టర్‌మైండ్స్ అకడమిక్ అడ్వైజర్ మట్టుపల్లి ప్రకాశ్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

70 కోట్లు ముంచిన 'విజ్డమ్'

- దేశ, విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం
- కోట్లలో సభ్యులు.. లక్షకుపైగా బాధితులు
- నిర్వాహకుడు అజయ్ కొల్లాతోపాటు మరో 13 మంది అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉద్యోగాల పేరుతో ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో నిరుద్యోగులను మోసం చేస్తున్న విజ్డమ్ సంస్థ గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టుచేశారు. ఉద్యోగాల పేరుతో నిలువుదోపిడీకి పాల్పడుతున్న సంస్థ నిర్వాహకుడితోపాటు ఆయనకు సహకరిస్తున్న మరో 13 మంది ప్రతినిధులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. సంస్థ బ్యాంకు ఖాతాల్లోని రూ.23 లక్షలను సీజ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు మూడు కోట్ల మందిని సభ్యులుగా చేర్చుకొన్నారని, ఇప్పటి వరకు రూ.70 కోట్ల మేర మోసాలకు పాల్పడ్డారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం సైబరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాకు తెలిపారు.

ప్రారంభించాడిలా..: విజ్డమ్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను అజయ్ కొల్లా 2009లో అయ్యప్ప సొసైటీలో ప్రారంభించాడు. 2011లో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) వద్ద సంస్థను రిజిస్ట్రేషన్ చేశాడు. విజ్డమ్‌జాబ్స్‌ఇండియా డాట్ కాం, విజ్డమ్‌జాబ్స్‌గల్ఫ్ డాట్ కాం పేరుతో నిరుద్యోగులను ఆకర్షించాడు. ఇండియా వెబ్‌సైట్‌లో రోజు 20 వేలు, గల్ఫ్ వెబ్‌సైట్‌లో మూడు వేల చొప్పున సభ్యులు రావడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య 2.85 కోట్ల వరకు చేరుకొన్నది. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతుండటంతో సంస్థ కార్యాలయాన్ని సైబర్ టవర్స్ ఏడో అంతస్తుకు మార్చాడు.

వల విసిరాడిలా..: ఉచిత రిజిస్ట్రేషన్లు చేసుకొన్నవారికి అమ్మాయిలతో ఫోన్ చేయించి ఐదంకెల జీతం పొందాలంటే అందమైన రెజ్యూమ్ తయారుచేయాలంటూ తీయగా మాట్లాడిస్తాడు. ముగ్గులో దింపేందుకు ఇంగ్లిష్ భాషలో పట్టున్నవారిని ఉద్యోగులుగా నియమించాడు. అమెరికన్, బ్రిటన్ ఇంగ్లిష్ యాక్సెంట్‌లో ఎలా బురిడీ కొట్టించాలో నేర్పించాడు. ఎక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్ ఫీ కట్టించినవారికి కమీషన్ కూడా ముట్టజెప్పేవాడు. దరఖాస్తు చేసుకొన్నవారికి ఫలానా కంపెనీలో ఉద్యోగం ఉందంటూ తొలుత సూచిస్తారు. ఫలానారోజు ఇంటర్వ్యూ ఉంటుందని మరోసారి చెప్తారు. అవసరమైతే నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ పంపించడం.. కొన్నిసార్లు డబ్బులు చెల్లించిన కొందరికి సమాధానం చెప్పకుండా ఫోన్లు కట్ చేస్తుండేవారు.

వెలుగులోకొచ్చిందిలా..: హైదరాబాద్ చింతల్ వాసి ఏడుకొండలు గల్ఫ్‌లో ఉద్యోగం కోసం తన రెజ్యూమ్‌ను విజ్డమ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. రెజ్యూమ్ హైలైట్ చేస్తే మంచి ఉద్యోగం వస్తుందని విజ్డమ్ ప్రతినిధి మౌనికారెడ్డి ఒత్తిడి తెచ్చి.. 150 డాలర్లు ఫీజు చెల్లించేలా చేసింది. కొన్నిరోజుల తరువాత ఫోన్ చేసి రావన్ జనరల్ పెట్రోలియం కంపెనీలో మీకు ఉద్యోగం ఖరారయ్యిందని చెప్పి, మరుసటిరోజు ఇంటర్వ్యూ కాల్ కనెక్ట్ చేస్తున్నామంటూ రావన్ పెట్రోలియమ్ కంపెనీ ప్రతినిధి అంజిలా బోస్‌తో నకిలీ ఇంటర్వ్యూ నిర్వహించారు. సీనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగం ఓకే అయిందని పెట్రోలియం సంస్థ ప్రతినిధిగా జెస్సీ అనే మహిళతో మాట్లాడించి సెక్యూరిటీ డిపాజిట్‌గా 525 డాలర్లు వసూలుచేశారు. వాళ్లు చెప్పినట్టు డబ్బు చెల్లించి చాలా రోజులు గడుస్తున్నా ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ఏడుకొండలు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదుచేసుకొని విజ్డమ్ కంపెనీ గురించి ఆరాతీశారు. విజ్డమ్ సంస్థ నిర్వాహకుడు అజయ్ కొల్లాతోపాటు సయ్యద్‌మహజార్, రోహిత్, బస్వరాజ్, గోపీనాథ్, రాజేశ్, శుభమ్‌కుమార్‌సింగ్, సామ్రాట్ పండుగుల, నిఖితజైన్, మాధురి వీపూరి, కార్తీక్, శమీకాంత్, రవికిరణ్, శ్రీకాంత్‌ను అరెస్టుచేశారు. బాధితులు నేరుగా సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చునని సీపీ సజ్జనార్ సూచించారు.

పోలీసులకు ప్రాసిక్యూషన్ అధికారాలు!

- ఫారెస్ట్ యాక్ట్ నిబంధనల సవరణకు ఏర్పాట్లు
- త్వరలో నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: అటవీనేరాలపై ఉక్కుపాదం మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరో కీలక నిర్ణయం తీసుకోనున్నది. అటవీశాఖ అధికారులతోపాటు పోలీస్ అధికారులకు కూడా అటవీనేరాలపై నిందితులను ప్రాసిక్యూట్ చేసే అధికారం ఇవ్వబోతున్నది. ఇందుకోసం అటవీచట్టంలోని నిబంధనలను సవరించనున్నది. నిబంధనల సవరణపై అటవీశాఖ అధికారులు ఒక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా స్మగ్లర్ల కోసం అడవులను జల్లెడపడుతున్నారు. అటవీనేరగాళ్లకు సహకరిస్తున్నారన్న ప్రా థమిక ఆధారాలుంటే అధికారులు, ఉద్యోగులపైనా చర్యలు తీసుకుంటుండటం సంచలనం సృష్టిస్తున్నది. ప్రస్తుతం 1962 తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్‌లో ఫారెస్ట్ అఫెన్సెస్ (కంపౌండింగ్ అండ్ ప్రాసిక్యూషన్) రూల్స్‌లో అటవీ నేరగాళ్లను అరెస్ట్‌చేసి, అక్రమసంపదను సీజ్‌చేసే అధికారం అటవీశాఖతోపాటు పోలీస్ అధికారులకు ఉంది. కానీ నేరస్థులను ప్రాసిక్యూట్‌చేసి, చార్జిషీటు దాఖలుచేసే అధికారం మాత్రం పోలీసులకు లేదు. అయితే.. పోలీసులకు ప్రాసిక్యూషన్ చేసే అధికారం కూడా ఇస్తే బాగుంటుందని డీజీపీ మహేందర్‌రెడ్డి ఇటీవల ఒక సమావేశంలో ప్రతిపాదించారని తెలిసింది. అటవీనేరాల అదుపునకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధ్యక్షతన జరిగిన పోలీసు, అటవీ, ఇతరశాఖల ఉన్నతాధికారుల సమావేశంలో ఈ మేరకు డీజీపీ ప్రతిపాదించారని సమాచారం. కోర్టులలో తమకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తోపాటు బలమైన వ్యవస్థ ఉన్నందున చార్జిషీటు దాఖలుచేసి, నేరస్థులకు శిక్షపడేవరకు చర్యలు తీసుకునే వీలుంటుందని పేర్కొన్నారని తెలిసింది. ఆయన అభిప్రాయాలతో అటవీశాఖ అధికారులు కూడా ఏకీభవించారని సమాచారం. పోలీసులు అప్పగించే అటవీ కేసుల పరిశోధన, చార్జిషీటు దాఖలు వంటి బాధ్యతలు అటవీశాఖ అధికారులు నిర్వహిస్తుండటంతో వారిపై భారం కూడా పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో పోలీసులకు కూడా ప్రాసిక్యూషన్ అధికారాలిస్తే నేరగాళ్లకు శిక్షలు పడే అవకాశం మరింత పెరుగుతుందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.



రెండో విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా ఉప్పరిగూడలో టీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందిన బూడిద రాంరెడ్డి విజయోత్సవ ర్యాలీ





ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామానుజవరంలో టీఆర్ఎస్ అభ్యర్థి శీలం కోటారెడ్డి విజయోత్సవం



రంగారెడ్డి జిల్లా మాడ్గులలో టీఆర్ఎస్ అభ్యర్థి జంగయ్యగౌడ్ విజయోత్సవ ర్యాలీ

మరింత పకడ్బందీగా మిడ్‌డే మీల్స్

■ **మధ్యాహ్న భోజనానికి 5.35% పెరిగిన ధరలు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సన్నబియ్యంతో విజయవంతంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు వంట ఖర్చులు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ప్రస్తుతం కొనసాగుతున్న వంట ఖర్చులపై 5.35 శాతం అదనంగా ధరలు పెరిగాయి. దేశవ్యాప్తంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో వంట ఖర్చులను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకొన్నది. ఇందుకోసం కేంద్రం ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తున్నది. ఇందులో 60 శాతం కేంద్రం భరిస్తుండగా.. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు జారీచేసింది. ఈ నిర్ణయం ప్రకారం 1 నుంచి 5 వరకు చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికి ప్రస్తుతం రూ.4.13 పైసలు చొప్పున వంట ఖర్చులు చెల్లిస్తుండగా.. పెరిగిన ధరల ప్రకారం రూ.4.35 చొప్పున ఖర్చులు భరించాల్సి వస్తున్నది. ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఒక్కంటికి ప్రస్తుతం రూ.6.18 చెల్లిస్తుండగా.. పెరిగిన ధరల ప్రకారం రూ.6.51 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మొత్తం 23,87,751 మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి పెరిగిన ధరలు ఏప్రిల్ 1, 2018 నుంచే అమలులోకి వచ్చినట్టు కేంద్రం ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

టీఆర్ఎస్ ధమాకా

మొదటిపేజీ తరువాయి...

మొత్తం 88.26 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గరిష్ఠంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 93.71 శాతం పోలింగ్ నమోదవగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 80.74 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. 10 జిల్లాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ జరుగడం విశేషం. రెండో విడుతలో మొత్తం 4,135 గ్రామాలకు ఎన్నికలు కావాల్సి ఉండగా, రిజర్వేషన్లు కలిసిరాకపోవడం, కోర్టు కేసుల నేపథ్యంలో ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 788 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో శుక్రవారం 3,342 గ్రామాల్లో పోలింగ్ నిర్వహించారు. వివిధ కారణాలతో రెండు సర్పంచ్ స్థానాలకు పోలింగ్ వాయిదా వేశారు. సర్పంచ్ స్థానాలకు 10,668 మంది అభ్యర్థులు, 26,191 వార్డులకు 63,480 మంది అభ్యర్థులు పోటీపడ్డారు.

మహిళల ఓటు చైతన్యం

శుక్రవారం ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 9 గంటల వరకు 30 శాతం, 11 గంటల వరకు 65.87 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసింది. మొత్తంగా 88.26 శాతం మంది ఓట్లేశారు. ఈ విడుతలో మొత్తం 42,79,277 మంది ఓటర్లుండగా 37,76,797 మంది ఓటేశారు. రెండో విడుతలో మహిళా ఓటు చైతన్యం స్పష్టంగా కనిపించింది. శుక్రవారం 19,08,889 మంది మహిళలు ఓటేయగా, పురుషులు 18,67,898 మంది మాత్రమే ఓటేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. వార్డు స్థానాలు, సర్పంచ్ ఓట్ల లెక్కింపు తర్వాత ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేశారు. పలు గ్రామాల్లో వార్డు సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నికను శనివారానికి వాయిదా వేశారు. కొన్నిచోట్ల కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులు ఓటమిని జీర్ణించుకోలేక రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా.. పోలీసులు చెదరగొట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచారు.

టీఆర్ఎస్ మద్దతుదారుల జోరు

మొదటి విడుత పంచాయతీ ఎన్నికల్లో 2,769 గ్రామాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించగా.. రెండో విడుతలోనూ గులాబీ పార్టీ హవా స్పష్టంగా కనిపించింది. పార్టీ గుర్తు లేకున్నా, గ్రామాల అభివృద్ధే ఎజెండాగా ప్రజలు టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల వెంటే నిలిచారు. రెండో విడుతలో స్వతంత్రులు సైతం మెజార్టీ స్థానాల్లో గెలిచారు. అయితే ఇందులో అధికశాతం మంది టీఆర్ఎస్ వర్గీయులే కావడం గమనార్హం. వీరంతా స్థానిక రాజకీయాల కారణంగా స్వతంత్రంగా బరిలోకి దిగారు.

యాదాద్రి టాప్

రెండో విడుత పోలింగ్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా టాప్‌లో నిలిచింది. జిల్లాలో 93.71 శాతం ఓట్లేశారు. ఎన్నికల సంఘం ప్రకారం జిల్లావారీగా ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 83.05, భద్రాద్రి కొత్తగూడెంలో 83.55, జగిత్యాలలో 80.23, జనగామలో 90.61, జయశంకర్ భూపాలపల్లిలో 87.21, జోగుళాంబ గద్వాలలో 89.16, కామారెడ్డిలో 90.04, కరీంనగర్‌లో 89.52, ఖమ్మంలో 91.91, కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 87.45, మహబూబాబాద్‌లో 91.05, మహబూబ్‌నగర్‌లో 89.05, మంచిర్యాలలో 86.50, మెదక్‌లో 92.52, మేడ్చల్ మల్కాజిగిరిలో 80.74, నాగర్‌కర్నూల్‌లో 90.17, నల్లగొండలో 92.01, నిర్మల్‌లో 85.37, నిజామాబాద్‌లో 81.91, పెద్దపల్లిలో 89.24, రాజన్న సిరిసిల్లలో 82.37, రంగారెడ్డిలో 88.72, సంగారెడ్డిలో 89.64, సిద్దిపేటలో 92.34, సూర్యాపేటలో 92.82, వికారాబాద్‌లో 83.20, వనపర్తిలో 86.29, వరంగల్ రూరల్‌లో 87.56, వరంగల్ అర్బన్‌లో 86.98, యాదాద్రి భువనగిరిలో 93.71 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులు 87.67 శాతం, మహిళలు 88.85 శాతం ఓటేశారు.

రెండు గ్రామాల్లో రీపోలింగ్

వివిధ కారణాలతో రెండు గ్రామాల్లోని రెండు సర్పంచ్ స్థానాలు, ఒక వార్డు స్థానానికి రీపోలింగ్ జరుపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలం నల్లావారిపల్లిలోని 8వ వార్డు బ్యాలెట్ పేపర్‌పై ముగ్గురు అభ్యర్థులకు బదులు ఇద్దరి అభ్యర్థుల గుర్తులు మాత్రమే ముద్రించారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం తుషారాం తండాలోని మూడో వార్డులో రాథోడ్ మౌనిక అనే మహిళ ఓటును గుర్తుతెలియని వ్యక్తి వేశారు. దీంతో నల్లవారిపల్లిలో వార్డుస్థానానికి, తుషారాం తండాలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ నెల 30న రీపోలింగ్ జరుపాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లపల్లిలో బ్యాలెట్‌లో సర్పంచ్ స్థానానికి ఒక గుర్తు బదులు మరో గుర్తు ముద్రించినట్టు ఎన్నికల అధికారులు గుర్తించి పోలింగ్‌ను వాయిదా వేశారు. రీపోలింగ్ తేదీని ప్రకటించలేదు.

మొత్తం ఓటర్లు	:	42,79,277
పురుషులు	:	21,30,715
స్త్రీలు	:	21,48,455
ఇతరులు	:	107
పోలైన ఓట్లు	:	37,76,797
పురుషులు	:	18,67,898
స్త్రీలు	:	19,08,889
ఇతరులు	:	10
పోలింగ్ శాతం	:	88.26
(కడపటి వార్తల ప్రకారం)		
పోలింగ్ జరిగిన గ్రామాలు	:	4,130
ఏకగ్రీవాలతో కలిపి ఫలితాలు వెల్లడైనవి	:	4,122
టీఆర్ఎస్	:	2,611
కాంగ్రెస్	:	837
బీజేపీ	:	37
టీడీపీ	:	39
సీపీఐ	:	13
సీపీఎం	:	24
ఇతరులు	:	561
మొదటి, రెండు విడుతల్లో కలిపి (కడపటి వార్తల ప్రకారం)		
టీఆర్ఎస్	:	5240
కాంగ్రెస్	:	1757
టీడీపీ	:	70
బీజేపీ	:	104
సీపీఐ	:	32
సీపీఎం	:	56
ఇతరులు	:	1319

అడవిదొంగల్లో వణుకు

మామూళ్లకు అలవాటుపడిన అధికారుల్లోనూ భయం ■ సమస్య మూలాలపై కేంద్రీకరించిన సీఎం కేసీఆర్

చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో నిర్లక్ష్యంపై ప్రత్యేక దృష్టి ■ అటవీ సంపద కాపాడేందుకు వరుస చర్యలు


సీఎం ఆదేశాలతో రంగంలోకి విజిలెన్స్ బృందాలు ■ తీగ లాగినకొద్దీ బయటపడుతున్న అక్రమాల డొంకలు

యాతాలం చిన్నారెడ్డి,
నిర్మల్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి

పూర్వ ఆదిలాబాద్ అడవితల్లి కన్నీరు తుడిచేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అడవికి రక్షకులుగా కాకుండా భక్షకులుగా మారుతున్న అధికారులపై కఠినచర్యలు తీసుకుంటున్నది. కలప అక్రమరవాణాదారుల వెన్నుల్లో వణుకుపుట్టిస్తున్నది. అటవీసంపదను స్మగ్లర్లు పెద్ద ఎత్తున కొల్లగొడుతున్నా.. రాజకీయ నాయకులు, అటవీ, పోలీసు అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతున్నదని గుర్తించిన ప్రభుత్వం.. సదరు అధికారులు, నాయకులపై చర్యలు తీసుకుంటూనే.. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ వ్యవస్థలను పటిష్ఠంచేస్తున్నది. గత కొంతకాలంగా అటవీ అక్రమాలపై దృష్టిసారించిన సీఎం కేసీఆర్.. సమస్య మూలాలపై కేంద్రీకరించారు.

అడవులు నరికేస్తున్న ముల్తానీలు, స్మగ్లర్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏడు లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో 2,01,500 హెక్టార్లలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఏరియా (కేటీఆర్) ఉన్నది. ఇందులో 89,200 హెక్టార్లలో కోర్, 1,12,300 హెక్టార్లలో బఫర్ ఏరియా ఉన్నాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో పూర్వ ఆదిలాబాద్.. నాలుగు జిల్లాలుగా ఏర్పడగా.. కవ్వాల్ అభయారణ్యం కూడా నాలుగు భాగాలైంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో ఉన్న కవ్వాల్ పులుల రక్షిత ప్రాంతం లక్ష్యంగా కలప అక్రమ రవాణాతోపాటు వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగుతున్నది. ఇచ్చోడ మండలంలోని ముల్తానీలు కలప రవాణాను ఉపాధిగా మార్చుకుని అడవులను నరికేస్తున్నారు. వీరికి స్మగ్లర్లు తోడవుతున్నారు. ముల్తానీలకు, స్థానిక గిరిజనులకు దినసరి కూలీ చెల్లిస్తూ చెట్లు నరికిస్తున్నారు. నిజామాబాద్‌కు చెందిన సా మిల్లుల యజమానులు, బడావ్యాపారులు ముల్తానీలు, స్మగ్లర్లతో కుమ్మక్కై ఇచ్చోడ కేంద్రంగా కలప దందా చేస్తున్నారు. ఒక లారీ లోడ్ తరలిస్తే అన్ని ఖర్చులు పోనూ రూ. లక్షకుపైగా మిగిలే అవకాశాలున్నాయని చెప్తున్నారు. కలప తరలింపునకు 44వ నంబరు జాతీయ రహదారిని అక్రమార్కులు రాజమార్గంగా వాడుకుంటున్నారు. గోదావరినది గుండా కూడా పెద్దపెద్ద దుంగలను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. కొన్ని చోట్ల ఎడ్లబండ్లు, మరికొన్ని చోట్ల ఏకంగా రైళ్లలోనూ కలపను రవాణా చేస్తున్నారు. మామడ మండలం తాంద్ర, సోన్ చెక్‌పోస్టుల్లో లారీలు దాటించే బాధ్యతను అధికారులు తీసుకుంటున్నారని తనిఖీల్లో వెల్లడైంది. కొందరు లారీలకు ముందు కార్లలో వెళ్లి చెక్‌పోస్టు దాటించేందుకు లారీకి రూ.40వేలు తీసుకుంటున్నారని సమాచారం. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు తనిఖీలకు వస్తున్న విషయాన్ని కొందరు కిందిస్థాయి సిబ్బంది.. స్మగ్లర్లకు ముందే లీక్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.



స్వయంగా రంగంలోకి దిగిన సీఎం కేసీఆర్

ఒకవైపు వనాలను పెంచేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుంటే.. ఉన్న అడవులను స్మగ్లర్లు నరికివేస్తుండటంపై సీఎం కేసీఆర్ సీరియస్‌గా ఉన్నారు. ఇప్పటికే కలప స్మగ్లర్లపై పీడీ పీపీ, పీడీ యాక్టులు నమోదు చేయిస్తున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో పోలీసు, అటవీశాఖ సమావేశాలు నిర్వహించి నిఘా పెంచాలని ఆదేశించారు. అడవుల్లో పు లుల సంరక్షణకు ప్రత్యేక సాయుధదళం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే స్మగ్లర్లు, అవినీతి అధికారు లపై చర్యలు తీసుకుంటున్నారు.

వరుసదాడుల్లో పట్టుబడుతున్న కలప

ఇటీవల ఇచ్చోడ మండలం కేశవపట్నంలో ఇటీవల గుం డాల, కేశవపట్నం, బాబ్జీపేట్‌కు చెందిన కలప స్మగ్లర్లు కలిసి ఓ రైతుకు చెందిన పత్తి చేల్లో రూ.5లక్షల విలువైన 51 కలప దుంగలను అక్రమంగా నిల్వ ఉంచి.. నిజామాబాద్‌కు రవాణా చేసేందుకు సిద్ధపడగా అధికారులు పట్టుకున్నారు. గుండాలకు చెందిన స్మగ్లర్లపై వలపన్నిన అటవీ శాఖ అధికారులు.. రూ.3.50 లక్షల విలువైన 30 కలప దుంగలను పట్టుకున్నారు. ఆదిలాబాద్ లోని సీసీఐ ఆవరణలో అక్రమంగా నిల్వ చేసిన రూ.50 లక్షల విలువైన కలపను జూన్ 24న పోలీసు, ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా నిర్మల్ వద్ద రూ.16.52 లక్షల విలువైన కలపను ఎస్పీ శశిధర్‌రాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ క్రమంలో అధికారులు భౌతికదాడులకు కూడా గురవుతున్నారు. ఇటీవల పెంబిలో ఇద్దరు అధికారులపై స్మగ్లర్లు దాడి చేయడంతో వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టారు.

అధికారులపై పెద్ద ఎత్తున చర్యలు

నిర్మల్‌లో పెద్ద ఎత్తున పట్టుబడిన అక్రమ కలపరవాణాలో స్మగ్లర్లతో చేతులు కలిపిన అధికారులను అరెస్టుచేసి.. ప్రజా ఆస్తుల విధ్వంస నివారణ చట్టం (పీడీపీపీ) ప్రయోగించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఏఆర్ ఎస్సై షకీల్ పాషా, ఉట్నూర్ ఎఫ్ఎస్ఓ రాజేందర్, సోన్ చెక్‌పోస్టు సిబ్బంది(వాచర్)సద్దాంలను అరెస్ట్‌చేయడంతోపాటు విధుల నుంచి సస్పెండ్‌చేశారు. 18మందిపై పీడీపీపీ యాక్టు ప్రయోగించారు. ఇదేకేసులో నిజామాబాద్ జిల్లా నార్త్ డీఎఫ్‌వో వేణుబాబు, ఎఫ్ఆర్వో రాంమోహన్, డీఆర్‌వో శ్రీనివాస్‌ను సస్పెండ్‌చేశారు. ఇదే వ్యవహారంలో ఇచ్చోడ సీఐ సతీశ్‌కుమార్‌ను డీఐజీకి.. నేరడిగొండ ఎస్సై హరిశేఖర్‌ను ఆదిలాబాద్ ఎస్పీకి అటాచ్‌చేశారు. ఆదిలాబాద్ సీసీఐలో అక్రమంగా నిల్వ చేసిన రూ.50లక్షల విలువైన కలప కేసులో.. స్మగ్లర్లతో చేతులు కలిపారని డీఎఫ్ఆర్‌వో ప్రవీణ్ మహాజన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడంతోపాటు విధులనుంచి సస్పెండ్ చేశారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ డివిజన్‌లోని సత్తెనపల్లి సెక్షన్‌లో కలపను వాహనంలో తరలించిన కేసులో బీట్ ఆఫీసర్, ఎఫ్ఎస్‌వోలను సస్పెండ్ చేశారు.

వన్యప్రాణులనూ చంపేస్తున్నారు

కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణుల వధ కూడా యథేచ్ఛగా సాగుతున్నది. జిల్లాలో ఇప్పటికే మూడు పెద్దపులులు, రెండు చిరుతలను వేటగాళ్లు చంపేశారు. నీల్గాయి, ఇతర జంతువులు పెద్ద ఎత్తున బలువుతున్నాయి. ఇటీవల పెంబి మండలంలోని పుల్గంఫాండ్రిలో పెద్దపులిని హతమార్చగా.. తాజాగా మందమర్రిలో పులిచర్మం పట్టుబడటం కలకలం రేపింది. మంచిర్యాల జిల్లా రంగంపేట శివారులో ఇటీవల చిరుతపులి వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని మృతి చెందింది. పుల్గంఫాండ్రి వద్ద పెద్దపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నించినవారిని ఇచ్చోడ వద్ద ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. పుల్గంఫాండ్రి వద్ద పులిని హతమార్చిన ఘటనలో నిందితులుగా ఉన్న గుగ్లావత్ ప్రకాశ్ (ఏ1) ఇంట్లో డిసెంబర్ 31న నీల్గాయి మాంసం పదికిలోలు దొరికినా కేసు నమోదుచేయలేదు. ఉన్నతాధికారులకు సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ కేసులో పెంబి ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్, సెక్షన్ ఆఫీసర్ ఎంఏ రషీద్, బీట్ ఆఫీసర్ వసంత్‌పై సస్పెన్షన్ వేటు వేయగా.. క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఫారం -7

తెలంగాణ ప్రభుత్వం

రెవెన్యూ (భూసేకరణ) శాఖ

[illegible]

DIPR RO No:868/LA/PP-Agency/2018-19


క్విటోవా



ఒసాకా

తొలి టైటిల్ ఎవరిదో!

ఫైనల్లో క్విటోవా, ఒసాకా ఢీ.. ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: మహిళల సింగిల్స్‌లో ఉత్కంఠ పోరుకు జపాన్ స్టార్ నవోమి ఒసాకా, చెక్ రిపబ్లిక్ భామ పెట్రో క్విటో వా సిద్ధమయ్యారు. శని వారం ఉదయం ప్రారం భం కానున్న ఆస్ట్రేలియ న్ ఓపెన్ ఫైనల్లో ఎవరు గెలిచినా ప్రపంచ నంబర్‌వన్‌గా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. ఈ టోర్నీలో క్విటోవా ఒక్కసెట్ చేజారకుండా ఫైనల్ చేరగా..మరోవైపు ఒసాకా హోరాహోరీ పోరాటాలతో ఫైనల్ చేరింది. క్విటోవా బల మంతా ఆమె సర్వీస్, గ్రౌండ్ స్ట్రోకులే. కాగా, దూకుడుగా ఆడడంలో ఒసాకా నేర్పరి. దీంతో వీరిద్దరి మధ్య జరిగే మ్యాచ్ టెన్నిస్ అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నది. 2012లో ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరిన అనంతరం మళ్లీ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరేందుకు క్విటోవాకు ఆరేండ్లు పట్టింది. గతేడాది యూఎస్ ఓపెన్ విజేతగా నిలిచిన నవోమి ఒసాకా ఒక్కసారిగా స్టార్ హోదా సంపాదించుకుంది. అంతేకాదు నిల కడగా ఆడుతూ వరుస విజయాలతో ప్రపంచ నంబర్4 ర్యాంక్‌లో నిలిచింది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ అదే ధాటితో సత్తా చాటిన ఒసాకా..తొలిసారిగా ఫైనల్ చేరింది.


ద్రోణవల్లి హారిక


సునీల్ ఛెత్రీ


గౌతం గంభీర్

క్రీడా పద్మాలు..

బచేంద్రిపాల్‌కు పద్మభూషణ్
సునీల్ ఛెత్రీ, హారిక, గంభీర్, బజరంగ్‌కు పద్మశ్రీ అవార్డులు

న్యూఢిల్లీ: క్రీడా పద్మాలు వెల్లివిరిసాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో పాటు పద్మ అవార్డులను ప్రకటించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 112 అవార్డులను ప్రకటించిన ప్రభుత్వం క్రీడల్లో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన వారికి అవార్డులతో పట్టం కట్టింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారత మహిళగా పేరుగాంచిన బచేంద్రిపాల్‌ను మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ అవార్డుకు ఎంపిక చేసింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రం నుంచి భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రీ..పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యాడు. 1984, ఆగస్టు 3న సికింద్రాబాద్‌లో జన్మించిన 34 ఏండ్ల సునీల్..అంచలంచెలుగా అంతర్జాతీయ స్థాయి ఫుట్‌బాలర్‌గా ఎదిగాడు. మోహన్‌బగాన్ జట్టుతో 2002లో ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా కెరీర్ ప్రారంభించిన సునీల్..జేసీటీ, కన్సాస్ సిటీ క్లబ్‌లతో పాటు ఇండియన్ సూపర్ లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ, ముంబై సిటీ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. క్రిస్టియానో రొనాల్డో(85) తర్వాత అత్యధిక అంతర్జాతీయ గోల్స్(67) చేసిన ఫుట్‌బాలర్‌గా ఛెత్రీ కొనసాగుతున్నాడు. మరోవైపు ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్(2015)లో కాంస్య పతకంతో పాటు గ్వాంగ్జు(2010) ఆసియాగేమ్స్‌లో కాంస్యం సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ద్రోణవల్లి హారికకు పద్మశ్రీ అవార్డు దక్కింది. మిగతా వారి విషయానికొస్తే.. స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా, మాజీ క్రికెటర్ గౌతం గంభీర్, శరత్ కమల్(టేబుల్ టెన్నిస్), లైశ్‌రామ్ బొంబాల్యదేవి(ఆర్చరీ), అజయ్ ఠాకూర్(కబడ్డీ), ప్రశాంతి సింగ్(బాస్కెట్‌బాల్)కు పద్మశ్రీ అవార్డులు వరించాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

ఫైనల్లో జొకోవిచ్



నాదల్‌తో అమీతుమీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ నొవాక్ జొకోవిచ్ ఏడో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. శుక్రవారం ఫ్రాన్స్ యువ ఆటగాడు పౌయ్లేతో జరిగిన సెమీస్ పోరులో 6-0,6-2,6-2స్కోరుతో వరుస సెట్లలో విజయంతో ఫైనల్ చేరుకున్నాడు. ఇప్పటికే ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు సాధించిన జొకోవిచ్ ముందు అరుదైన రికార్డు ఎదురుచూస్తున్నది. ఆరు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు సాధించిన ఫెదరర్, రాయ్ ఎమర్సన్ సరసన చోటు సంపాదించిన జొకో..ఆదివారం జరిగే ఫైనల్లో విజయం సాధిస్తే ఓపెన్ ఎరాలో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్న తొలి ఆటగాడిగా రికార్డు సాధిస్తాడు. ఒకవేళ నాదల్ ట్రోఫీ సాధించినా ఓపెన్ ఎరాలో నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌ను రెండుసార్లు సాధించిన తొలి ఆటగాడిగా రికార్డులకెక్కనున్నాడు. ఇటు మహిళల ఫైనల్లోనూ..అటు పురుషుల సింగిల్స్ ఫైనల్లోనూ ఎవరు గెలిచినా కొత్త చరిత్ర నమోదవడం ఖాయమే.

టీమ్ ఇండియాకు స్థానికుల సంప్రదాయ స్వాగతం

ఉదయం: 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1, 3లో ప్రత్యక్ష ప్రసారం



ఆధిక్యంపై గురి

- జోరు కొనసాగించేందుకు భారత్ తహతహ
- పుంజుకునేందుకు కివీస్ ప్రయత్నం
- నేడు ఇరు జట్ల మధ్య రెండో వన్డే

ఫార్మాట్, ప్రత్యర్థి మారుతున్నా..భారత్‌కు పోటీ అన్నది లేకుండా పోతున్నది. కంగారూలను వారి సొంతగడ్డపై మట్టికరిపించి కొత్త చరిత్ర సృష్టించిన కోహ్లీసేన కివీస్ పనిపట్టేందుకు సిద్ధమైంది. నేపియర్‌లో సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటిన టీమ్‌ఇండియా అదిరిపోయే బోణీ కొట్టింది. కివీస్‌ను కుప్పకూలుస్తూ స్వల్ప స్కోరుకే కట్టడిచేసిన మనోళ్లు బ్యాటింగ్‌లో ఇరుగదీశారు. ఇదే జోరునుకొనసాగించాలన్న పట్టుదలతో ఉన్న భారత్ సిరీస్‌లో ఆధిక్యంపై గురిపెట్టింది. సొంత ఇలాఖాలో పరువు నిలుపుకోవాలనుకుంటున్న న్యూజిలాండ్ పుంజుకోవాలన్న ప్రయత్నంలో ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే ఇరు జట్ల పోరు అభిమానులకు పసందైన విందు అందనుంది.

మౌంట్ మౌంగనూయి: భారత్, న్యూజిలాండ్ బలబలాల పరంగా సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. సొంతగడ్డపై కొట్టిన పిండిల్లాంటి పరిస్థితులు కివీస్‌కు అలవాటైతే..ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలుస్తూ గెలుపు లక్ష్యంగా భారత్ దూసుకెళుతున్నది. ఆస్ట్రేలియాపై టెస్ట్, వన్డే సిరీస్ విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమ్‌ఇండియా న్యూజిలాండ్‌లోనూ చరిత్ర తిరుగరాయాలన్న పట్టుదలతో కనిపిస్తున్నది. ఇందులో భాగంగా నేపియర్‌లో తొలి అడుగు ఘనంగా వేసిన కోహ్లీసేన మలి వన్డేకు వేదికైన మౌంట్ మౌంగనూయిలో అదే జోరును కొనసాగించేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధమైంది. మరోవైపు ఇలాఖాలో తమకు తిరుగులేదనుకున్న కివీస్‌కు మొదటి వన్డేలోనే సినిమా కనిపించింది. భారత్‌కు ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయిన న్యూజిలాండ్ రెండో వన్డేలోనైనా గెలిచి సిరీస్‌లో నిలువాలన్న పట్టుదలతో కనిపిస్తున్నారు. ఇదిలా ఉంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 నుంచి నేటి వరకు జనవరి 26 గణతంత్ర దినోత్సవ రోజున జరిగిన వన్డేల్లో భారత్ ఇప్పటి వరకు గెలిచిన దాఖలాలు లేకపోవడం విశేషం. దీన్ని తిరుగరాసేందుకు కోహ్లీసేన ప్రయత్నం చేసే అవకాశముంది. శనివారం బే ఓవల్‌లో ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరుగుతుంది.

మార్పుల్లేకుండానే!: కివీస్‌తో రెండో వన్డేలో భారత్ మార్పుల్లేకుండానే బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్న ప్రధాన సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే విరాట్ కోహ్లీకి ఆఖరి రెండు వన్డేలతో సహా టీ20 సిరీస్‌కు టీమ్ మేనేజ్‌మెంట్ విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. మహిళలపై అనుచిత వ్యాఖ్యల విషయంలో ఊరట పొందిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇంకా కివీస్‌కు చేరుకోలేదు. మూడో వన్డేకు పాండ్యా జట్టుతో కలిసే చాన్స్ ఉంది. అయితే వచ్చే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకున్న మేనేజ్‌మెంట్ మిగిలిన వన్డేల ద్వారా జట్టు కూర్పుపై ఓ అంచనాకు రావాలన్న ఆలోచనతో ఉంది. కివీస్‌తో నేపియర్ వన్డేలో అంతగా ఆకట్టుకోలేకపోయిన అంబటి రాయుడుకు మరో చాన్స్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తున్నది. ఇదే జరిగితే దినేశ్ కార్తీక్ తిరిగి బెంచ్‌కే పరిమితం కావచ్చు. ఆల్‌రౌండర్ కోటాలో విజయ్ శంకర్ అంచనాలు అందుకోలేకపోతున్నా..ఇప్పుడున్న పరిస్థితుల్లో జట్టు సమతూకం కోసం ఈ తమిళనాడు క్రికెటర్‌ను కొనసాగించే అవకాశముంది. దేశవాళీ టోర్నీల్లో దుమ్మురేపి జాతీయ జట్టుకు ఎంపికైన పంజాబ్ పుత్తర్ శుభ్‌మన్ గిల్‌కు అరంగేట్రం చేసే అవకాశం లభించవచ్చు. మొదటి వన్డేలో మహ్మద్ షమీ అదుర్స్ అనిపించాడు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాట్స్‌మెన్ నడ్డివిరిచాడు. స్పిన్ ట్విన్స్‌గా వెలుగొందుతున్న కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ సత్తాచాటుతున్నారు. వికెట్లు తీయడంలో ఒకరికొకరు పోటీపడుతున్నారు. ఇదిలా ఉంటే ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో రాణించలేకపోయిన ధవన్..కివీస్‌తో మ్యాచ్‌లో ఫామ్ అందిపుచ్చుకున్నాడు.

పుంజుకునేనా: మొదటి వన్డేలో సమిష్టి వైఫల్యంతో భారీ ఓటమి చవిచూసిన కివీస్ సిరీస్‌లో ఎలాగైనా పుంజుకోవాలన్న తలంపుతో ఉన్నది. జట్టు ఆల్‌రౌండర్లతో కళకళలాడుతున్నా...ఒక్కరంటే ఒక్కరు నిలదొక్కుకోలేకపోవడం ఆందోళన కల్గిస్తున్నది. ఫామ్ పరంగా కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్ మెరుగ్గా ఉన్నప్పటికీ సహచరుల సహకారలేమితో జట్టు గెలుపులో పాలుపంచుకోలేకపోతున్నారు. బౌలింగ్ విషయానికొస్తే..పేసర్లు సౌథీ, బౌల్ట్, ఫెర్గుసన్, బ్రేస్‌వెల్‌తో స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ తోడైతే..టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బందులకు గురిచేయచ్చు. అయితే రెండో వన్డేకు వేదికైన మౌంట్ మౌంగనుయి స్పిన్‌కు అనుకూలిస్తే సౌథీని తప్పించి లెగ్ స్పిన్నర్ ఇష్ సోధీని తుది జట్టుకు ఎంపిక చేయచ్చు. అంతకు మించి మార్పులేమి ఉండకపోవచ్చు.

జట్ల అంచనా

భారత్: కోహ్లీ(కెప్టెన్), రోహిత్‌శర్మ, ధవన్, రాయుడు, జాదవ్, ధోనీ, విజయ్ శంకర్, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్, షమీ, చాహల్.

న్యూజిలాండ్: విలియమ్సన్(కెప్టెన్), గప్టిల్, కొలిన్ మన్రో, రాస్ టేలర్, టామ్ లాథమ్, హెన్రీ నికోలస్, సాంట్నర్, సౌథీ/సోధీ, ఫెర్గుసన్, బ్రేస్‌వెల్, బౌల్ట్.

పిచ్, వాతావరణం

రెండో వన్డేకు వేదికైన బే ఓవల్ పిచ్ స్పిన్ కంటే పేస్‌కు ఎక్కువగా అనుకూలించే అవకాశముంది. శ్రీలంకతో ఇటీవల జరిగిన మ్యాచ్‌లో మూడు వందలకు పైగా స్కోర్లు నమోదయ్యాయి.




జమీల్ ఖాన్‌కు రెండు పతకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: ప్రపంచకప్ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఆటగాడు పఠాన్ జమీల్‌ఖాన్ స్వర్ణ , కాంస్య పతకాలను గెలుచుకున్నాడు. వాషింగ్టన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి జరుగుతున్న చాంపియన్‌షిప్ 49 ఏండ్ల విభాగంలో పతకాలు సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా జమీల్ మాట్లాడుతూ..అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో పాల్గొనేందుకు స్నేహితుల వద్ద అప్పు చేసి వెళ్లానని, ప్రభుత్వ సహకారం కోసం ఎదురుచూస్తున్నట్లు ఆవేదనగా తెలిపాడు. దేశానికి ఎన్నో పతకాలు తీసుకువచ్చినా పేదరికంలోనే కొనసాగుతున్నానని..కరాటే క్రీడపై ఆసక్తితో ఇప్పటికీ పోటీల్లో పాల్గొంటున్నానని చెప్పాడు. హైదరాబాద్, మెహిదీపట్నంలోని ప్రైవేట్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జమీల్ .. ప్రోత్సాహం అందిస్తే దేశానికి పతకాలు అందించే మెరికలను తయారు చేస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు.

సెమీస్‌లో సైనా

క్వార్టర్స్‌లో వెనుదిరిగిన సింధు, శ్రీకాంత్



జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో హైదరాబాద్ స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. పూర్తిస్థాయి ఫామ్‌తో విజృంభించిన సైనా..శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సైనా 21-7,21-18 స్కోరుతో థాయిలాండ్ అమ్మాయి పోర్న్‌పావీ చోచువాంగ్‌పై వరుసగేముల్లో నెగ్గింది. తద్వారా ఈ ఏడాది వరుసగా రెండో మాస్టర్స్ టోర్నీలో సెమీస్ చేరుకుంది. గతవారం ముగిసిన మలేషియా మాస్టర్స్ టోర్నీలోనూ సైనా సెమీస్ చేరిన విషయం తెలిసిందే. చైనా షట్లర్లు చెన్ గ్జియావోగ్జిన్, బింగ్జియావో మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ విజేతతో సెమీస్‌లో సైనా తలపడనుంది. కాగా, మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 11-21,12-21 స్కోరుతో వరుసగేముల్లో స్పెయిన్ షట్లర్ కరోలినా మారిన్ చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 18-21,19-21 స్కోరుతో స్థానిక ఆటగాడు జొనాథన్ క్రిస్టీ చేతిలో పరాజయం పాలయ్యాడు.

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
36,025	10,780
↘169	↘69

ముడి చమురు (బ్రెంట్) ↗ 61.52 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	33,300
22 క్యారెట్లు	33,150
వెండి (కిలో)	40,050

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.20	74.70
యూరో	77.10	85.10
బహ్రెయిన్ దినార్	181.40	193.40
కువైట్ దినార్	224.90	237.90
సౌదీ రియాల్	17.90	19.70
యూఏఈ దిర్హామ్	18.40	20.00

చికెన్ ధరలు

(రూ.లలో)	
ఫారం ధర	79.00
రిటైల్ లైవ్	101.00
డ్రెస్డ్	146.00
స్కిన్‌లెస్	167.00


నెక్ (వంద గుడ్లకు)

(రూ.లలో)	
హైదరాబాద్	402-00
రంగారెడ్డి	402-00
మెదక్	402-00
కరీంనగర్	404-00
వరంగల్	404-00
రిటైల్ ప్రైస్	4-60

బ్రేకవుట్ అందని ద్రాక్ష

- పతనాన్ని శాసించిన మారుతీ, జీ-ఎంటర్‌టైన్‌మెంట్
- 10,800 పాయింట్ల దిగువన నిఫ్టీ

భారీ లాభాలతో ప్రారంభమైన దలాల్ స్ట్రీట్ చివరకు అర శాతం నష్టాలతో ముగిసింది. రెండునెలలుగా గట్టి నిరోధక స్థాయి నుంచి బ్రేకవుట్ అవుతుందన్న ఆశలు ఆడియాశలు అయ్యాయి. మరోసారి కీలక మద్దతు స్థాయి 10,800 దిగువన నిఫ్టీ ముగిసింది. శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 450 పాయింట్లు నష్టపోయింది. మారుతీ, జీ ఎంటర్‌టెయిన్‌మెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, హీరోమోటోకార్ప్ షేర్ల భారీ నష్టాలు మార్కెట్‌ను కుంగదీశాయి. ఐటీ షేర్ల లాభాలు మార్కెట్ పతనాన్ని నిలువరించలేకపోయాయి. సెన్సెక్స్ చివరికి 169.56 పాయింట్ల నష్టంతో 36,025.64వద్ద ముగిస్తే, నిఫ్టీ 69.25 పాయింట్ల నష్టంతో 10,780.55 వద్ద ముగిసింది. ఈ వారం రోజుల్లో సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్ల మేర నష్టపోయింది. దేశంలో అతిపెద్ద ఆటో కంపెనీ మారుతి ఐదేండ్ల తర్వాత లాభాల్లో భారీ క్షీణతను ప్రకటించడంతో ఏకంగా 8 శాతం పైగా నష్టపోవడంతో పాటు జీ ఎంటర్‌టెయిన్ మెంట్ 31 శాతం నష్టంతో ప్రధాన సూచీలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. అనేక రంగాల షేర్లలో నెగటివ్ సెంటిమెంట్ కనిపించింది. వారాంతం కూడా కావడంతో మధ్యాహ్నం తర్వాత ట్రేడర్లు తమ పొజీషన్లను స్క్వేరాఫ్ చేయడానికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా అమ్మకాల వత్తిడితో మార్కెట్ ఉక్కిరిబిక్కిరి అయింది.



రిటైల్ అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న సెలెక్ట్ ఈడీ మురళి

'సెలెక్ట్'లో గణతంత్ర దినోత్సవ ఆఫర్లు

- అత్తాపూర్‌లో అతిపెద్ద రిటైల్ అవుట్‌లెట్

హైదరాబాద్, జనవరి 25: ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ సెలెక్ట్..హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో అతిపెద్ద రిటైల్ అవుట్‌లెట్‌ను శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని మాట్లాడుతూ..మూడు అంతస్తుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ రాష్ట్రంలో అతి పెద్దదని వ్యాఖ్యానించారు. అలాగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొనుగోలుదారులకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్బన్, సెల్‌కాన్ మొబైళ్లపై 26 శాతం క్యాష్ బ్యాక్ అందిస్తున్న సంస్థ..మోటరోలా, హానర్, మరిన్ని ఇతర బ్రాండ్ మొబైళ్లను కొనుగోలు చేసిన వారికి రూ.2,019 రాయితీ, రూ.1,950కే మూడు ఫోన్లు, వీటితోపాటు ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతిని కూడా అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

నవీన భారత్‌ను నిర్మిస్తాం

ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా దేశం.. ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 25: ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించనున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అభిలాషించారు. సంస్కరణలకు పెద్దపీట వేయడంతో పెట్టుబడులపై సానుకూల వాతావరణ పరిస్థితులు నెలకొనడం ఇందుకు దోహదం చేస్తున్నాయని భారత్-దక్షిణాఫ్రికా బిజినెస్ సమ్మిట్‌లో ఆయన వెల్లడించారు. ప్రపంచ దేశాల్లో వేగవంతమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశాన్ని నవీన భారత్‌గా తీర్చిదిద్దడానికి కేంద్రం కృత నిశ్చయంతో ఉందన్న ఆయన..ఇందుకోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. 2.6 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత్ ప్రస్తుతం ఆరో స్థానంలో కొనసాగుతున్నది. అగ్రస్థానంలో అమెరికా ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో చైనా, జపాన్, జర్మనీ, బ్రిటన్‌లు కొనసాగుతున్నాయి. దేశీయ తయారీ రంగాన్ని మరింత బూస్ట్‌నివ్వడానికి మేక్ ఇన్ ఇండియా, డిజిటలైజేషన్‌కు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మా ముందున్న లక్ష్యం..విదేశీ పెట్టుబడులు ఆకట్టుకుంటున్న దేశాల్లో తొలిస్థానంలో భారత్ ఉన్నప్పటికీ సంతృప్తిగా లేము..దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకల ఉన్న రంగాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను సులభతర వాణిజ్య విధానంలో భారత్‌కు ప్రపంచ బ్యాంక్ 77వ స్థానం కల్పించింది. గడిచిన నాలుగేండ్లలోనే 65 స్థానాలు మెరుగుపడిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. నవీన భారత్ నిర్మాణ క్రమంలో భాగంగా మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం, వేగవంతం, పరిధిని మరింత విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఇరు దేశాల్లో బోలేడన్ని అవకాశాలు..
భారత్-దక్షిణాఫ్రికా దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలపై ఆయన మాట్లాడుతూ..గడిచిన కొన్ని సంవత్సరాలుగా తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనైప్పటికీ 2017-18లో 10 బిలియన్ డాలర్లు దాటిందన్నారు. ఇరు దేశాల్లో బోలేడన్ని అవకాశాలున్నాయని, ముఖ్యంగా స్నేహపూర్వక వాతావరణంతో పెట్టుబడిదారులు కూడా ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో 10 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడితోపాటు 20 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. భారత్‌లో ఆహార, ఆగ్రో ప్రాసెసింగ్, గనులు, రక్షణ, బీమా, మౌలిక సదుపాయాల రంగంలో ఉన్న అవకాశాలను దక్షిణాఫ్రికా పెట్టుబడిదారులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే స్టార్టప్, హెల్త్‌కేర్, ఫార్మా, బయోటెక్, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలకు చెందిన వాటితో కలిసి పనిచేయాలని దేశీయ సంస్థలకు ప్రధాని కోరారు. మరోవైపు జెమ్స్ అండ్ జ్యువెల్లరీ రంగాల్లో ఇరు దేశాలు భారీగా ఒప్పందాలు కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న వీసా పరిమితులను మరింత సరళతరం చేయాలని సూచించిన ప్రధాని..తద్వారా ముఖ్యంగా వ్యాపారవేత్తలు, టూరిస్తులు నేరుగా సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దక్షిణాఫ్రికా ప్రెసిడెంట్ సైరిల్ రామాఫోస మాట్లాడుతూ..వ్యవసాయం, ఐసీటీ, ఏరోస్పేస్, ఇంధన రంగాల్లో ఇరు దేశాలు సహాయ సహకారాలు పెంచుకోవడానికి వీలున్నది. భారత్‌కు చెందిన టాటా, సిప్లా, మహీంద్రాలలు కలుపుకొని 150 కంపెనీలు దక్షిణాఫ్రికాలో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయని చెప్పారు.



శుక్రవారం ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీతో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామాఫోసా, సీఐఐ ప్రెసిడెంట్ రాకేశ్ భారతీ మిట్టల్

ద్రవ్యలోటుపై ఆర్థిక సలహామండలి హెచ్చరిక

న్యూఢిల్లీ: ప్రభుత్వం ద్రవ్య స్థిరకరణ లక్ష్యాల నుంచి దారితప్పుతున్నందంటూ ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి హెచ్చరించింది. మరో వారం రోజుల్లో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అ పరిణామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అయితే సామాజిక రంగంలో నిరంతర ప్రభుత్వ జోక్యం అవసరమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రకటనను విడుదల చేసింది. వచ్చే వారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రభుత్వం రైతులకు, పేదలకు, మధ్యతరగతి వర్గాలకు స్పెషల్ ప్యాకేజీలను ప్రకటించవచ్చునన్న అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. రైతుల ఆదాయాలు పెంచేందుకు తమ ప్రభుత్వం త్వరలో ప్యాకేజిని ప్రకటించబోతున్నదంటూ వ్యవసాయ శాఖ సహాయమంత్రి పురుషోత్తం రుప్పాల గురువారం నాడు ప్రకటించారు. ఎంఎస్ఎంఈలకు, వ్యవసాయ రంగాలక ప్యాకేజీలను ప్రకటించడం వల్ల ద్రవ్య లోటు పెరిగిపోతుందని మూడీస్, బ్యాంక్ ఆఫ్ ఆమెరికాలు ఇప్పటికే హెచ్చరించాయి.

నాగార్జునసాగర్‌కు సముద్ర విమానం

- 235 రూట్లలో ఉడాన్ విమానాలు
- 18 రూట్లలో సీప్లేన్స్

న్యూఢిల్లీ, జనవరి 25: నాగార్జునసాగర్‌కు త్వరలో విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. అయితే అవి నీటిలో ల్యాండ్ అయ్యే సముద్రపు విమానాలు (సీప్లేన్స్). మొత్తం 18 రూట్లలో సీప్లేన్స్, 235 రూట్లలో ఉడాన్ కింద ప్రభుత్వ అవార్డు చేసింది. 16 అన్‌సర్వ్‌డ్ ఎయిర్‌పోర్టులు, ఆరు వాటర్ ఏరోడ్రోమ్స్ ఉన్నాయి. విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు ఈ మేరకు శుక్రవారం వివరాలను వెల్లడించారు. నాగార్జునసాగర్‌తో పాటు గౌహతి రివర్ ఫ్రంట్, అస్సాంలోని ఉమ్రాంగ్సో రిజర్వాయర్, గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, శత్రుంజయ్ డ్యామ్, శబర్మతి రివర్ ఫ్రంట్‌లలో వాటర్ ఎయిరోడ్రమ్‌ల ద్వారా ఉడాన్ విమాన సేవలు అందించనున్నారు. సీప్లేన్‌ల ద్వారా మొత్తం లక్ష సీట్లు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఉడాన్ స్కీమ్ కింద ఏటా 69.30 లక్షల సీట్లు అందుబాటులోకి వస్తాయని సురేశ్ ప్రభు వివరించారు. ఉడాన్ కింద గౌహతి నుంచి ఢాకా, బ్యాంకాక్ స్పైస్‌జెట్ అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించనుంది. ఉడాన్ మూడో రౌండ్‌లో రాష్ట్రానికిచెందిన టర్బో మేఘాతో పాటు 11 మంది ఆపరేటర్లకు రూట్లను కేటాయించారు. స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్‌ఇండియా అనుబంధ కంపెనీ ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ కూడా ఉన్నాయి. 11 మంది ఆపరేటర్ల నుంచి వచ్చిన 73 ప్రతిపాదనలను విమానయాన శాఖ ఆమోదించింది. మొత్తం 89 ఎయిర్‌పోర్టులు ఉడాన్-3 కింద కనెక్టివిటీని పొందనున్నాయి.



ఒకరంటారు స్త్రీ దేవత అని. మరొకరంటారు స్త్రీ లేనిది లోకం లేదని. కానీ మనలో ఎంతమంది వీటిని పాటిస్తున్నారు? అవే ఈసడింపులు. అవే అవమానాలు. అంతరిక్షానికి వెళ్లి పరిశోధనలు చేస్తున్నారు కానీ.. సొంత గ్రహంపై గ్రహణం పట్టినవాళ్ల లా బతుకీడుస్తున్నారు! ఈ పరిస్థితికి చరమగీతం పాడాలని.. స్త్రీ అన్నింటా సమానంగా ఉండాలంటున్నారు. తమ ఉనికి కోసం దేశంలో సమానత్వం కోసం ధిక్కార స్వరం వినిపించిన వారికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో ప్రత్యేక కథనం!

స్వేచ్ఛా మారథాన్!

నిజంగా సమానత్వం ఎక్కడైనా కనిపిస్తుందా? సర్పంచ్‌గా మహిళలు పోటీ చేస్తారు. కానీ నడిపించేది అంతా పురుషులే. మరి స్త్రీకి స్వతంత్రంగా ఆలోచించే.. వ్యవహరించే.. నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదా? ఉంటుంది.. కానీ ఎవరు పట్టించుకుంటారు అలా చెప్తే?

ముంబై వేదికగా: రుతుస్రావం సమస్యనే తీసుకుందాం. ఆ రోజులు అంటరాని వారిగా చూస్తారు. వారికి స్వేచ్ఛగా బతికే అవకాశం ఇవ్వడం లేదు కాబట్టే తిరుగుబాటు తప్పదంటున్నారు కొందరు మారథాన్‌లు. 'వంటింటి కుందేళ్లుగా ఎన్ని రోజులు బతకాలి'? అంటూ ముంబై వేదికగా నినదించారు. వారిలో ఒక్కొక్కరిది ఒక్కో పంథా. గమ్యం మాత్రం ఒక్కటే. స్త్రీకి స్వేచ్ఛ, మితిమీరిన అడ్డంకులు, పరిమితులు, మూఢాచారాలతో పాతాళానికి తొక్కేస్తే సహించేది లేదు అంటూ వారంతా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

మారథాన్‌లో గళం విప్పి: ముంబైలో టాటా కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న మారథాన్ అది. వేల సంఖ్యలో ఔత్సాహికులు. అంతా లైనప్ అయ్యారు. వారిలో పురుషులు, మహిళలూ ఉన్నారు. మగవారు షాట్స్, స్పోర్ట్స్ బనియన్లతో స్ప్రింట్లు కొడుతున్నారు. మహిళా రన్నర్లు నెక్‌లు, టీ-షర్టులు, లోయర్లతో పరుగెత్తడానికి సిద్ధంగా ఉన్నారు. అంతమందిలోనూ ఏడుగురు మహిళా రన్నర్లు ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. వారంతా నల్లరంగు స్పోర్ట్స్ డ్రెస్ వేసుకున్నారు. అందరికంటే భిన్నంగా స్పోర్ట్స్ బ్రాలు వేసుకున్నారు. వాటిపై కొన్ని నినాదాలు రాసి ఉన్నాయి. అవే.. ఆ నినాదాలే వారి ధిక్కార స్వరాలు. సంస్కృతి పరిరక్షణ పేరుతో స్త్రీల అలవాట్లపై పెడుతున్న ఆంక్షలకు ఆ నినాదాలనే ఆయుధాలుగా ఎంచుకున్నారు. 'సమాజంలో అఘాయిత్యాలు జరగడానికి స్త్రీల దుస్తులు, అలంకరణే కారణం' అనేవారు.. తమ మైండ్‌సెట్ మార్చుకోవాలని వేలమందిలో ఎలుగెత్తి చాటారు. చాటుతున్నారు. వేర్వేరు ఉద్యోగాలతో, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వీరిని ఏకం చేసింది ఒక్కటే కారణం. అదే అణచివేత. అందుకే 'టాటా ముంబై మారథాన్' సాక్షిగా స్పోర్ట్స్ దుస్తులు ధరించి స్త్రీ స్వేచ్ఛ, వస్త్రధారణపై గళం విప్పారు.


కట్టుబాట్లు ఆపలేవు



నైనా, వ్యాపారవేత్త

మారథాన్‌లో నేను ఎలా పరిగెడుతున్నానో చూడాలి. కానీ, కొందరు నా దుస్తుల వైపు చూస్తారు. అది వాళ్ల మానసిక పరిస్థితి. అలాంటి వారి ఆలోచనలు మార్చాలనే నేను ఇప్పుడు ఈ దుస్తులు ధరించాను. కొందరి మాటలు, కట్టుబాట్లు, విమర్శలు నన్ను తీవ్రంగా బాధించాయి. అందుకే నేను ఈ మారథాన్‌లో పాల్గొన్నాను. నేను గతంలోకి చూడాలనుకోవడం లేదు. ఈ విమర్శలు, నమ్మకాలు నన్ను ఆపలేవు. మా ప్రయాణం ఆగదు. అందుకే 'జడ్జిమెంట్ కాంట్ టామ్ మీ' నినాదంతో ముందుకెళ్తున్నా.

పని గురించి మాట్లాడండి



జూహీ
ఫ్యాషన్ డిజైనర్

యువతిగా నేనేం పని చేస్తున్నానో ఆలోచించాలి. నా చదువు, పని గురించి ఆలోచించాలి. దీని గురించి కేర్ తీసుకోవాలి. కానీ నేను ఎలాంటి దుస్తులు వేసుకున్నానని మాట్లాడటం దేనికో అర్థం కాదు. నేను వాళ్లకు చెప్పేది ఇదే.. నా పని గురించి చెప్పండి. తప్పు ఉంటే గుర్తించండి. కానీ వ్యక్తిగత విషయాలపై ఎందుకు చర్చ. 'పే అటెన్షన్' నినాదంతో ముందుకెళ్తున్న.

మైండ్‌సెట్ మారాలి!



షలీన
సెలబ్రెటీ ఫ్యాషన్ డిజైనర్

నా జీవితం నాకు ఎన్నో అనుభవాలను నేర్పింది. వాటి నుంచి చాలా నేర్చుకున్నాను. ఇక్కడి వరకూ రావడానికి ఎన్నో క్లిష్టమైన పరిస్థితులను అధిగమించాను. అన్ని సమస్యలనూ నాకు అనుకూలంగా మార్చుకున్నా. ఈ పురుషాధిక్య సమాజంలో మనుషుల మైండ్ సెట్ మార్చడానికి మనం కష్టపడాలి. ఇప్పుడు నేను చేస్తున్న పని నాకు చాలా సంతోషాన్ని ఇస్తున్నది. ఈ మారథాన్‌లో 'దిస్ ఈజ్ మీ' నినాదంతో నా గళాన్ని వినిపించా.

ప్రతిదానికీ అడ్డు పుల్లలు



మిస్తీ,
ఫిట్‌నెస్ ట్రెయినర్

మనం ఒక లక్ష్యం కోసం ముందుకెళుతున్నప్పుడు.. చాలా మంది మనల్ని వెనక్కి లాగుతారు. అలాంటప్పుడే మానసికంగా చాలా దృఢంగా ఉండాలి. ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతిదానికీ అడ్డు చెప్పే సంస్కృతి ఇంకా నశించలేదు. ఆ పరిస్థితి నుంచి మనం ఎలా గట్టెక్కాలో నేర్చుకోవాలి. మహిళలపై చేసే విమర్శలు, దాడులపై అంతా స్పందించాల్సిన అవసరం ఉంది. మేము మారథాన్‌లో పరుగెడుతూనే తోటి వారిని చైతన్యపరిచాం. సమస్యలపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. మా ఈ ప్రయాణంలో ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెనుకడుగు వేసేది లేదు. 'కాంట్ స్టాప్, వోంట్ స్టాప్' ఇదే నా నినాదం.

విముక్తి కావాలి



అనీష
విద్యార్థి

నా ఆలోచనల పరిధిలో పని చేయడానికి నాకు అవకాశం లేకుండా పోయింది. నేను ఏం బట్టలు వేసుకోవాలో, నాకేవి అనుగుణంగా ఉంటాయో ఇతరులు చెప్పేవారు. స్కూల్‌కి వెళ్లినా, కాలేజీకి వెళ్లినా అమ్మాయిలకు ఒక డ్రెస్ కోడ్ ఉంటుంది. కానీ అబ్బాయిలకు అలాంటిదేమీ ఉండదు. ఇలాంటి ఆలోచనల నుంచి విముక్తి కావాలి. అందుకే 'బ్రేక్ ఫ్రీ' నినాదంతో ముందుకు వెళ్తున్నా.

ఆర్మీ డేర్‌డెవిల్స్‌లో ఓ మహిళ!



ఈ ఏడాదితో డేర్‌డెవిల్స్ టీమ్ 84 యేండ్లు పూర్తిచేసుకోనున్నది. ఈ టీమ్ నుంచి తొలిసారిగా ఓ మహిళా అధికారి బైకుపై విన్యాసాలు ప్రదర్శించనున్నారు. 136 మంది జవాన్లు, 30 బైకులపై జరిగే విన్యాసాల్లో ఆమె పాల్గొననున్నారు. ఎవరామె?



డేర్‌డెవిల్స్.. ఆ పేరులోనే డేరింగ్ ఉంది. పెరేడ్‌లో రిపబ్లిక్ డే రోజున జరిగే అబ్బురపరిచే విన్యాసాలు ప్రదర్శించే ఆర్మీ డేర్‌డెవిల్స్‌లో తొలిసారిగా 28 యేండ్ల మహిళా అధికారి పాల్గొనున్నారు. ఆమె పేరు కెప్టెన్ శిఖా సురభీ. డేర్‌డెవిల్స్ టీమ్‌తో కలిసి రాయల్ ఎన్ఫీల్డ్ 350 బైకుపై విన్యాసాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాదితో డేర్‌డెవిల్స్ టీమ్ 84 యేండ్లు పూర్తిచేసుకోనున్నది. ఆఫ్రో ఏసియన్ గేమ్స్ తదితర జాతీయ క్రీడా పోటీల్లో తమ విన్యాసాలను ప్రదర్శిస్తూ వస్తున్న డేర్‌డెవిల్స్ టీమ్‌లో ఇప్పటివరకు మహిళలు ఎవరూ పాల్గొనలేదు. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్‌లో ముగ్గురు అధికారులు, 136 మంది జవాన్లు 34 బైకులపై విన్యాసాలను ప్రదర్శిస్తారు. వీరితో పాటు సురభీ కూడా బైకుపై నిలుచొని సగర్వంగా సెల్యూట్ చేయనున్నారు. సురభీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పూర్తి చేసింది. తనకు క్రీడలంటే మొదటి నుంచీ ఇష్టం. ఆ ఆసక్తే భారత సైన్యంలోకి చేరేందుకు పురికొల్పింది. ఇంతకు ముందు బాక్సింగ్, బాస్కెట్ బాల్ గేమ్స్‌లో రాణించింది. 'ఆర్మీలోకి రాకముందే నేను బైకులు నడిపాను. బైకుపై లడక్ వరకు ప్రయాణించాను. ఆ అనుభవమే నన్ను డేర్‌డెవిల్స్‌లో చేర్చింది. బుల్లెట్ వంటి బైకుల హ్యాండిల్ వదిలి ప్రయాణం చేయడం అనేది అంత ఈజీ కాదు. ఈ విన్యాసాలు రాత్రికి రాత్రి నేర్చుకున్నది కాదు. దీనికి ఎంతో సాధన చేశాను. మా టీమ్ చేతులు వదిలి బైకు నడపడం , నడుస్తున్న బైకు మీద నిలబడి సెల్యూట్ చేయడం వంటివి నేర్పారు. మూడు నెలలుగా టీమ్‌తో కలిసి ఈ విన్యాసాలను ప్రాక్టీస్ చేయడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం కూడా పెరిగిందని' సురభీ తెలిపింది.

చర్మ రక్షణ ఇలా!



- పగలంతా బయట తిరిగి అలసిపోయి ఇంటికి వస్తారు. ముఖం శుభ్రం చేసుకోకుండా అలానే పడుకుంటారు. దాని వల్ల చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. చర్మానికి మాయిశ్చరైజేషన్ సక్రమంగా చేసుకుంటూ ఉంటే చర్మం కాంతివంతంగా ఉంటుంది.
- నిద్రపోయేముందు కొబ్బరినీరు తాగితే డీహైడ్రేషన్ తగ్గి చర్మం కాంతివంతంగా ఉంటుంది. అలాగే చక్కెరతో కూడిన పండ్లరసాలు తాగకుండా ఉండడమే మంచిది.
- కేవలం నీరు తాగడం వల్ల మాత్రమే శరీరానికి కావలసినంత తేమ అందదు. శరీరం రాత్రంతా హైడ్రేట్‌గా ఉండాలంటే కొన్ని రకాల కూరగాయలు, విత్తనాలను ఆహారంగా తీసుకోవాలి. అవి చర్మాన్ని పొడిబారకుండా చేస్తాయి.
- పార్టీలకు, ఫంక్షన్‌లకు మేకప్ వేసుకుంటారు. తిరిగొచ్చిన తర్వాత మేకప్ తొలిగించకుండా పడుకుంటారు. దీనివల్ల ఉదయం లేచేసరికి ముఖం వికారంగా తయారవుతుంది.
- కొందరు నిద్రించే ముందు చెత్త క్రీములన్నీ పూసుకుంటారు. అలా చేయడం సరికాదు. సహజసిద్ధమైన బ్యూటీ టిప్స్ ఉపయోగిస్తే మంచిది.

II.

నమస్తే తెలంగాణ

నిధి

కరీంనగర్

శనివారం 26 జనవరి 2019



ఎస్‌డబ్ల్యూపీ

క్రమశిక్షణతో విరమణ

మ్యూచువల్ ఇన్వెస్టర్లందరికీ సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (ఎస్ఐపీ)లు సుపరిచితమే. ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకున్న మ్యూచువల్ ఫండ్లలో ప్రతినెలా కొంత మొత్తాన్ని మదుపు చేస్తూ ఉండడమే ఎస్ఐపీ. ఇన్వెస్టర్ల అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని మినహాయించుకునేందుకు మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ (ఏఎంసీ) లేదా డిస్ట్రిబ్యూటర్‌కు ఆథరైజేషన్‌ను ఇవ్వడం ఎస్ఐపీలో ఒక పద్ధతి. మార్కెట్ హెచ్చుతగ్గుదలతో సంబంధం లేకుండా ఎస్ఐపీల ద్వారా సగటు ధరకు ఫండ్లలో మదుపు చేస్తూ పోవడమే వ్యూహం. మార్కెట్ పతనం అయినప్పుడు మరిన్ని ఎక్కువ మ్యూచువల్ ఫండ్ యూనిట్లను, మార్కెట్ పెరిగినప్పుడు తక్కువ యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. ఇలా సగటు ధరలో యూనిట్లను జమ చేయడం వల్ల దీర్ఘకాలంలో అపారమైన సంపదను సృష్టించడానికి వీలవుతుంది.



ఎస్ఐపీ మాదిరిగానే సిస్టమ్యాటిక్ విత్‌డ్రావల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) కూడా ఉంది. ఇది చాలా తక్కువ మంది ఇన్వెస్టర్లకు మాత్రమే పరిచయం ఉన్న పద్ధతి. మరో రకంగా చెప్పాలంటే ఎస్ఐపీకి ఇది పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుంది. ఇన్వెస్టర్ తాను మదుపు చేసిన మొత్తంలో ప్రతీ నెలా కొంత మొత్తానికి రీడీమ్ చేయాలంటూ ఏఎంసీకి ఆథరైజ్ చేయడమే ఎస్‌డబ్ల్యూపీ.

రిస్క్-రివార్డ్‌లను నియంత్రించడం

మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావానికి ఇన్వెస్టర్లు ప్రభావితం కాకుండా ఉండటమే ఎస్ఐపీ లేదా ఎస్‌డబ్ల్యూపీ పద్ధతుల్లోని విశిష్టత. మదుపు చేసిన మొత్తాన్ని ఒకేసారి కాకుండా క్రమపద్ధతిలో వరుసగా కొంత కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకోవడమే ఎస్‌డబ్ల్యూపీ. ఉదాహరణకు ఇన్వెస్టర్ ఎవరైనా సరే రూ. 10 లక్షల వరకు మ్యూచువల్ ఫండ్‌లో మదుపు చేశారని అనుకుందాం. అయితే మార్కెట్ పతనం కారణంగా ఫండ్ ఎన్ఏవీ 30 శాతం మేర నష్టపోయింది. దాంతో ఆ ఇన్వెస్టర్‌కు భారీ నష్టమే వాటిల్లితుంది. మళ్లీ పూర్తి స్థాయిలో రికవరీ అయ్యే వరకూ వేచి ఉండాల్సిందే. ఒకవేళ మదుపు చేసిన మొత్తాన్ని ఒకేసారి వెనక్కి తీసుకున్నట్టయితే, మార్కెట్ ఆ తర్వాత పెరిగితే వచ్చే లాభాలను కోల్పోయినట్టు అవుతుంది.

ఎస్‌డబ్ల్యూపీ రకాలు

ఎస్‌డబ్ల్యూపీ సాధారణంగా రెండు రకాలు. మొదటిది ఫిక్స్‌డ్ విత్‌డ్రాయల్.. రెండోది అప్రిసియేషన్ విత్‌డ్రాయల్. ఫిక్స్‌డ్ విత్ డ్రాయల్‌లో ఒక మొత్తానికి సమానమైన మ్యూచువల్ ఫండ్ యూనిట్లను ప్రతి నెలా రీడీమ్ లేదా అమ్మేసి ఇన్వెస్టర్ అకౌంట్‌లో జమ చేస్తారు. అప్రిసియేషన్ పద్ధతిలో అయితే మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిపై వచ్చిన రాబడికి సమానమైన మొత్తాన్ని మాత్రమే రీడీమ్ చేయవచ్చు.

రిటైర్మెంట్ ఆదాయానికి ఉత్తమం

మదుపు చేసిన మొత్తం నుంచి క్రమ క్రమంగా నిర్ణీత కాలాల్లో ఉపసంహరించుకోవడం ఎస్‌డబ్ల్యూపీ అనుకున్నారు. ఈ పద్ధతి మనకు రెగ్యులర్ ఆదాయ వనరులు లేని సమయంలో ఇన్వెస్ట్‌మెంట్లపైనే మాత్రమే ఆధారపడాల్సి వచ్చినప్పుడు ఉపయోగపడుతుంది. ఉదాహరణకు రిటర్మెంట్ తర్వాత నెల నెలా ఆదాయానికి మంచి సాధనంగా ఉపయోగపడుతుంది. మీ పెట్టుబడులను పూర్తిగా విరమించుకోకుండా మీకు అవసరమైనంత అవసరమైన సమయాల్లో రీడీమ్ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. మ్యూచువల్ ఫండ్ల యూనిట్లను ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) ప్రతిపాదికన విరమించుకోవచ్చు. అంటే తొలుత కొనుగోలు చేసిన యూనిట్ల ముందుగా రీడీమ్ చేసుకోవడం. దీనివల్ల ఆదాయ పన్ను కూడా ప్రయోజనాలను కూడా పొందే వీలుంటుంది.

ఎస్‌డబ్ల్యూపీలు - ఆదాయం పన్ను

మ్యూచువల్ ఫండ్ల రిడెంప్షన్‌లకు వర్తించే పన్ను నిబంధనలే ఎస్‌డబ్ల్యూపీలకు కూడా వర్తిస్థాయి. ప్రతిపాదికనే రీడీమ్ చేసుకోవాలి. అయితే ఆదాయ పన్ను చెల్లింపులు మ్యూచువల్ ఫండ్ల కాలపరిమితి, ఫండ్ లక్షణాన్ని బట్టి ఉంటుంది. ఒకవేళ రీడీమ్ చేసుకున్న యూనిట్లు సంవత్సరంలోపే కాలపరిమితి ఉంటే ఇన్వెస్టర్లు షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను(ఎస్‌టీసీజీ) 15.45 శాతం మేర చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఒకే సంవత్సరం పైబడి కాలపరిమితి ఉన్న మ్యూచువల్ ఫండ్ యూనిట్లను రీడీమ్ చేస్తే పది శాతంకు పైగా వచ్చే రాబడులపై దీర్ఘకాల క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) పన్నును 10 శాతం మేర చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ డెట్ మ్యూచువల్ ఫండ్ అయితే మూడేండ్ల వరకూ ఎస్‌టీసీజీ నే వర్తిస్తుంది. మూడేండ్ల పైబడి ఉండే ఫండ్లపై 20.6 శాతం ఇండెక్సేషన్ బెనిఫిట్స్ ఎల్‌టీసీజీని చెల్లించాల్సి ఉంటుంది.

క్రమశిక్షణ అవసరం..

క్రమశిక్షణ కలిగిన ఇన్వెస్టర్‌కు క్రమశిక్షణతో కూడిన రిడెంప్షన్లు కూడా అవసరమే. ఇలాంటి సందర్భాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించినవే ఎస్‌డబ్ల్యూపీలు. మదుపు చేసిన మొత్తంపై రాబడులను పొందుతూనే వాటిని విత్ డ్రా చేసుకునే వీలు కల్పించే ఎస్‌డబ్ల్యూపీలు.

అదిల్ శెట్టి
సీఈఓ, బ్యాంక్ బజార్ డాట్ కామ్



ఎస్ఐపీ ఎంపిక ఎలా?

మార్కెట్లో స్వల్ప కాలంలో వచ్చే ఒడిదుడుకులు కొత్త ఇన్వెస్టర్లకు ఓ పెద్ద తలనొప్పి. ఇలాంటి మార్కెట్‌లో మదుపు చేయడం సవాలే. ఈ ఒడిదుడుకుల రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునేవారు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారంలలో మదుపు చేయడం ఒకప్పటి మాట. ఇప్పుడు పరిస్థితులు మారాయి. మ్యూచువల్ ఫండ్లలో ప్రతీనెలా సిస్టామాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) ద్వారా మదుపు చేయడం నేటి ట్రెండ్. స్వల్పకాలిక ఒడిదుడుకులు, తప్పుడు సమయాల్లో మదుపు చేస్తే ఉండే రిస్క్‌ల నుంచి సిప్‌లు ఇన్వెస్టర్లను కాపాడతాయి. సిప్ పద్ధతిలో మదుపు చేయడం కూడా సులభమే. అయితే సిప్ రూపంలో మదుపు చేసే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. మీ రాబడి అంచనాలకు తగ్గట్టుగా, ఎంతకాలానికి రాబడిని ఆశిస్తున్నారో మొదట తెలుసుకొని అందుకు తగ్గట్టు సరైన ఫండ్‌ను సిప్ కోసం ఎంపిక చేసుకోవాలి. ఒడిదుడుకులు మదుపు ప్రక్రియలో ఓ భాగం. మార్కెట్ హెచ్చుతగ్గులకు గురవుతున్నప్పుడు సిప్‌లను నిలిపివేయరాదు. దీర్ఘకాలంలో అలాంటి ఒడిదుడుకులకు అర్థం ఉండదు. మ్యూచువల్ సగటున కొనుగోలు చేయడం వల్ల ఉండే ప్రయోజనాలనూ పొందవచ్చు. వివిధ రకాల మార్కెట్ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొగల సాధనంగా సిప్ పనిచేస్తుంది. మనం చేయాల్సిందల్లా ఓ మంచి ఫండ్‌ను ఎంపిక చేసుకోవడమే. సిప్ కోసం ఫండ్‌ను ఎంపిక చేసుకోవడంలో అవలంభించాల్సిన పద్ధతులేమిటో తెలుసుకుందాం.

1 రేటింగ్: మీరు ఎంపిక చేసుకున్న కేటగిరిలో మంచి రేటింగ్ ఉన్న ఫండ్ల జాబితాను తయారు చేయండి. 4 లేదా 5స్టార్స్ ఉన్న ఫండ్లను మాత్రమే ఎంపిక చేయండి. రేటింగ్‌లను వివిధ వెబ్‌సైట్లు అందిస్తున్నాయి. ఆ ఫండ్ ఎంత కాలం నుంచి ఉంది, ఎంత రాబడిని స్థిరంగా ఇస్తున్నది, ఏయూఎం వ్యయాల నిష్పత్తి వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జాబితాను తయారు చేయండి. జాబితాలో నుంచి ఉత్తమ ఫండ్ ఎంచుకోండి.

2 ఫండ్ వయసెంత? కొత్తగా వచ్చి ఫండ్ల పనితీరును అంచనా వేయలేం కనుక వాటిని మీ జాబితాలో నుంచి తీసివేయండి. ఐదేండ్ల లోపు ఫండ్లను జాబితాలో నుంచి తొలగించండి. 7 నుంచి 10 ఏండ్ల పైబడి ఉన్న ఫండ్లనే జాబితాలో ఉంచండి. దీర్ఘకాలంగా ఉన్న ఫండ్ల పనితీరును, రాబడులను బేరిజు వేయడానికి చరిత్ర అందుబాటులో ఉంటుంది. అలాంటి ఫండ్లు మార్కెట్ ఒడిదుడకులన్నింటినీ ఎదుర్కొని నిలచి ఉన్నవే.

3 రాబడుల్లో నిలకడ: జాబితాలో మిగిలిన వాటిలో అవి అందించిన రాబడులను మదింపు చేయండి. గత కొన్ని సంవత్సరాలలో వివిధ మార్కెట్ పరిస్థితుల్లో ఎలాంటి రాబడులను అందించాయో పరిశీలించండి. మార్కెట్ పతనం అయినప్పుడు వాటి ఎన్ఏవి ఎంత పతనం అయింది? మార్కెట్ బుల్లిష్‌గా ఉన్నప్పుడు ఎలాంటి రాబడులను అందించింది? అన్న అంశాలను పరిశీలించండి. మంచి ఫండ్ అయితే మార్కెట్ కన్నా తక్కువ పతనం కావడం, మార్కెట్ కన్నా ఎక్కువ రాబడిని ఇవ్వడం జరుగుతుంది. ఎస్ఐపీల కోసం ఫండ్ ఎంపిక చేసుకునేప్పుడు గత మూడు నుంచి ఐదేండ్ల కాలం ఏటా సగటున ఎంత రాబడిని ఇచ్చాయన్న అంశాన్ని పరిశీలించండి. గత ఏడాది కాల రాబడులను అంచనా వేయడం వల్ల ప్రయోజనం వుండదు.

4 ఫండ్ మేనేజర్: మ్యూచువల్ ఫండ్‌ను నిర్వహిస్తున్న ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డును పరిశీలించండి. ఒక వేళ ఇటీవలే ఫండ్ మేనేజర్ మారినట్టయితే అతను నిర్వహించిన ఇతర ఫండ్ల పనితీరును పరిశీలించండి. ఫండ్ మేనేజర్ మార్పు కూడా ఫండ్ పనితీరు మీద ప్రభావం చూపుతుంది. చాలా వరకు ఫండ్ మేనేజర్ల మార్పులు తక్కువగానే ఉంటాయి. ఒకే ఫండ్ మేనేజర్ దీర్ఘకాలంగా నిర్వహిస్తున్న ఫండ్ అయితే అతని పనితీరును అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది.


సిప్ (ఎస్ఐపీ) ప్రధాన ఉద్దేశ్యం రిస్క్‌ను దీర్ఘకాలానికి స్ప్రెడ్ చేయడమే. సిప్ మదుపు ద్వారా కాస్త అధిక రిస్క్‌నే తీసుకోవచ్చు. మార్కెట్ ఒడిదుడుకులన్నింటినిలోనూ మదుపు చేస్తాం కనుక మనకు సగటు ధరను పొందుతాం. నిలకడగా రాబడిని ఇస్తున్న ఫండ్‌ను సిప్ కోసం ఎంపిక చేసుకోవడం ఉత్తమ మార్గం. ఒకటి కన్నా రెండు మూడు ఫండ్లలో సిప్‌లను చేయడం వల్ల రిస్క్‌ను వివిధీకరించుకోవచ్చు. మార్కెట్ ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతూ ఉంటే సిప్‌కు అంతకు మించిన సమయం మరోకటి ఉండదు.

హరీశ్ జైన్
కో ఫౌండర్&సీఓఓ
గ్రో డాట్ కామ్



ఏ ఫండ్లలో పెట్టుబడులు మేలు

ఇతర వాటితో పోలిస్తే మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు మేలని పలువురు ఆర్థిక సలహాదారులు సూచిస్తున్నారు. పుణెకు చెందిన 35 ఏండ్ల వయస్సు కలిగిన నిరంజన్ జోషి ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. పదవీ విరమణ తర్వాత ఆర్థికంగా ప్రయోజనం ఉండే ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. దీంతో భవిష్యత్తుపై ఆయనకు మంచి భరోసా లభించినట్లు అయింది. ఇది ఒక్క జోషి అభిప్రాయం కాదు..దేశవ్యాప్తంగా ఉన్న యువతి యువకులది. పదేండ్లక్రితం ఉద్యోగం ప్రారంభించిన నాటి నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెడుతున్న జోషికి మాత్రం.. ప్రస్తుతం వీటి ద్వారా వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉండటంతో ఆయన ఆందోళన వర్ణనాతీతం. దీంతో ఆయన ఆలోచనల్లో మార్పులు మొదలయ్యాయి. కొద్దిమేర రిస్క్ ఉన్నప్పటికీ అధిక రిటర్నులు పంచేవాటివైపు పెట్టుబడులను మళ్లించాలని నిర్ణయం తీసుకున్నారు. 2014లో ఆయన చేతిలో మిడ్ క్యాప్ షేర్లతోపాటు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టినవి ఉన్నాయి. ఆ తర్వాతి క్రమంలో ఈక్విటీకి అనుసంధానం కలిగిన పొదుపు పథకాలపై తన పెట్టుబడులను బదలాయించారు. ఎస్ఐపీలను నాలుగు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీంలుగా విడగొట్టే ఉద్దేశంలో భాగంగా ఈఎల్ఎస్ఎస్, లార్జ్, మిడ్-క్యాప్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. స్వల్పకాలం పాటు ఎలాంటి నిధులు అవసరం లేనివారు..భవిష్యత్తులో రిస్క్ ఉన్నదాంట్లో పెడితే అధిక రిటర్నులు పంచనున్నాయి. ఈక్విటీ ఫండ్లతో పోలిస్తే అధిక రిస్క్ ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టిన వారికి 10-11 శాతం రిటర్నులు లభించనున్నాయి. కానీ వీటికంటే మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి అధిక లాభంచేకూరింది. ఈక్విటీ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసిన వారు ఆర్థికంగా చాలా నష్టపోయారని, ఇదే సమయంలో ఫండ్లలో ఇన్వెస్ట్ చేసిన వారు లాభపడ్డారు. ద్రవ్యోల్బణం భయాలు స్టాక్ మార్కెట్లను చుట్టుముట్టడంతో స్టాక్‌లలో ఇన్వెస్ట్ చేయడానికి మదుపరులు జంకుతున్నారు. పనిచేసే సమయంలోనూ..పదవీ విరమణ చేసేవరకు ఈక్విటీ ఫండ్లలో పెట్టుబడులు పెట్టిన వారి చేతిలోనే దీర్ఘకాలికంగా ఉండనున్నదని, ద్రవ్యోల్బణ గణాంకాలు తీవ్ర ఆటుపోటులకు గురైనప్పుడు ఇవి ఆర్థికంగా సహాయం అందించనున్నాయి. పదవీ విరమణ చేసిన తర్వాత కనీసంగా 20 ఏండ్ల నుంచి 25 ఏండ్లపాటు ఈ పెట్టుబడులు ఆర్థికంగా దన్నుగా నిలువనున్నాయని ల్యాడర్ 7 ఫైనాన్షియల్ అడ్వైజర్ వ్యవస్థాపకుడు సురేశ్ సదాగోపన్ తెలిపారు. పదవీ విరమణ తర్వాత ఒకేసారి వచ్చే ఆదాయాన్ని వివిధ రూపాల్లో ఇన్వెస్ట్ చేయడం మంచిదని ఆయన సూచించారు. నెల నెల ఒక ఫిక్స్‌డ్ ఆదాయం వచ్చే మాదిరిగా ఇన్వెస్ట్ చేయాలని అప్పుడే వృద్యాప్య సమయంలో చిన్న చిన్న అవసరాల నిమిత్తం డబ్బుకు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశాలు లేవు. ఒకవేళ స్థిర ఆదాయ సాధానాల్లో మొత్తం పెట్టుబడులు పెడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఇదే సమయంలో రిస్క్ కూడా తప్పదని ఆయన హెచ్చరించారు. పదవీ విరమణ చేసిన తర్వాత ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడం కష్టతరం కానున్నదని, కానీ ఉద్యోగ సమయంలో వీటిని చేరుకోవాలని సూచించారు. కానీ, రిటైర్‌మెంట్ తర్వాత చాలా మంది ప్రపంచ దేశాలను చుట్టి రావడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. కొందరు వారి మనుమరాళ్ల వద్ద ఉండటానికి ఆసక్తి చూపుతుండగా, మరికొందరు ఈ సంపాదనలో సంక్షేమానికి బహుమతిగా అందచేయనున్నారు. చాలామంది తెలివిపరులు సరైన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. గడిచిన ఏడాదికాలంలో సరాసరిగా స్మాల్ క్యాప్ ఫండ్లు 20.37 శాతం నష్టపోగా, ఇదే సమయంలో మిడ్ క్యాప్ ఫండ్లు 14.06 శాతం తగ్గాయి. ఇదే సమయంలో అతిపెద్ద సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారి కేవలం 1.39 శాతం మాత్రమే నష్టపోయారు. లార్జ్‌క్యాప్ ఫండ్ ద్వారా సేకరించిన నిధులను 100 స్టాకులలో ఇన్వెస్ట్ చేయనున్నారు. అత్యధిక మంది ఆర్థిక సలహాదారులు..తమ పెట్టుబడులను లార్జ్‌క్యాప్ ఫండ్లలో మాత్రమే ఇన్వెస్ట్ చేయాలని సూచిస్తున్నారు.



ఫండ్ విభాగం	5 ఏండ్లు	10 ఏండ్లు
	(రిటర్నులు శాతాల్లో)	
నిఫ్టీ	11.57	14.96
లార్జ్ క్యాప్	13	15.77
మల్టీ క్యాప్	15.66	18.09
అగ్రెస్సివ్ హైబ్రిడ్	13.66	15.38

నిలవాలి.. గెలవాలి..

గడిచిన సంవత్సరం మదుపరులను ఎన్నో రకాలుగా పరీక్షించింది. ముఖ్యంగా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లు విపరీతమైన ఒడిదుడుకులకు లోనయ్యారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్).. ఈక్విటీ మార్కెట్ల రీ-రేటింగ్, మళ్లీ ప్రవేశపెట్టిన దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను (ఎల్‌టీసీజీ), కార్పొరేట్ రంగంలో చోటుచేసుకున్న పరిణామాలు, స్థూల ఆర్థిక హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ విపత్కర పరిణామాలు, స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వర్గీకరణలతో ప్రభావితమయ్యాయి. మదుపరుల నుంచి ఫండ్ మేనేజర్లదాకా అందరిపైనా వీటి ప్రభావం ఉండగా, సలహాదారులకూ మినహాయింపు లేకుండాపోయింది. స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్ విలువ హరించుకుపోగా, లార్జ్‌క్యాప్ షేర్లు ప్రతికూలతల్ని తట్టుకుని కాస్తోకూస్తో లాభాలను పొందగలిగాయి. వీటిలో ఐటీ రంగ షేర్లు మినహా చాలావరకు ఇతర రంగాల షేర్ల విలువ పెరిగింది.

స్టాక్ మార్కెట్లలో గత ఏడాది అనేక ఎదురుదెబ్బలను మదుపరులు చవిచూశారు. మదుపరులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చిన పోర్టుఫోలియోలు కూడా ఏమీ లేవు. డాలర్ విలువ బలపడటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను నిలకడగా పెంచుతూపోవడం వంటి పరిణామాల మధ్య విదేశీ మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణకే మొగ్గుచూపారు. కానీ దేశీయ మదుపరులు మాత్రం పెట్టుబడులకే ఆసక్తి కనబరిచారు. విశ్వాసాన్ని వీడకుండా ముందుకు సాగారు. అయినప్పటికీ స్థూలంగా సూచీలు నష్టాలనే చూపడంతో ఒక్కసారి పోర్టుఫోలియోల పునఃపరిశీలన అవసరం ఉందన్న భావన భారతీయ మదుపరుల్లో కలిగింది. ప్రస్తుత ఫండ్స్‌పై వారికి అనేక అనుమానాలూ తలెత్తాయి.

పెట్టుబడులు అనేవి లాభనష్టాలకు అతీతంగా ఉంటాయి. ఒక్కోసారి లాభాలను అందించిన పెట్టుబడులు.. మరికొన్నిసార్లు నష్టాలకే పరిమితం కావచ్చు. అంతమాత్రం చేత పెట్టుబడులకు దూరం కావడం అసలైన మదుపరుల లక్షణం కాదు. వరుసగా నష్టాలు వాటిల్లుతున్నప్పుడు.. మన నిర్ణయాలను సమీక్షించుకోవడం ఉత్తమం. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేకానేక అంశాలకు లోబడి ఉంటాయి. దేశ, విదేశీ పరిణామాలకు ప్రభావితం అవుతూ ఉంటాయి. ఈ క్రమంలో ఒడిదుడుకులు అత్యంత సహజం అనేది ప్రతీ ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఏ షేర్లు ఎలాంటి పరిణామాలకు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నాయి అన్నది గమనిస్తే.. నష్టాల నుంచి బయటపడే వీలున్నది. ప్రతీ షేర్‌పై ఏదో ఒక అంశం ప్రభావం అనేది తప్పక ఉంటుంది. అది కొన్నిసార్లు లాభిస్తే, మరికొన్నిసార్లు నష్టపరుస్తుంది. కనుక తరచూ ప్రతికూల పరిణామాలే ఎదురైతే సదరు షేర్లలో పెట్టుబడులకు దూరంగా ఉండటమే మంచిది.



ఇక మొదటగా, మదుపరి అంచనాలు ఏవిధంగా ఉన్నాయి.. ఏ పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్నాడు.. అన్నదానిపై సలహాదారులు దృష్టిసారించాలి. దీంతో ఎలాంటి పెట్టుబడులకు మదుపరి నైజం సరిపోతుందన్నదానిపై ఓ అవగాహనకు రాగలం. అప్పుడే మదుపరుల అంచనాలకు తగ్గట్లుగా ప్రతిఫలాల్ని సృష్టించగలం. మదుపరులు కూడా మరిన్ని పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులపై ముందుకు రాగలుగుతారు. అయితే మొదట్లోనే ప్రతికూల పవనాలు వీస్తే మాత్రం జాగ్రత్తలు తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే పెట్టుబడులు అంటేనే మదుపరులు భయపడిపోయే ప్రమాదం ఉన్నది. కాబట్టి ఫండ్ మేనేజర్లు.. తమ క్లయింట్లను తగిన విధంగా మార్చుకోవాల్సి ఉంటుంది.

రెండోది, అధిక లాభాలు అనేవి ఎప్పుడూ సాధ్యం కాదు. ముఖ్యంగా తరచూ ఒడిదుడుకులకు లోనయే స్టాక్ మార్కెట్లలో ఇది అస్సలు వీలుపడదు. కాబట్టి మదుపరులు ఈ నిజాన్ని గ్రహించాలి. సలహాదారులూ వారికి ముందే తెలియజేస్తే.. ప్రతికూల పరిస్థితుల్లో ఇబ్బందులుండవు. అయితే ఏ షేర్లలో లేదా ఎలాంటి పెట్టుబడులు ఎక్కువ లాభాల్ని అందిస్తాయన్నది తెలుసుకుని అడుగేస్తే చక్కని రాబడులను అందుకోగలం. అంతేగాక స్వల్పకాలిక ప్రయోజనాలు, దీర్ఘకాలిక లాభాలపై స్పష్టత ఉండటం అవసరం. కొన్ని పెట్టుబడులు త్వరగా లాభాలను పంచిపెడితే.. మరికొన్ని ఆలస్యంగా ప్రతిఫలాల్ని అందిస్తాయి. త్వరగా లాభించే పెట్టుబడులు.. అంతే త్వరగా ఒడిదుడుకులకు లోనవుతాయన్న విషయం మరువరాదు.

మూడోది, నిన్న నష్టాలను అందించిన పెట్టుబడులు.. నేడు లాభాలను ఇవ్వవచ్చు. రేపు తిరిగి నష్టపోనూవచ్చు. కాబట్టి పెట్టుబడులను ఎప్పుడూ ఒకే రకంగా అంచనా వేయడం సరి కాదు. ఇప్పటిదాకా మంచి ప్రతిఫలాల్ని అందించాయి.. ఇక పైనా ఇలాగే ఉంటుంది అనుకోవడానికి ఎంతమాత్రం వీల్లేదు. భవిష్యత్తును ఎవరూ నూటికి నూరుపాళ్లు అంచనా వేయలేరు. పెట్టుబడులకు సురక్షితం అనుకున్న రంగాలేవీ లేవంటే అతిశయోక్తి కాదు. లాభాలపై ఎవరూ కూడా స్పష్టమైన పూచీకత్తు ఇవ్వలేరు. నమ్మకంతోనే ముందుకు సాగాలి. పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలి అన్న పెద్దల సామెత గుర్తుండే ఉంటుంది. కాబట్టి పోయినేడాది నష్టపోయాం.. ఈ ఏడాది కూడా నష్టపోతామనే భావన సరికాదు. ఆశాభావంతో ముందుకెళ్తే అంతిమ విజయం మనదే.

నాలుగోది, పెట్టుబడులపట్ల చిత్తశుద్ధి అవసరం. తగినంత సమయం కేటాయిస్తేనే స్టాక్ మార్కెట్లలో రాణించగలుగుతాం. సరైన వ్యూహంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంటుంది. స్టాక్ మార్కెట్లు అత్యంత సున్నితమైన పెట్టుబడుల వేదికలు. ప్రతి చిన్న అంశం సూచీలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి పెట్టుబడులకు ముందు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని అడుగేయాలి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నాయి? అన్నది కూడా గమనిస్తూ ముందుకెళ్తే.. మన పెట్టుబడులు అర్థవంతంగా ఉంటాయి. లేదంటే ఆరంభంలోనే నష్టాలు పలుకరించడం ఖాయం. దీర్ఘకాలంలో లాభాలకు అవకాశాలున్న రంగాలను ఎంచుకుంటే నిర్దిష్టమైన, స్థిరమైన ప్రతిఫలాలను పొందవచ్చు.

చివరగా, సమయానుసారంగా పెట్టుబడుల తీరుతెన్నులను పరిశీలించడం మదుపరుల బాధ్యత. ఈ విషయంలో ఏమరుపాటు అస్సలు పనికిరాదు. మన నిర్ణయాలు లాభిస్తున్నా.. సమీక్ష అనేది అత్యంత ఆవశ్యకమే. నష్టాలు వచ్చినప్పుడే సమీక్షించుకుందాం.. అప్పటిదాకా మన నిర్ణయాలు సరైనవేనన్న ఒంటెత్తు పోకడ మంచిది కాదు. అతి విశ్వాసం ఎప్పుడూ కూడా చేటే. అది మనలోని తెలివిని, సమర్థతను మింగేస్తుంది. కాబట్టి నిత్య విద్యార్థిలా ఉంటేనే విజయాలు చేకూరుతాయి. ఇకపోతే పోర్టుఫోలియోల ఎంపిక చాలాచాలా ముఖ్యమైనది. ఈ విషయంలో తొందరపాటు నిర్ణయాలు నష్టాలకు దారితీయవచ్చు. నిపుణుల ద్వారా సరైన సలహాలతో ముందుకెళ్తే ఆశించిన లాభాలు అందివస్తాయి.

కే నరేశ్ కుమార్
సహ వ్యవస్థాపకులు,
వెలాసిటీ,
వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ
knk@wealocity.com



సుడోకు

డైలీ సుడోకు 47 సమాధానం

2	1	6	3	9	5	8	4	7
3	9	7	4	1	8	5	2	6
8	4	5	6	2	7	9	1	3
6	8	1	7	4	2	3	9	5
4	3	9	1	5	6	2	7	8
7	5	2	8	3	9	4	6	1
9	6	3	5	7	4	1	8	2
1	2	8	9	6	3	7	5	4
5	7	4	2	8	1	6	3	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 48

					7			
2		4		3		7	1	
			6	9				5
		3	7		6	8		
	5		9					
8	1		5		2		9	3
				6				2
	7	1						9
6								

నమస్తే తెలంగాణ

సంపద

కరీంనగర్

శనివారం 26 జనవరి 2019

ఫ్లాట్లను డెవలపర్లు సకాలంలో అందించకపోతే.. వారి నుంచి కొనుగోలుదారులు వడ్డీ వసూలు చేయవచ్చని మహారాష్ట్ర రెరా ఛైర్మన్ గౌతమ్ ఛటర్జీ స్పష్టం చేశారు. అపార్టుమెంట్ అయినా విల్లా అయినా స్థలయజమానికీ అట్టి నిర్మాణంలో బాధ్యత ఉంటుందన్నారు. రెరాపై అవగాహన సదస్సును ఇటీవల తెలంగాణ రెరా అథారిటీ సీడీఎంఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. 1.1.2017 తర్వాత స్థానిక సంస్థల నుంచి అనుమతి తీసుకునే ప్రతి ప్రాజెక్టు రెరా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. కొందరు డెవలపర్లు ప్లాన్లను మారుస్తుంటారని.. అలాంటి మార్పుల్ని చేసినా.. రెరా పరిధిలోకి వస్తారని వెల్లడించారు. రెరాకు సంబంధించి పలు కీలకమైన విషయాల్ని వివరించారు. సారాంశం ఆయన మాటల్లోనే..

ఫ్లాట్ ఆలస్యమైతే.. పరిహారమే!



ఒకవేళ డెవలపర్లు ఫ్లాట్లను అందజేయడం ఆలస్యమైతే.. కొనుగోలుదారులు వడ్డీని వసూలు చేయవచ్చు. రెరాలో పేర్కొన్న తేదీ కంటే ఏమాత్రం ఫ్లాట్ అప్పగింత ఆలస్యమైనా.. ఈ విషయాన్ని రెరా దృష్టికి తీసుకొస్తే పరిష్కారం లభిస్తుంది. ఒకవేళ, ప్రమోటర్ చెప్పిన తేది కంటే మరీ ఎక్కువ ఆలస్యం జరిగినట్లయితే.. రెరా చట్టం 2016 సెక్షన్ 18 ప్రకారం, ఆయా ప్రాజెక్టులో నుంచి కొనుగోలుదారులు నిష్క్రమించవచ్చు. తనకు రావాల్సిన సొమ్మును తీసుకుని వెనక్కి వచ్చే వెసులుబాటును రెరా చట్టం కల్పిస్తున్నది.

కో- ప్రమోటర్..

హైకోర్టు తీర్పు ప్రకారం కో- ప్రమోటర్ అనే పదం రెరాలో లేనే లేదు. కానీ, రెవెన్యూ రికార్డుల్లో స్థల యజమాని వాటా ఉంటే.. అట్టి స్థల యజమానిని కూడా ప్రమోటర్ (స్థలయజమాని)గా రెరాలో పేర్కొంటారు. స్థల యజమానులు తమ భూమిని అపార్టుమెంట్లు లేదా విల్లాల్ని నిర్మించేందుకు డెవలపర్‌కు అందజేయడాన్ని మనం చూస్తుంటాం. అయితే, నిర్మాణం విషయంలో అంతా డెవలపర్‌దే బాధ్యత అని చాలామంది స్థల యజమానులు భావిస్తుంటారు. ఏదైనా సమస్య వస్తే డెవలపర్ మీదే నెట్టేయడానికి ప్రయత్నిస్తారు. కానీ, స్థల యజమాని కూడా ఆయా ప్రాజెక్టుకు ప్రమోటర్ కాబట్టి.. అతనికీ బాధ్యత ఉంటుంది. రెరా ప్రకారం.. ఎవరి బాధ్యత ఏమిటనే విషయాన్ని నిర్ణయించడానికి, వారి మధ్య కుదిరిన ఒప్పంద పత్రం ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటారు.

అధిక శాతం యజమానులుంటే?

కొన్ని సందర్భాల్లో బడా ప్రాజెక్టుల్ని చేయాల్సి వచ్చినప్పుడు.. అధిక స్థలం కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఎక్కువ మంది స్థలయజమానుల్ని ప్రాజెక్టులో భాగస్వామ్యుల్ని చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో రెరాలో ప్రాజెక్టును నమోదు చేసేటప్పుడు.. అందరి స్థలయజమానుల పేర్లను తప్పకుండా పేర్కొనాల్సి ఉంటుంది. సంబంధిత స్థల యజమానికి గల స్థలాన్ని బట్టి.. అతని వివరాల్ని రెరాలో పొందుపర్చాలి.

ఇప్పటికే ఆలస్యం.. మళ్లీ రెరా అనుమతి?

ఒక నిర్మాణాన్ని ప్రారంభించాలంటే పలు ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతి తీసుకోవాలి. దీనికే అధిక సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ రెరా వద్ద అనుమతి తీసుకోవడం వల్ల.. ప్రాజెక్టు ఆలస్యమవుతుంది. అయితే, ఇతర విభాగాలకు అనుమతుల్ని త్వరగా మంజూరు చేసేలా.. సూచనల్ని ఇచ్చే విధంగా రెరాను తీర్చిదిద్దాలి. ఈ విషయం కేంద్రం దృష్టికి వెళ్లింది. దీనిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉన్నది.

ఎస్క్రోలో స్థలయజమాని వాటా..

కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తంలో 70 శాతాన్ని ఎస్క్రో ఖాతా (ప్రత్యేక బ్యాంకు ఖాతా)లో జమ చేయాలన్నది నిబంధన. ఈ మొత్తాన్ని ఎవరి నిష్పత్తి ప్రకారం వారు జమ చేయాలి. అంతేతప్ప, డెవలపర్లే ఎస్క్రో ఖాతాలో జమ చేయాలి.. స్థల యజమానులు చేయకూడదనే నిబంధన ఏమీ లేదు. రెవెన్యూ వాటా స్థలయజమాని పేరు పొందుపర్చి ఉంటే.. అతను కూడా 70 శాతాన్ని జమ చేయాలన్న దానితో బాధ్యుడు అవుతారు.

ఒకవేళ స్థల యజమానులు ఒప్పుకోకపోతే..

కొన్ని సందర్భాల్లో స్థలయజమానులు రెరా నిబంధనల్ని పాటించడానికి అంగీకరించడం లేదు. డెబ్బయ్ శాతం సొమ్మును ఎస్క్రో ఖాతాలో జమ చేయడానికి ముందుకు రావడం లేదు. అసలు, రెరా నిబంధనల్ని పాటించడానికి సానుకూలంగా లేరు. ఇలాంటి పరిస్థితుల్లో డెవలపర్లు.. ఆయా కేసుల్ని రెరా దృష్టికి తీసుకురావాలి. వారిద్దరు రాసుకున్న ఒప్పందం ప్రకారం, సమస్యను రెరా పరిష్కరిస్తుంది.

70-30 శాతం?

రెరా చట్టం ప్రకారం, కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన సొమ్ములో 70 శాతాన్ని ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలో జమ చేయాలి. అట్టి సొమ్ముతో నిర్మాణ పనుల్ని చేపట్టాలి. ఈ లెక్కల్ని రెరా పర్యవేక్షిస్తున్నది. మిగతా ముప్పయ్ శాతం సొమ్మును ఇతర అవసరాల నిమిత్తం వినియోగించుకోవచ్చు.

చిన్న మార్పులుంటే ఏం చేయాలి?

డెవలపర్లు ప్రారంభించిన అపార్టుమెంట్లు 1.1.2017 కంటే ముందే పూర్తయిన తర్వాత.. స్వల్ప మార్పులకు అనుమతిని 1.1.2017 తర్వాత తీసుకుని నిర్మించినా.. అట్టి సముదాయం రెరా పరిధిలోకి వస్తుందని గుర్తుంచుకోండి. ప్రమోటర్ తప్పనిసరిగా ఆయా ప్రాజెక్టును రెరాలో నమోదు చేయించాలి.

ఐదేండ్ల దాకా డెవలపర్‌దే బాధ్యత..

స్ట్రక్చరల్, సేవాలోపాలు వంటి అంశాల్ని రెరా చట్టం 2017 సెక్షన్ 14 (3) లో పేర్కొనలేదు. అయినప్పటికీ, ఐదేండ్ల దాకా నిర్మాణ లోపాల బాధ్యత డెవలపర్‌దే. ఈ విషయంలో ఎలాంటి అస్పష్టత అక్కర్లేదు. కాకపోతే, ఈ చట్టం సక్రమంగా అమలయ్యే విధంగా రెరా అథారిటీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్లాట్లు రీసేల్ చేస్తే?

కొంతమంది 2017 కంటే ముందే ప్లాట్లు కొనుగోలు చేసి ఉన్నారు.. అలాంటి వారంతా ప్రస్తుతం విక్రయిస్తున్నారు. ఇలాంటి లావాదేవీలు రెరా పరిధిలోకి రావు. కేవలం 2017 జనవరి 1 తర్వాత ఆరంభమైన వెంచర్లు మాత్రమే రెరా పరిధిలోకి వస్తాయి. అలాంటి వాటిలో కొనుగోలు చేసేవారు.. రెరా నుంచి ప్రమోటర్ అనుమతి తీసుకున్నాడా ? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవాలి. ఆతర్వాతే ముందడుగు వేయాలి. మొదటిసారి ప్లాటు కొన్నవారు.. తిరిగి అదే ప్లాటును విక్రయిస్తే.. రెరా పరిధిలోకి రారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

సొంతంగా ప్రాజెక్టు చేపడితే..

అమ్మకం నిమిత్తం కాకుండా సొంతంగా ప్రాజెక్టును చేపడితే.. అట్టి నిర్మాణం రెరా పరిధిలోకి రానే రాదు. ఎందుకంటే, ఇక్కడ అమ్మకాలంటూ ఏమీ జరగలేదు. కాబట్టి, రెరా పరిధిలోకి వచ్చే అవకాశమే లేదు.

టైటిల్ ఇన్సూరెన్స్?

రెరా నిబంధనల ప్రకారం.. ప్రతి ప్రాజెక్టుకు టైటిల్ ఇన్సూరెన్స్‌ను తప్పకుండా తీసుకోవాలనే నిబంధన ఏమీ లేదు. కాబట్టి, ఈ విషయంలో చింతించాల్సిన అవసరమేం లేదు.

రియల్టర్‌పై

11.20 కోట్ల జరిమానా?



దేశీయ రియల్ రంగంలోనే సంచలనం.. భారతదేశంలో రెరా అథారిటీ ఏర్పాటయ్యాక.. ప్రప్రథమంగా ఒక రియల్టర్‌పై రూ.11.20 కోట్ల జరిమానాను విధించేందుకు తెలంగాణ రెరా అథారిటీ సమాయత్తం అవుతున్నది. యావత్ భారత రియల్ రంగంలో సంచలనం సృష్టిస్తూ.. తెలంగాణ రెరా అథారిటీ అడుగులు ముందుకేస్తున్నది.



హైదరాబాద్‌లో కొందరు రియల్టర్లు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా తెలంగాణ రెరా అథారిటీ దృష్టికొస్తున్నాయి. కొనుగోలుదారులను అమాయకులుగా చేసి ఆటాడుకుంటున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక సంస్థనేమో రెరా అనుమతి తీసుకోకుండా యథేచ్ఛగా ప్లాట్లు అమ్ముతుంటే.. మరొక రెరా ఏజెంటు నమోదు కాని వెంచర్‌లో ప్లాట్లను విక్రయిస్తున్నారు. వీరి నుంచి భారీ స్థాయిలో జరిమానాను విధించడానికి తెలంగాణ రెరా అథారిటీ సిద్ధమవుతున్నది. పూర్తి వివరాల్లోకి వెళితే..

- రెరా అథారిటీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా షాద్‌నగర్‌లో ఒక సంస్థ ప్లాట్లను విక్రయిస్తున్నది. విషయం తెలుసుకున్న తెలంగాణ రెరా అథారిటీ ఆయా రియల్టర్‌కు షోకాజ్ నోటీసును 2018 డిసెంబరు 11న జారీ చేసింది. అయినప్పటికీ, ఆ సంస్థ నుంచి స్పందన రాకపోవడంతో.. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో పది శాతం జరిమానాను విధించేందుకు సిద్ధమైంది. రెరా ప్రకారం.. ఈ సంస్థ మొత్తం 2.60 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో ప్లాట్లను విక్రయిస్తున్నది. బ్రోచర్ ప్రకారం.. గజానికి రూ.4,299 చొప్పున ప్లాట్లను విక్రయిస్తున్నది. దీని ప్రకారం లెక్కిస్తే.. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.112 కోట్లుగా నమోదైంది. దీనిపై పది శాతం జరిమానాను లెక్కిస్తే.. రూ.11.20 కోట్లుగా లెక్క తేలింది. ఈ సంస్థ బ్రోచర్లను రెరా అథారిటీ సేకరించింది.

- ప్రభుత్వమెంతో ప్రతిష్ఠాత్మకంగా యాదాద్రిని అభివృద్ధి చేస్తుంటే.. కొందరు అక్రమార్కులేమో అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని రెరా చెబుతున్నది. యాదాద్రి చేరువలోని చిన్న కందుకూరులో ఓ రెరా రిజిస్టర్డ్ రియల్ ఎస్టేట్ ఏజెంట్.. 'ఒక వెంచర్‌ను మార్కెట్ చేస్తున్నాడు. ఇందులో ప్లాటు కొనాలా? వద్దా? అని ఒక పెద్దాయన మాసబ్ ట్యాంకులోని రెరా కార్యాలయానికి విచ్చేశారు. దీంతో, ఆశ్చర్యపోయిన అధికారులు రెరా అనుమతి లేని వెంచర్‌ను.. రెరాలో అనుమతి పొందిన ఏజెంట్ విక్రయిస్తున్నాడని చర్యలకు ఉపక్రమించారు. ప్రాజెక్టు వ్యయం మొత్తాన్ని లెక్కిస్తే.. రూ.6.75 కోట్లుగా తేలింది. దీనిపై పది శాతం అంటే, రూ.67.50 లక్షలు జరిమానాను వసూలు చేయడానికి 'రెరా' అడుగు ముందుకేసింది.

ఈస్ట్ హైదరాబాద్ ప్రాపర్టీ షో..

టీబీఎఫ్, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో | **వరంగల్ హైవేలో ప్రాపర్టీ ప్రదర్శన..** | **ఫిబ్రవరి 2, 3 తేదీల్లో..**

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా కలిసి ఉప్పల్‌లో ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో బోడుప్పల్ సర్కిల్‌లోని బిగ్‌బజార్ ఎదురుగా మహారాజా ఫంక్షన్ హాల్‌లో జరగనున్నది. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో.. స్టాళ్లను ఏర్పాటు చేయడానికి 23 సంస్థలు ముందుకొచ్చాయి. ఈస్ట్ హైదరాబాద్‌లోని పలు సంస్థలు విక్రయించే అపార్టుమెంట్లు, ఓపెన్ ప్లాట్లు, ఫామ్ స్థలాలకు సంబంధించిన సమాచారం ఈ ప్రదర్శనలో లభిస్తుందని టీబీఎఫ్ జనరల్ సెక్రెటరీ జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు. హరిహరా, ఎస్ఎన్ బిల్డర్స్, హెచ్‌వీ కన్‌స్ట్రక్షన్స్, ట్రై కలర్ ప్రాపర్టీస్, మై ఎన్‌వైర్, ఫుల్‌హౌజ్, ఏవీ కన్‌స్ట్రక్షన్స్ వంటివి స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయని వెల్లడించారు. ఉప్పల్ మెట్రో డిపో, పోచారంలో ఐటీ పరిశ్రమ, ఎయిమ్స్, యాదాద్రి వంటి వాటిలో తూర్పు హైదరాబాద్ విశేషంగా అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్తులో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకునేవారు.. తమకు నచ్చిన ప్లాట్లను ఎంచుకోవడానికిదే సరైన వేదిక అన్నారు. ప్రస్తుతం ఇల్లు లేదా ఫ్లాట్ కొనుక్కోవాలని ప్రయత్నించేవారికి కావాల్సిన ప్రాజెక్టుల సమాచారం ఈ ప్రాపర్టీ షోకి విచ్చేస్తే లభిస్తాయన్నారు.



లుక్ ఈస్ట్..


తూర్పు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపెడుతుందని, ఐటీ సంస్థల్ని ఈ ప్రాంతం వైపు ఆకర్షించేందుకు విడిగా లుక్ ఈస్ట్ పాలసీకి రూపకల్పన చేసిన ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్లలో రూ.45 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించిందన్నారు. ఇతర పట్టణాల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తారని వెల్లడించారు. దీంతో, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని అభిప్రాయపడ్డారు. ఈ ప్రదర్శనకు విచ్చేసి ఫ్లాటు కొనే వారికి ఎస్‌బీఐ రుణం మంజూరు చేస్తుందన్నారు.

కర్టెన్ల ఎంపికకు.. కొలతలే కీలకం!

కిటికీలకు అమర్చే కర్టెన్ల వల్ల కాలుష్యం నుంచి రక్షించుకోవటంతో పాటు ఇంటి అందాన్ని పెంపొందించుకోవచ్చు. అయితే కర్టెన్లు ఎలా ఉండాలి.. ఎలాంటి రంగులు ఎంపిక చేసుకోవాలనేది.. వారి అభిరుచులను బట్టి ఉంటుంది. కర్టెన్ల కొనుగోలులో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అనుకున్నట్లుగానే ఇంటి అందం మరింత ద్విగుణీకృతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముందుగా కర్టెన్ల కొలతల్ని పక్కాగా చూసుకోవాలి. కిటికీ పొడవు, వెడల్పుల కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పలు రకాల వస్త్రాలతో తయారు చేసిన కర్టెన్లు మార్కెట్‌లో ఉన్నాయి. సిల్క్, కాటన్ కర్టెన్లకు మంచి డిమాండ్ ఉంది. గదుల రకాలను బట్టి వీటిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ముదురు రంగు కర్టెన్ల కంటే లేత రంగు కర్టెన్లు అన్ని గదులకు సరిపోతుంది. సహజమైన గాలి,



వెలుతురు ఇంట్లోకి వచ్చేందుకు వీలుంటుంది. అయితే వ్యక్తిగత జీవితాన్ని కోరుకునే వారికి ముదురు రంగు కర్టెన్లే సరైన ఎంపిక. కర్టెన్ల వెనుక వైపు కాంతిని తగ్గించుకునే, పెంచుకునే ప్యానెళ్లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇవి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.


వెంకీ, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, అఖిల్, నిధి అగర్వాల్

టైటిల్ గౌరవాన్ని నిలబెట్టాం!

అఖిల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'మిస్టర్ మజ్ను'. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు సినిమాకు మంచి విజయాన్ని అందించారు. మా సంస్థకు మరో పెద్ద హిట్ లభించింది. దర్శకుడి సంభాషణలు, టేకింగ్, తమన్ సంగీతం అందరిని మెప్పిస్తున్నది. అఖిల్ నటనకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. మంచి కథ కుదిరితే అఖిల్‌తో మరో సినిమా తీయడానికి సిద్ధమే' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'అక్కినేని అభిమానిగా ఎంతో సంతోషంగా ఉన్నాను. అఖిల్‌ను డైరెక్ట్ చేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఈ చిత్రంలో పైరసీ ఇష్యూను సరదాగా చూపించి చివరలో సందేశాన్ని జోడించాం' అన్నారు. అఖిల్ మాట్లాడుతూ 'థియేటర్‌లో సినిమా చూశాను. ప్రేక్షకులు చివరి నిమిషం వరకు నవ్వుతూనే ఉన్నారు. ఈ సినిమా విజయంపై ముందు నుంచి గట్టి నమ్మకంతో ఉన్నాం. మా నమ్మకం నిజమైంది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయాలనే నా కల ఈ సినిమాతో నెరవేరింది. నిర్మాత ప్రసాద్‌గారు మా తాతగారితో సినిమా చేశారు. ఇప్పుడు నాకు కూడా మంచి హిట్ అందించారు. ఆయన మరిన్ని మంచి విజయాలు అందుకోవాలి. 'మజ్ను' మా అక్కినేని కుటుంబానికి గౌరవాన్ని తీసుకొచ్చిన టైటిల్. ఈ సినిమా ద్వారా ఆ టైటిల్ గౌరవాన్ని నిలబెట్టాం' అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, కథానాయిక నిధి అగర్వాల్ పాల్గొన్నారు.


న్యూ టైటిల్స్

రవితేజ 'డిస్కోరాజా'



ఒకప్పుడు ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసే రవితేజ గత కొంతకాలంగా స్పీడు తగ్గించాడు. 'అమర్ అక్బర్ ఆంటోని' పరాజయం తర్వాత ఆయన నటించనున్న తాజా చిత్రం షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. విఐ ఆనంద్ దర్శకత్వంలో రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'డిస్కోరాజా' టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం రవితేజ జన్మదినం సందర్భంగా ఈ చిత్ర టైటిల్ లోగోను విడుదల చేస్తారు. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ ప్రధాన నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మరో ఇద్దరు హీరోయిన్స్ రవితేజతో నటించనున్నారు.

సాయి శ్రీనివాస్ 'సీత'



ఘనమైన కమర్షియల్ విజయం కోసం ఎదురుచూస్తున్న బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటిస్తున్న తాజా చిత్రానికి 'సీత'అనే టైటిల్‌ను నిర్ణయించారు. తేజ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సాయి శ్రీనివాస్ సరసన కాజల్ అగర్వాల్ నాయికగా నటిస్తుంది. అనిల్‌సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనూప్‌రూబెన్స్ స్వరాలను అందిస్తున్నాడు.

మరిన్ని నవ్వుల కోసం..


దిల్‌రాజు, తమన్నా, అనిల్ రావిపూడి

'ప్రస్తుతం శతదినోత్సవాలు, సిల్వర్‌జూబ్లీ వేడుకలు కనుమరుగైపోయాయి. యాభై, వంద కోట్ల షేర్, గ్రాస్ లెక్కలకు ప్రాధాన్యతపెరిగింది. వసూళ్లకు సంబంధించిన జ్ఞాపికల్ని థియేటర్లకు పంపించే కొత్త సంప్రదాయానికి ఈ సినిమాతో శ్రీకారం పలుకుతున్నాం' అని అన్నారు దిల్‌రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించిన చిత్రం 'ఎఫ్-2'. వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నాయకానాయికలుగా నటించారు. అనిల్ రావిపూడి దర్శకుడు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ' సినీ ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరూ మంచి సినిమా చేశామని ప్రశంసిస్తున్నారు. రెండు వారాలు పూర్తయిన చక్కటి వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ సినిమాను దర్శకుడు అనిల్ రావిపూడి పలు అద్భుతమైన సన్నివేశాలను తెరకెక్కించారు. నిడివి దృష్ట్యా అన్నింటిని చూపించలేకపోయాం. వాటిలో నుంచి ఐదు కామెడీ సన్నివేశాల్ని శనివారం నుంచి సినిమాకు అదనంగా జోడిస్తున్నాం. కొత్త సన్నివేశాలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతాయనే నమ్మకం ఉంది.' అని తెలిపారు. దర్శకుడు అనిల్ రావిపూడి కథ చెప్పినప్పుడు ఎంత ఉత్సుకతకు లోనయ్యానో చిత్రీకరణలో ప్రతి రోజు అదే ఎగ్జైట్‌మెంట్ కలిగిందని తమన్నా చెప్పింది. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'వంద కోట్ల గ్రాస్ క్రెడిట్ ఏ ఒక్కరిదో కాదు. టీమ్ సమిష్టి కృషి వల్లే అది సాధ్యమైంది. పది పన్నేండేళ్లుగా వినోదానికి దూరమయ్యారు వెంకటేష్. మళ్లీ పాత వెంకీని ఈ సినిమా ఆవిష్కరించింది. వరుణ్‌తేజ్ ఇప్పటివరకు కామెడీ సినిమాలు చేయలేదు. తెలంగాణ యాసలో తనదైన శైలి నటనతో నటించాడు. ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపును ఈ సినిమా తీసుకొచ్చింది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి, కాసర్లశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్

అభినవ 'సూర్యకాంతం'

నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సూర్యకాంతం'. ప్రణీత్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. మార్చి 29న ప్రేక్షకులముందుకురానుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. 'రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నిహారిక కొణిదెల పాత్ర చిత్రణ కొత్త పంథాలో ఉంటుంది. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. ఆద్యంతం హాస్యభరితంగా అందరిని ఆకట్టుకునే చిత్రమిది' అన్నారు. శివాజీరాజా, సుహాసిని తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: హరిజ్ ప్రసాద్, సంగీతం: మార్క్ కె రాబిన్, సంస్థ: నిర్వాణ సినిమాస్, నిర్మాతలు: సందీప్ ఎర్రంరెడ్డి, సృజన్ యారబోలు, రామ్ నరేష్, సమర్పణ: వరుణ్‌తేజ్.

86 వసంతాల తెలుగు సినిమా


కృష్ణ, విజయనిర్మల, ధర్మారావు తదితరులు

కె. ధర్మారావు రచించిన '86 సంవత్సరాల తెలుగు సినిమా' గ్రంథాన్ని సీనియర్ నటులు కృష్ణ, విజయనిర్మల దంపతులకు అంకితమిచ్చారు. ఈ అంకితోత్సవ వేడుక హైదరాబాద్‌లోని కృష్ణ నివాసంలో సినీ ప్రముఖుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా రచయిత కె. ధర్మారావు మాట్లాడుతూ సినీ అభిమానిగా దశాబ్దాలుగా తాను సేకరించిన సమాచారంతో 86 సంవత్సరాల తెలుగు సినిమా గ్రంథాన్ని రచించానని తెలిపారు. ఈ గ్రంథ రచన కోసం తాను సంగ్రహించిన సమాచారాన్ని చూసి గతంలో దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు ప్రశంసించారని పేర్కొన్నారు. ఆయన అభినందనలతో తాను పడిన కష్టం మొత్తం మరిచిపోయానని ధర్మారావు చెప్పారు. సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమకు ఈ గ్రంథం ఒక ఎన్‌సైక్లోపీడియాగా ఉపయోగపడుతుందని చెప్పారు. 484 పేజీలు, ఇరవై నాలుగు పేజీల రంగుల పుటల సమ్మిళితంగా విలువైన సమాచారం, చక్కటి ఫొటోలతో తెలుగు సినిమా విశేషాలను ఈ గ్రంథంలో ధర్మారావు అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. తెలుగు సినిమా విశేషాలతో కూడిన ఈ గ్రంథాన్ని తమకు అంకితం ఇవ్వడం ఆనందంగా ఉందని కృష్ణ, విజయనిర్మల చెప్పారు.